PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
# ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 188 | విజయవాడ, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 9 February 2025 | Rs



**కార్పొరేట్ల దెబ్బకు రిటైల్ మార్కెట్లు కుదేలు**
- సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత

2




**100మీ. స్ప్రింట్ విజేతలు అనిమేశ్, సుదేష్ణ**
- 38వ జాతీయ క్రీడలు

8

# ఢిల్లీలో బిజెపి

- 48 స్థానాలతో విజయం
- 22 స్థానాలకే పరిమితమైన ఆప్
- ఓట్ల వ్యత్యాసం 1.99 శాతమే
- ఖాతా తెరవని కాంగ్రెస్

**ఫలితాలు ఇలా..**




| పార్టీ | స్థానాలు |
|---|---|
| ఆప్ | 22 |
| బిజెపి | 48 |
| కాంగ్రెస్ | 0 |
| ఇతరులు | 0 |

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొందింది. మూడుసార్లు వరుసగా గెలిచిన అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమి పాలైంది. 27 ఏళ్ల తరువాత కమలం పార్టీ ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకుంది. 1998 నుంచి 2013 వరకు వరుసగా 15 ఏళ్ల పాటు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్ వరుసగా మూడోసారి కూడా ఖాతా తెరవలేదు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. మొత్తం 70 స్థానాలకు గానూ, బిజెపి 48 స్థానాలను, ఆప్ 22 స్థానాలనూ గెలుచుకున్నాయి. ఈ ఎన్నికల్లో ఆప్ ఓటు బ్యాంక్ దాదాపు పది శాతం తగ్గింది. బిజెపి ఓటు బ్యాంక్ ఎనిమిది శాతం పెరిగింది. కాంగ్రెస్‌కు రెండు శాతం ఓట్లు పెరిగాయి. బిజెపి, ఆప్ మధ్య ఓట్ల వ్యత్యాసం 1.99 శాతం మాత్రమే ఉంది. బిజెపి గెలుపొందిన కొన్ని నియోజకవర్గాల్లో స్వల్ప మెజార్టీ వచ్చింది.

**ప్రముఖుల ఓటమి**

ఈ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు ఓటమి పాలయ్యారు. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, మంత్రులు సత్యేందర్ జైన్, సౌరభ్ భరద్వాజ్, మాజీ సిఎం షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్, బిజెపి సీనియర్ నేత రమేష్ బిధూడి ఓటమి చవిచూశారు.

**ఆరు స్థానాల్లో వెయ్యి నుంచి రెండువేల మధ్య ఓట్ల తేడాతో బిజెపి గెలుపు**

మూడు స్థానాల్లో వెయ్యి లోపు, మూడు స్థానాలు రెండు వేల లోపు ఓట్లతో బిజెపి అభ్యర్థులు గెలుపొందారు. జంగపూర్ నియోజకవర్గం నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాపై బిజెపి అభ్యర్థి తర్వీందేర్ సింగ్ 675 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సంగం విహార్ నుంచి ఆప్ అభ్యర్థి దినేష్ మోహానియాపై చందన కుమార్ చౌదరి 344 ఓట్ల మెజారిటీతో, త్రిలోక్‌పురి నుంచి ఆప్ అభ్యర్థి అంజనా పర్చపై బిజెపి అభ్యర్థి రవికాంత్ 392 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తిమార్పూర్ స్థానంలో ఆప్ అభ్యర్థి సురీందర్ పాల్ సింగ్‌పై బిజెపి అభ్యర్థి సూర్య ప్రకాష్ 1,168 ఓట్ల తేడాతో, రాజేంద్ర నగర్ స్థానంలో ఆప్ అభ్యర్థి దుర్గేష్ పాఠక్‌పై బిజెపి అభ్యర్థి ఉమాంగ్ బజాజ్ 1,231 ఓట్ల తేడాతో, మెహ్రౌలి స్థానంలో ఆప్ అభ్యర్థి మహేంద్ర చౌదరిపై బిజెపి అభ్యర్థి గజేంద్ర సింగ్ యాదవ్ 1,782 ఓట్ల తేడాతో గెలుపొందారు.

**అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయి : ప్రధాని మోడీ**

ఢిల్లీ ఎన్నికల్లో అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. 'ప్రజల శక్తి అత్యున్నతం. అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయి. బిజెపికి చారిత్రాత్మక మిగతా 7లో


# ఏజెన్సీకి ఎసరు!

## గిరిజనుల హక్కులకు పాతర

### అటు పంప్డ్‌స్టోరేజి ప్రాజెక్టులు...ఇటు టూరిజం పథకాలు

**ఈ చట్టాల పరిస్థితి ఏమిటి?**

గిరిజన ప్రాంతాల్లో భూమిని సేకరించే ముందు తప్పనిసరిగా కొన్ని చట్టాలను పరిగణలోకి తీసుకోవాల్సిఉంది. అవి
- ఏజెన్సీ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్ (1/70)
- పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ (పెసా) యాక్ట్
- పర్యావరణ పరిరక్షణ చట్టం (1986)
- అటవీ (సంరక్షణ) చట్టం (1980)
- వన్యప్రాణ సంరక్షణ చట్టం (1972)
- జల (కాలుష్య నియంత్రణ,నిరోధక) చట్టం (1974
- పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ (2006)
- అటవీహక్కుల పరిరక్షణ చట్టం (2006)
- జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం (2010)
- వాయు (కాలుష్య నియంత్రణ, నిరోధక) చట్టం 1981



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

అడవి పుత్రుల ఆవాసం ...ఏజెన్సీ ప్రాంతానికి ముప్పు పొంచి ఉంది. అభివృద్ధి పేరుతో గిరిజనుల హక్కులను పాలకవర్గాలు పాతరేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రకృతి వైభవానికి, జీవ వైవిధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న తూర్పు కనుమలపై కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ శక్తులు కన్నేసి ఉన్నాయి. వాటిని కబ్జా చేయడానికి రకరకాలుగా ప్రయత్నిస్తున్నాయి. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల డిమాండ్లు నెరవేర్చడానికి పెద్దపీట వేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అధికారంలో ఉన్నంత కాలం బిజెపి అడుగులకు మడుగొలిత్తిన వైసిపి ప్రభుత్వం ఇటువంటి విధానాలనే అమలు చేసింది. తాజాగా అధికారంలో ఉన్న టిడిపి కూటమిలో బిజెపి భాగస్వామి కావడంతో ఏజెన్సీ ప్రాంతానికి ఎసరు పెట్టడానికి సిద్ధమౌతోంది. కొద్ది రోజులక్రితం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గిరిజనుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా రూపొందించిన 1/70 చట్టం వల్ల అభివృద్ధి జరగడం లేదని, దానిని సవరించాలంటూ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందే కొందరు సినీ ప్రముఖుల కళ్ళు ఈ ప్రాంతంపై పడ్డట్టు వార్తలు వచ్చాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లా గుజ్జిలి గ్రామంలో 1500 మెగావాట్లు, చిట్టంవలస గ్రామంలో 800 మెగావాట్లు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ చేసిన ప్రతిపాదనలకు రాష్ట్రమంత్రిమండలి ఆమోదం తెలిపింది. చంపావతి నదిపై గుజ్జిల గ్రామంలోనూ, శారదినదిపై చిట్టంవలస గ్రామం లోనూ ఈ ప్రాజెక్టుల నిర్మాణం సాగనుంది. గుజ్జిలి గ్రామంలో 673.13 ఎకరాలు, చిట్టంవలసలో 500 ఎకరాల భూమి ఈ పంప్ట్ స్టోరేజి ప్రాజెక్టుల నిర్మాణం కోసం అవసరమౌతుందని ఈ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వివిధ పాలసీల్లోనూ ఏజెన్సీ ప్రాంతాల్లో వివిధ పరిశ్రమలను, టూరిజం ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అంశాన్ని ప్రస్తావించిన సంగతి తెలిసిందే!

**గత ప్రభుత్వ హయంలో**

అల్లూరి సీతారామరాజు జిల్లా రైవాడ రిజర్వాయర్ నీళ్ల వచ్చే పేదకోటలో 1500 మెగావాట్లు ప్రాజెక్టును అదానీకి గత ప్రభుత్వం అప్పగించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో పాచిపెంట మండలంలోని బొదురుగడ్డ నదిపై కురుకుర్తిలో 1200 మెగావాట్లు, కర్రివలసలో 1000 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేసేందుకు అదానీ కంపెనీకి అప్పగించింది. అల్లూరి సీతారామరాజు చిల్లాలోని ఎర్రవరంలోని జలపాతం వద్ద 1200 మెగావాట్ల ప్రాజెక్టుల షిర్డి సాయి ఎలక్ట్రికల్స్‌కు అప్పగించారు. ఎర్రవరంలో 736 ఎకరాలు, పెదకోటలో 500 ఎకరాలు, కురుకుర్తిలో 450 ఎకరాలు, కర్రివలసలో 388 ఎకరాల్లో ఈ ప్రాజెక్టులు కోసం కావాలని లెక్కలు తేల్చారు.

**భూమి ఎలా...?**

ఏజెన్సీ ప్రాంతం రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ కిందకు వస్తుంది. అటవీ హక్కుల చట్టం ప్రకారం అటవీ భూమి లేదా అటవీ నివాసుల హక్కులను ప్రభావితం చేసే ప్రాజెక్టులపై సంబంధిత గ్రామ సభల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని చట్టాలు చెబుతున్నాయి. అయితే, రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పిఎస్‌పి ప్రాజెక్టుల గురించి అక్కడ నివసిస్తున్న గిరిజనులకు ఏ మాత్రం సమాచారం ఉండటం లేదు. గత మిగతా 7లో



## న్యాయవ్యవస్థ ఎంతో దృఢమైంది

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి
- మదనపల్లిలో అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

3

## రూపాయి మార్పులపై ఆందోళన లేదు



- మార్కెట్ శక్తుల చేతుల్లోనే విలువ
- ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

3

## పంటలకు మద్దతు ధర ఇవ్వాలి

- తక్షణమే 'అన్నదాతా సుఖీభవ' అమలు చేయాలి
- ఏపి రైతు సంఘం డిమాండ్

2

## భూముల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్

- మహిళల పేరిట పట్టాలు మంజూరు

2

## ఇఎపిసెట్‌కు కన్వీనర్‌గా జెఎన్‌టియు ప్రొఫెసర్ వివి సుబ్బారావు

- ఉన్నత విద్యామండలి ప్రకటన

2

# 'అన్నదాతా సుఖీభవ'పై అయోమయం

- విధి, విధానాలపై తీవ్ర జాప్యం
- ముగిసిన ఖరీఫ్, చివరిలో రబీ
- రెండవ సంవత్సరం నుంచి పథకంప్రారంభం
- తొలేడాది సాయానికి ఎగనామం!



**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి**

రైతులకు ప్రతి ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామన్న 'అన్నదాతా సుఖీభవ..' పథకం విధి, విధానాలపై అస్పష్టత వీడట్లేదు. టిడిపి కూటమి అధికారంలోకొచ్చింది మొదలు తొమ్మిది మాసాలుగా స్కీం అమలుకు నిబంధనలు రూపొందిస్తున్నామంటున్నారు తప్ప అవి ఒక కొలిక్కి రావట్లేదు. పలు కేబినెట్ భేటీల్లో ఈ అంశం చర్చకొచ్చిందని లీక్ చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాలపై శుక్రవారంనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘంగా సమీక్షించగా, 'అన్నదాతా...' ప్రస్తావన రాలేదని ఆ సమావేశంలో పాల్గొన్న ముఖ్యులు వెల్లడించారు. కూటమి సర్కారు వచ్చాక ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ ముగింపు దశకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న ఆర్థిక సాయంలో ఒక్క రూపాయి కూడా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు. ప్రకృతి విపత్తుల వలన ఖరీఫ్‌లో రైతులు భారీ నష్టాలు చవి చూశారు. రబీ సైతం అంతంతమాత్రంగానే ఉంది. ఈ తరుణంలో ప్రభుత్వ సాయం కోసం ఉత్కఠతో రైతులు ఎదురు చూస్తున్నారు. విధి, విధానాల రూపకల్పన పేరిట జాప్యం చేస్తుండటంపై ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా 'అన్నదాతా..' వచ్చే ఖరీఫ్ ముందు ప్రారంభిస్తారని సమాచారం. ఆ మేరకు 2025-26 బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదిస్తారని తెలిసింది. అయితే మొదటి సంవత్సరం ఇవ్వాల్సిన బకాయిలతో కలిపి ఇస్తారా, లేదంటే తొలేడాది ఇవ్వాల్సిన సాయాన్ని ఎగ్గొడతారా అనేదానిపై స్పష్టత రాలేదు.

**వైసిపి దారిలో...**

రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని కూటమి మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఈ వాగ్దానాన్ని 'సూపర్ సిక్స్'లో మూడవదిగా ప్రముఖంగా పొందుపర్చారు. అధికారంలోకి రాగానే గత వైసిపి ప్రభుత్వం దారిలోనే కేంద్ర పథకం పిఎంకిసాన్‌తో కలిపి అమలు చేస్తామని చూచాయగా చెప్పడం మినహా ఇప్పటి వరకు నిబంధనలు ఖరారు చేయలేదు. పిఎం కిసాన్‌తో అంటే కౌలు రైతులను కేంద్రం పరిగణనలోకి తీసుకోదు కనుక పిఎం కిసాన్ ఆశ కౌల్దార్లకు లేదు. సొంత భూమి కలిగిన రైతులకు ఏడాదిలో మూడు విడతల్లో పిఎం కిసాన్ రూ.6 వేలు వస్తాయి. వీటికి కేంద్రం పలు కొర్రీలు వేయడంతో లబ్ధిదారుల సంఖ్య క్రమేపి తగ్గిపోతోంది. ఆ మేరకు రాష్ట్ర పథకానికి కూడా లబ్ధిదారులు తగ్గిపోతారు. పైపెచ్చు ఒకేసారి కాకుండా సంవత్సరంలో మూడు తడవలు సాయం అనడంతో కొంచెం కొంచెం అందే నగదు సాయం వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న ఈ తరుణంలో సాగు ఖర్చులకు ఏ మూలకూ చాలవు. రాష్ట్రంలో 76 లక్షల మిగతా 7లో

# విజనరీ పాలనతోనే మార్పు

## ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సమర్థ, సుస్థిర, విజనరీ పాలనతోనే ప్రజల జీవితాల్లో మార్పులు సాధ్యమని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత ఐదేళ్ళలో రాష్ట్రంలో వైసిపి, ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో వాతావరణ కాలుష్యం, పొలిటికల్ పొల్యూషన్ కారణంగా ప్రజలు అక్కడికి వెళ్లడం మానివేస్తున్నారని అన్నారు. పీపుల్స్ ఫస్ట్ నినాదానికి ఢిల్లీ ఫలితాలే ఉదాహరణ అని చంద్రబాబు అన్నారు. 'అభివృద్ధి జరిగితే సంపద సృష్టించవచ్చు. సంపద వస్తే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది.

ఆ ఆదాయం ఖర్చుపెడితే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయవచ్చు. తలసరి ఆదాయం పెంచి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగపరచవచ్చు' అని అన్నారు. 2047 నాటకి రాష్ట్రంలో 2.4ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఉండాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. సంపద సృష్టించలేని వారికి బటన్‌నొక్కే అర్హత లేదన్నారు. లిక్కర్‌లో జోక్యం చేసుకున్న కుటుంబాలు బాగుపడవని, గత ఐదేళ్లలో లిక్కర్ మాఫియాను నడిపారని చంద్రబాబు విమర్శించారు. వ్యవస్థలను నాశనం చేశారని, దేవతలు ధ్యానం చేసిన రిషికొండలో ప్యాలెస్‌కట్టుకున్నారని, ఢిల్లీలోనూ అక్కడి పాలకులు శేషమహల్ కట్టుకున్నారని చెప్పారు. రెండు చోట్లా ప్యాలెస్‌ల్లోకి వెళ్లలేకపోయారన్నారు.



హమాస్ నేతలతో ఇరాన్ సుప్రీం ఖమేనీ

# అమెరికా బెదిరింపులకు భయపడం

- హమాస్ నేతలతో ఇరాన్ సుప్రీం ఖమేనీ

**టెహరాన్ :** అమెరికా చేసే బెదిరింపులు, హెచ్చరికలు తమ వైఖరిపై ఎలాంటి ప్రభావాన్ని చూపవని ఇరాన్ సుప్రీమ్ లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అన్నారు. టెహరాన్‌లో హమాస్ తాత్కాలిక నేత ఖలీల్ అల్ హయ్యా, మరో ఇద్దరు నేతలతో శనివారం ఆయన భేటీ అయ్యారు. ఈ వార్తకు సంబంధించిన ఫోటోలు, వివరాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. ఫొటోల్లో హమాస్ లీడర్‌షిప్ కౌన్సిల్ అధినేత మహ్మద్ దార్విష్, మరో హమాస్ ఉన్నతాధికారి నిజార్ అవదల్లా కనిపిస్తున్నారు. "మీరు యూదు ప్రభుత్వాన్ని (ఇజ్రాయిల్) ఓడించారు. వాస్తవానికి అది అమెరికా ఓటమే." అని ఖమేని పాలస్తీనా ప్రతినిధి బృందంతో వ్యాఖ్యానించారని ఇరాన్ ప్రభుత్వ టివి పేర్కొంది. వారి లక్ష్యాలేవీ సాధించడానికి మీరు అనుమతించరాదు' అని ఆయన స్పష్టం చేసినట్లు పేర్కొంది. ఇరాన్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా ఖమేనిని అభినందించడానికి పాలస్తీనా నేతలు కలిశారని ఆ వార్తలు తెలిపాయి. గాజాలో ఇజ్రాయిల్ నరమేధంపై పోరులో హమాస్‌కు ఇరాన్ మద్దతునిస్తోంది. ఇలా మద్దతు కొనసాగిస్తున్నందుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. గాజాలో, వెస్ట్ బ్యాంక్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, సాధించిన విజయాలపై వారు ఖమేనికి ఒక నివేదిక అందజేశారు. ఇప్పటివరకు సాధించిన వాటి పట్ల ఒకింత గర్వంతో మిమ్మల్ని కలిసేందుకు వచ్చామని ప్రతినిధి బృందం అన్నట్లు టివి వార్తలు పేర్కొన్నాయి. ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా చేసే బెదిరింపులు, హెచ్చరికలు తమ వైఖరిపై ఎలాంటి ప్రభావాన్ని చూపవని ఖమేనీ వ్యాఖ్యానించారు.

## బ్రిటానియా బిస్కట్లు ప్రియం..!

**బెంగళూరు :** ప్రముఖ ఎఫ్‌ఎంసిజి కంపెనీ బ్రిటానియా ఇండస్ట్రీస్ మార్చి ముగింపు నాటికి తమ ఉత్పత్తుల ధరలను 4.5 శాతం పెంచాలని యోచిస్తోంది. ఇదే విషయాన్ని ఆ కంపెనీ ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా శుక్రవారం వెల్లడించింది. 2024 డిసెంబర్ త్రైమాసికంలోనూ 2 శాతం ధరలను పెంచింది. దీంతో అదనంగా రూ.100 కోట్ల రెవెన్యూను పొందినట్లు పేర్కొంది.

గడిచిన త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ 6.5 శాతం పెరిగి రూ.4,463 కోట్లకు చేరినట్లు పేర్కొంది. నికర లాభాలు 4.5 శాతం వృద్ధితో రూ.582 కోట్లుగా నమోదయ్యాయి. ఈ ద్రవ్యోల్బణం తగ్గడం లేదనీ ప్రతీ ఒక్కరు అంచనాకు వచ్చారని బ్రిటానియా వైస్ చైర్మన్ వరుణ్ బెర్రి పేర్కొన్నారు.

ప్రభుత్వం విధించిన పామాయిల్ సుంకాలు, కోకో ధరలు ప్రభావం చూపుతున్నాయన్నారు. తృణధాన్యాలు 6.5 శాతం, నూనెలు, కొవ్వులు దాదాపు 15 శాతం, కూరగాయలు, పండ్ల ద్రవ్యోల్బణం అధికంగా ఒక్క అంకె లేదా రెండంకెల స్థాయిలలో పెరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

### వాల్తేరు డివిజన్ మొత్తాన్ని

# సౌత్‌కోస్ట్‌లోనే ఉంచాలి

- కెకె.లైన్, అరకును రాయగడకు మళ్లించడంతో రాష్ట్రానికి నష్టం
- విశాఖలో సిపిఎం నిరసన




విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)**

కెకె లైన్, అరకు సహా పాత వాల్తేరు డివిజన్ మొత్తాన్ని సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లోనే కొనసాగించాలంటూ కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన విశాఖ రైల్వే స్టేషన్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డును విశాఖలో ఏర్పాటు చేయాలని, సౌత్ కోస్ట్ జోన్‌కు అవసరమైన నిధులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఆ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల సుదీర్ఘ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. అయితే, కేంద్రం నిర్ణయించిన నూతన విశాఖ డివిజన్‌లో పాత వాల్తేరు డివిజన్‌లో కీలకంగా ఉన్న కొత్తవలస-కిరండోల్ (కెకె లైన్) రైలు మార్గం లేదని, దీన్ని ఒడిశా రాష్ట్రంలోని రాయగడ డివిజన్‌లో కలిపేశారని తెలిపారు. ఇది విశాఖ, ఉత్తరాంధ్ర, ఆంధ్ర రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు నష్టం కలుగజేసే చర్యని అన్నారు. దేశంలోని అన్ని రైల్వే డివిజన్ల కన్నా వాల్తేరు రైల్వే డివిజన్ ఆదాయ సముపార్జనలో మొదటి స్థానంలో ఉందని, సంవత్సరానికి రూ.10,500 కోట్ల ఆదాయం పొందడం వెనుక సరుకు రవాణా, కెకె లైన్ వంటివి దోహదకారిగా ఉన్నాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కెకె.లైన్‌ను విశాఖ నుంచి తొలగించి రాయగడలో కలపడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడమేనని తెలిపారు. కేంద్ర నిర్ణయం వల్ల ఆంధ్ర ఊటీగా ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రం అరకు... రాయగడ డివిజన్‌కు వెళ్తుందని, అరకు అభివృద్ధి ఇక నుంచి ఒడిశా ప్రభుత్వం మిగతా 7లో

## కార్యదర్శుల సమావేశానికి పటిష్ట ఏర్పాట్లు

- ముఖ్యకార్యదర్శి ఎంకె మీనా

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

వెలగపూడి సచివాలయంలో మంగళవారం జరగనున్న కార్యదర్శుల సమావేశానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను సాధారణ పరిపాలనశాఖ (పొలిటికల్) ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రితోపాటు అన్ని శాఖలకు చెందిన మంత్రులు సమావేశానికి హాజరవుతున్న నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయా శాఖల మంత్రులకు అందుబాటులో కార్యదర్శులు ఉండేలా సీటింగు ఉండాలని తెలిపారు. శాఖల ప్రగతి నివేదికతోపాటు భవిష్యత్ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఈ సమవేశంలో వివరించే అవకాశం ఉన్న నేపథ్యంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ప్రొటోకాల్ డైరెక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,**
**ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,**
**అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,**
**గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు
పంపవచ్చు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు మీడియా మానిటరింగ్ కమిటీ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

శాసన మండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరుగుతున్న ఎన్నికలకు రాష్ట్ర స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి)ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ (సిఇఒ) వివేక్ యాదవ్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. పత్రికలు, మీడియాలో పెయిడ్ న్యూస్‌ను తనిఖీ చేయడానికి, ప్రకటనలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీల నుంచి అందిన అప్పీళ్ల పరిశీలనకు, కమిటీ స్వయంగా విచారించే కేసుల కోసం రాష్ట్ర స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ ఛైర్మన్‌గా ఎ వెంకటేశ్వరరావు జాయింట్ సిఇఒ, స్టేట్ నోడల్ అధికారిగా సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ డైరెక్టర్ పి ప్రభాకర్ రావు, సభ్యులుగా ఎన్నికల సంఘంతో నియమించబడే పరిశీలకుల్లో ఒకరు, ఐఎఎస్ అధికారి ఒకరు, ప్రెస్ కౌన్సిల్ సభ్యులు ఆర్‌టి త్రిపాఠి, ఐ అండ్ పిఆర్ రీజినల్ ఇన్‌ఫర్మేషన్ ఇంజినీర్ సివి కృష్ణారెడ్డి ఈ కమిటీలో ఉన్నారు.

## తెలంగాణ ఇసెట్ షెడ్యూలు విడుదల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం నిర్వహించే ఇసెట్ నోటిఫికేషన్ ఈనెల 25న విడుదల కానుంది. శనివారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఇసెట్ కమిటీ తొలి సమావేశంలో ఈ మేరకు షెడ్యూలు విడుదల చేశారు. వచ్చేనెల 3 తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు ఏప్రిల్ 19వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫీజు ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగుల అభ్యర్థులు రూ.500, ఇతరులు రూ.900 చెల్లించాలని కోరారు. ఈసెట్ రాతపరీక్ష మే 12న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# కార్పొరేట్ల దెబ్బకు రిటైల్ మార్కెట్లు కుదేలు

- సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత
- ఘనంగా ప్రారంభమైన మత్స్యకార మహిళల జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న హేమలత

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కార్పొరేట్ల దెబ్బకు రిటైల్ మార్కెట్లు కుదేలయ్యాయని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమమైన 'మత్స్య మహిళల జాతీయ సదస్సులో ఆమె ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. అదాని, అంబాని, టాటా, బిర్లా లాంటి కంపెనీలు రిటైల్ రంగంలోకి ప్రవేశించడంతో చిరువ్యాపారులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తోన్న విధానాలతో రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడటమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 200 కుటుంబాల చేతిలో దేశంలోని సంపదంతా కేంద్రీకృతమైందనీ, వారిపై నాలుగు శాతం అదనపు పన్ను విధిస్తే పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందించవచ్చని అభిప్రాయపడ్డారు. "కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు కొమ్ముకాస్తూ సామాన్యులను విస్మరించింది. మత్స్య రంగంపై ఆధారపడి జీవిస్తున్న మూడు కోట్ల మంది ప్రజల సంక్షేమాన్ని దెబ్బతీసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోంది. సముద్రతీర ప్రాంతాల్లో సాంప్రదాయంగా వస్తున్న చేపల వేటపై అనేక అంక్షలను అమలు చేస్తోంది. పోర్టులను ప్రయివేటు పరం చేసి వారి వృత్తిపై దెబ్బకొడుతోంది. టూరిజం, థర్మల్ ప్రాజెక్టులు తదితర కార్యక్రమాలతో ఈ రంగంలోని అవకాశాలను కాలరాస్తున్నది. ఫలితంగా చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది" అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. చేపల ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం వస్తున్నా, కేంద్రం ఈ రంగం అభివృద్ధికి నిధులు వెచ్చించడం లేదని విమర్శించారు. అలాగే దేశీయ చేపల వేట, రవాణా, అమ్మకాలను సైతం కేంద్రం దెబ్బతీస్తోందని విమర్శించారు. చేపలను విక్రయించే మార్కెట్లలో సరైన వసతులు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, మంచినీటి తదితర కనీస సౌకర్యాలు కూడా లేవని గుర్తు చేశారు. లైంగిక వేధింపులకు సైతం గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా ఈ వృత్తిని నమ్ముకున్న వారికి సరైన న్యాయం జరగడం లేదని అభిప్రాయపడ్డారు. జాతీయ స్థాయిలో ఒకే విధమైన సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు తమ వృత్తిలో రాణిస్తూనే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మత్స్యకారులు అనే రంగం ఒక కులానికి సంబంధించిన వృత్తి కాదనీ, చేపలు పట్టే వారందరూ మత్స్యకార్మికులే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు దేబ్‌శీష్ బర్మన్, పులివిలై స్టాన్లీ, కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, కేరళ మత్స్య ఫెడరేషన్ అధ్యక్షులు టి.మనోహరన్, కోశాధికారి జి.మమత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఛైర్మన్ మెట్టు సాయికుమార్, తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గోరింకల నర్సింహా, ఉపాధ్యక్షులు ముఠా విజయ కుమార్, దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 300 మందికి పైగా మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భీమిలి బీచ్‌లో రిసార్టులు, రెస్టారెంట్లపై సర్వే

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో**

భీమిలి నుంచి విశాఖ ఆర్‌కె బీచ్ రోడ్ వరకూ సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న రెస్టారెంట్లు, రిసార్ట్ కమ్ రెస్టోబార్లపై జిల్లా అధికార యంత్రాంగం శనివారం సమగ్ర సర్వే నిర్వహించింది. ఆ ప్రాంతంలో సిఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి అక్రమ కట్టడాలు జరిగాయని పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్ పిల్‌ను విశాఖ నగరానికి చెందిన కార్పొరేటర్ పి.మూర్తియాదవ్ గతంలో హైకోర్టులో వేశారు. దీనిపై హైకోర్టు ఇంటర్మ్ ఆర్డర్ ఇచ్చింది. దీని ప్రకారం సంబంధిత బీచ్ రోడ్డులో జరిగిన ఉల్లంఘనలు, అక్రమ నిర్మాణాల సమగ్ర నివేదికను ఈ నెల 12వ తేదీలోగా కోర్టుకు నివేదించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలోనే రెండ్రోజుల క్రితం నగరంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ, జివిఎంసి, పర్యాటక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కోస్టల్ జోన్ మేనేజిమెంట్ అథారిటీ, సిజడ్ఎంఎ తదితర సంబంధిత శాఖాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. భీమిలి నుంచి ఆర్‌కె బీచ్ వరకూ మొత్తం సర్వే వివరాలను వెంటనే అందజేయడం కష్టతరమని అధికారులు భావించారు. కనీసం నిర్ణీత గడువులోగా భీమిలి తీరంలో జరిగిన అక్రమ కట్టడాలపై నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనిపై శనివారం భీమునిపట్నం ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, జివిఎంసి టౌన్ ప్లానింగ్ డిసిపి హరిదాస్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ సైంటిస్ట్ జవహర్, భీమిలి జోనల్ కమిషనరు ప్రేమ ప్రసన్న వాణి, భీమునిపట్నం తహశీల్దార్ పైలా రామారావు తదితరులు సంబంధిత సమగ్ర అధికారుల బృందంతో తీరంలో సర్వే చేశారు. బీచ్ రోడ్డులో ప్రభుత్వ సమీకృత వసతి గృహం నుంచి తిమ్మాపురం తీరం వరకూ సర్వే జరిపారు.

దీనిలో ఎస్‌విఎస్ జంక్షన్‌లో ఉన్న బి-జాగ్, కొబ్బరి తోట పార్క్ పక్కనున్న తీరం రిసార్ట్, ఎర్రమట్టి దిబ్బల వద్దనున్న మార్లిన్ కె, తొట్లకొండ రోడ్డులో ఉన్న శాంక్టమ్ రిసార్టులు, రెస్టోబార్లు, తిమ్మాపురం జంక్షన్లో ఉన్న విరాగో రెస్టారెంట్, రామానాయుడు స్టూడియో రోడ్‌లో ఉన్న సాల్ట్ వాటర్ రెస్టారెంట్ తీరం వరకూ ఈ సర్వే కొనసాగింది. సమగ్ర సర్వేతో భీమిలి ప్రాంతంలోని రెస్టారెంట్ల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

## 28న బడ్జెట్ ప్రతిపాదన

- సమావేశ సమయాల్లోనే ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు
- ఓం బిర్లా, వెంకయ్యలు హాజరు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**


2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఈ నెల 28న ఉభయ సభల్లో ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. 24వ తేదీన సభా సమావేశాలు ప్రారంభించాలని, బడ్జెట్ సమావేశాల సందర్భంగానే రెండు రోజులపాటు శాసనసభ్యులకు విజన్, శాసనసభ నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ శిక్షణ తరగతులకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతోపాటు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించనున్నారు.

24వ తేదీన గవర్నర్ ప్రసంగంతో సభ ప్రారంభంకానుంది. 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ఉంటుందని తెలుస్తోంది. 26వ తేదీ మహాశివరాత్రి కావడం, 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉండడంతో 28న బడ్జెట్ ప్రతిపాదనలు సభల ముందు ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. అనివార్య కారణాల వల్ల 28వ తేదిన బడ్జెట్ సమర్పణ సాధ్యం కాకపోతే మార్చి మూడున ఉంటుందని అధికారులు అంటున్నారు.

# ప్రజోపయోగం లేని రాజకీయ బడ్జెట్

**సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు**

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రజోపయోగం లేని పక్కా రాజకీయ బడ్జెట్ అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు విమర్శించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, రాజకీయ లబ్ధి పొందడమే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందనీ, ఢిల్లీ ఎన్నికల ఫలితాలు దీన్ని రుజువు చేస్తున్నాయని విశ్లేషించారు. 'యూనియన్ బడ్జెట్ 2025-26పై విశ్లేషణ' అనే అంశంపై శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించారు. ఎస్‌వికె బాధ్యులు వినయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడుతూ ఆదాయపన్ను రాయితీల పేరుతో మధ్యతరగతి ప్రజలను మోసగించి, ప్రభావితం చేశారనీ, దాన్ని బీహార్, ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కూడా వినియోగించుకోవాలని చూస్తున్నారని చెప్పారు. బడ్జెట్‌లో చేసిన కేటాయింపులను నిజంగా ఖర్చు చేస్తారా? లేదా? అని సందేహాలు ఉన్నాయన్నారు. గత బడ్జెట్లలో కేటాయింపులకు, వ్యయానికి మధ్య 15 శాతం నుంచి 25 శాతం కోతలు విధించారనీ, ఇది ఆనవాయితీగా మారిందని ఉదహరించారు. ప్రస్తుత ధరలను పరిగణనలోకి తీసుకుని, బడ్జెట్ అంకెలను బేరీజు వేయాలనీ, కానీ ఆ విధంగా జరగలేదన్నారు. బడ్జెట్ వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోవాలనీ, ద్రవ్యలోటును నియంత్రిం చేందుకు కత్తిరింపులు చేశారని అన్నారు. మధ్యతరగతికి ఆదాయపన్ను మినహాయింపులు ఇచ్చామని ప్రచారం చేశారనీ, దేశ జనాభాతో పోలిస్తే, ఆదాయ పన్ను ఫైల్ చేసేవారు, కట్టేవారు చాలా తక్కువనీ, అలాంటప్పుడు ఈ రాయితీలు ఎవరికి వెళ్తున్నాయో అర్థం చేసుకోవాలని చెప్పారు. సంస్కరణల నియంత్రణ పేరుతో అన్ని రంగాల్లోకి ప్రయివేటును ఆహ్వానిస్తున్నారనీ, ప్రభుత్వరంగాన్ని అమ్ముకొని వచ్చిన సొమ్మును ఆదాయంగా చూపుతున్నారని విమర్శించారు. ఇది వందశాతం క్రోనీ పెట్టుబడిదారులకు హుషారైన బడ్జెట్ అనీ, అంకెల్లో ఈ ప్రభావం కనిపించకున్నా, విధానాలు దానికి అనుగుణంగానే ఉన్నాయని వివరించారు. ప్రజల కొనుగోలు శక్తి అంతర్జాతీయ పరిస్థితుల ద్వారా పెరిగే అవకాశాలు లేవనీ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్థికమాంద్యం, ట్రంప్ విధాన నిర్ణయాలు దీన్ని ధృవీకరిస్తున్నాయని విశ్లేషించారు. ఎగుమతులపై ఆశలు లేవనీ, కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ఆదాయం కోల్పోయి, ప్రజల చేతిలోకి డబ్బు ఇచ్చామని ఆర్థికమంత్రి చెప్పడం సత్యదూరమని తెలిపారు.

వ్యవసాయ కార్మికులు, చిన్న సన్నకారు రైతులు, చిరుద్యోగుల చేతిలోకి డబ్బు వస్తే కొనుగోళ్లు పెరుగుతాయనీ, కానీ ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం చేయలేదన్నారు. పారిశ్రామికీకరణ జరిగి, కొత్త ప్రాజెక్టులు వస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందనీ, నిజవేతనాలు పెరగకుండా అదెలా సాధ్యమౌతుందని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్ ఏ రకంగానూ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేలా లేదన్నారు. వంద వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక కేటాయింపులు పేరుతో పథకం ప్రకటించి, అవసరమైన నిధులు ఇవ్వలేదన్నారు. గత బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.1.27 లక్షలు కేటాయించి, తక్కువ వ్యయం చేశారనీ, ఇప్పుడు అదే రంగానికి మరింత కోత విధించారని తెలిపారు. వ్యవసాయదారులు, కూలీల చేతిలోకి డబ్బురాకుండా కొనుగోలు శక్తి పెరగదని స్పష్టం చేశారు.

## స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి : ఐఎన్‌టియుసి

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఐఎన్‌టియుసి జిల్లా నాయకులు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1458వ రోజుకు చేరాయి. స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు దీక్షల్లో కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. ప్రజలు, కార్మికులు మోడీ సర్కారుకు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్లాంట్‌ను ప్రగతి పథంలో నడిపించడానికి ప్రతి కార్మికుడూ శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోవడంతో కార్మికులు నిరాశతో పనిచేస్తున్నారన్నారు. ఈ పరిస్థితి మారాలంటే ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపి, కార్మికులకు ప్రతినెలా పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించాలని కోరారు.

## ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

- కెవిపిఎస్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రభుత్వ శాఖలు, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలని మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే పారదర్శకత లోపించడంతోపాటు రిజర్వేషన్స్ పాటించకుండా అధికారం, డబ్బులు ఉన్నవారికే ఉద్యోగాలిస్తారని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ప్రమేయంతోపాటు ఇతర అనైతిక ప్రభావం పెరుగుతుందని, రూల్ ఆఫ్ లా రిజర్వేషన్ సరిగ్గా అమలు కాదన్నారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలు అవుట్‌సోర్సింగ్ నియామకాలపైనా అవినీతి, అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉందన్నారు.

## దస్తగిరిని ఎందుకు బెదిరించారు ?

- చైతన్యరెడ్డి, ప్రకాష్‌ను విచారించిన విచారణాధికారి

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి/పులివెందులటౌన్**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి ఫిర్యాదుపై రెండవ రోజు శనివారం కడప సెంట్రల్ జైలులో విచారణ కొనసాగింది. కడప సెంట్రల్ జైల్లో సూపరింటెండెంట్‌గా పని చేసిన ప్రకాష్‌తో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ చైతన్యరెడ్డి విచారణకు హాజరయ్యారు. వీరిని రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ శ్రీరామ్ విచారించారు. దస్తగిరిని ఎందుకు బెదిరించాల్సి వచ్చింది, దస్తగిరికి, వారికి ఉన్న సంబంధం గురించి ప్రశ్నించినట్లు సమాచారం. వైద్య శిబిరం పేరుతో జైలులో దస్తగిరిని కలిశారా? రూ.20 కోట్లు ఆఫర్ చేశారా? వివేకా హత్య కేసులో మీకు సంబంధం ఏమిటి? అని డాక్టర్ చైతన్యరెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. దస్తగిరిని ఎందుకు నిర్బంధించాల్సి వచ్చింది? అతనితో ఎందుకు లేఖ రాయించుకోవాల్సి వచ్చింది? ఎస్ఎస్ఆర్ బ్యారక్ ఎదురుగా ఉన్న సిసి కెమెరాను ఎప్పుడు అమర్చారు? ఇప్పుడు ఎందుకు మాయమైంది? సిసి ఫుటేజీ ఎక్కడ ఉందని జైలు సూపరింటెండెంట్ ప్రకాష్‌ను ప్రశ్నించి సమాధానాలు రాబట్టినట్లు సమాచారం. ఇరువురిని పక్క పక్కనే విచారించి వారిచ్చిన వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు తెలిసింది. అయితే.. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న తనను 2023 నవంబరు 28న ఎస్ఎస్ఆర్ బ్యారక్‌లోకి డాక్టర్ చైతన్యరెడ్డి జైలుకు వచ్చి అప్పటి సిబిఐ అధికారి రామ్ సింగ్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని ప్రలోభ పెట్టారని దస్తగిరి ఓ లేఖ రాశారు. తమకు అనుకూలంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చారని, చైతన్యరెడ్డి తనను బెదిరించే సమయంలో అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ వారించలేదని దస్తగిరి లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా తన భార్యకు మతిస్థిమితం లేక మీడియాతో మాట్లాడినట్లుగా లేఖ రాసి విడుదల చేయాలని ఒత్తిడి చేశారని ఫిర్యాదు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దస్తగిరి ఫిర్యాదు మేరకు డాక్టర్ చైతన్యరెడ్డి, జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ నుంచి రాహుల్ శ్రీరామ్ సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది.

## ఇఎపిసెట్‌కు కన్వీనర్‌గా వివి సుబ్బారావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశపరీక్ష (ఇఎపిసెట్) కన్వీనర్‌గా జెఎన్‌టియు ప్రొఫెసర్ వివి సుబ్బారావును ఉన్నత విద్యామండలి నియమించింది. ఈ సెట్ నిర్వహణను జెఎన్‌టియు కాకినాడకు అప్పగించింది. 2025-26 విద్యా సంవత్సరంలో పలు ప్రవేశపరీక్షల నిర్వహణకు యూనివర్సిటీలను, కన్వీనర్లను నియమిస్తూ ఉన్నత విద్యామండలి కార్యదర్శి టివి కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇఎపిసెట్‌తో పాటు పలు సెట్లకు విద్యామండలి ఛైర్మన్ నామినేట్ చేశారని పేర్కొన్నారు.

| యూనివర్సిటీ | సెట్ పేరు | కన్వీనర్ పేరు |
|---|---|---|
| 1. జెఎన్‌టియు కాకినాడ | ఇఎపిసెట్ | ప్రొ వివి సుబ్బారావు |
| 2.పద్మావతి | లాసెట్ | ప్రొ టి సీతాకుమారి |
| 3.జెఎన్‌టియు అనంతపురం | ఈసెట్ | ప్రొ బి దుర్గాప్రసాద్ |
| 4.ఆంధ్ర | పిజిఇసెట్ | ప్రొ పి మల్లికార్జునరావు |
| 5.ఆంధ్ర | ఐసెట్ | ప్రొ ఎం శశి |
| 6.ఆచార్య నాగార్జున | పిఇసెట్ | ప్రొ పాల్‌కుమార్ |
| 7.ఆచార్య నాగార్జు | ఎడ్‌సెట్ | ప్రొ ఎవివిఎస్ స్వామి |
| 8.శ్రీవెంకటేశ్వర | పిజిసెట్, ఆర్‌సెట్ | ప్రొ పిసి వెంకటేశ్వర్లు |

# భూముల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్

- మహిళల పేరిట పట్టాలు మంజూరు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఇందుకు సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరకాస్తు చేసుకునే విధానాన్ని ఒకటి రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జీఓ నెంబరు 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ -2025 పేరిట భూములు క్రమబద్ధీకరణను రెవెన్యూ శాఖ చేపట్టనుంది. దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులకు ఈ ఏడాది డిసెంబరు 31వరకు గడువు ఇచ్చారు. మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుతో ప్రభుత్వం జారీ చేయనుంది. క్రమ బద్ధీకరణ మేరకు లబ్ధిదారులకు పట్టా కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్యహక్కులు జారీ చేయనున్నట్లు సిసిఎల్ఎ జయలక్ష్మీ తెలిపారు.

**రిజిస్ట్రేషన్ ఫీజులిలా....**

150 గజాల వరకు రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151నుంచ 300 గజాల లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం చెల్లించాలి. 300 నుంచి 450 గజాలలోపు పరిధిలో బిపిఎల్ కుటుంబాల వారు 100శాతం బేసిక్ ధర , 50శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే విభాగంలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారైతే 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సి ఉంటుంది. 450 గజాలకు మించి ఎవరు ఆక్రమణలో ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయంచిన ధరలు చెల్లించేందుకు సిద్ధంగా లేని పక్షంలో ఆయా స్థలాలు, భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

**అర్హులు వీరే**

భూముల క్రమబద్ధీకరణకు గ్రామాల్లో గరిష్ఠంగా నెలకు రూ.10వేలు, పట్టణాల్లో రూ.14వేలు ఆదాయం ఉన్న లబ్ధిదారులు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తోడు అదనంగా నెలకు రూ.300 ల విద్యుత్తు బిల్లుల చెల్లింపులు ఉండాలని తెలిపారు. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించకూడదు. ఆర్‌సిసి రూఫ్/ ఆస్‌బెస్టాస్ రూఫ్‌తో ఇసుక గోడలతో నిర్మాణాన్ని పరిగణలోకి తీసుకుంటామని సిసిఎల్ఎ తెలిపారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను కూడా పరిగణలోకి తీసుకోనున్నారు.

**క్రమ బద్ధీకరణ చేయని స్థలాలు : :**

లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్‌ప్లాన్, జోనల్‌ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమ బద్ధీకరణ చేయడం కుదరదని ప్రభుత్వం స్పష్టం చేసింది.


**అప్పీల్ కు అవకాశం:**

సబ్ డివిజన్ లెవల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలుంటే జాయింట్ కలెక్టర్‌కు 30రోజుల్లోగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అర్హుల జాబితా ఖరారైన తర్వాత ఆ వివరాలను తహసీల్దార్లు ఆ ప్రాంత సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారు. ఇందుకు సంబందించి ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిగణలోకి ప్రభుత్వం తీసుకోనుంది. రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలను పరిశీలిస్తారు. అనంతరం అర్హత కలిగిన లబ్దిదారుల జాబితాను సబ్ కలెక్టర్, ఆర్‌డిఓకు పంపిస్తారు.

# పంటలకు మద్దతు ధర ఇవ్వాలి

- తక్షణమే 'అన్నదాతా సుఖీభవ' అమలు చేయాలి
- ఎపి రైతు సంఘం డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



రైతులు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదాయం వచ్చే పంటలను రైతులు పండించాలని, వాటికే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఇస్తామని సమీక్షలో ముఖ్యమంత్రి చెప్పారని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించడాన్ని తప్పుబట్టారు. పంటలకు మద్దతు ధర ఇస్తే రైతులకు లాభం కలుగుతుందని, మద్దతు ధరలు అమలు చేయకుండా రైతుల ఆదాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యానికి బస్తాకు రూ.1400 మించి ధర అందలేదని, పత్తి రూ.12 వేల నుంచి రూ.6 వేలకు, మిర్చి రూ.23 వేల నుంచి రూ.12 వేలకు, కంది రూ.10 వేల నుంచి రూ.7 వేలకు పడిపోయిందని వివరించారు. ఎన్నికల సందర్భంగా ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేల గురించి మంత్రివర్గంలో ప్రస్తావించకపోవడం రైతులకు లాభదాయకమా? అని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాలో డ్రాగన్, చీని పంటల రైతులకు సరైన గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులను బట్టి రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలు ఇచ్చే ఆలోచన చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను చిలకపలుకుల్లాగా పలకటం మానుకోవాలని సూచించారు.

**వ్యవసాయానికి దూరం చేసే కుట్ర : కౌలు రైతుల సంఘం**

వాణిజ్య పంటలను ప్రోత్సహించి ఆహార పంటలు పండించే రైతులు, కౌలు రైతులను నష్టాలకు గురిచేసి వ్యవసాయానికి దూరం చేసేందుకు కుట్ర జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది అనేక పంటలకు మద్దతు ధరలు అందకపోవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఎంతో గొప్పగా చెప్పుకునే ధరల స్థిరీకరణ నిధి కేటాయింపులు ఉన్నప్పటికీ నయా పైసా కూడా రైతాంగానికి ఇచ్చి ఆదుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. కేరళ రాష్ట్రం 16 పంటలకు స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం ధరలు నిర్ణయించడంతో పాటు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పండించే పంటలకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా బోనస్ ఇచ్చి రైతుల ఆదాయం పెంచాలని సూచించారు. రాష్ట్రంలో కౌలు వ్యవసాయం 70-80 శాతం ఉందని, కౌలుదారుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. రైతులు పొందే అన్ని సంక్షేమ పథకాలు ఈ చట్టంలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడా అన్నదాతా సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో

## శ్రీనాథ్‌కు బంగారు పతకం

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు (కృష్ణా)**



శ్రీనాథ్

44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో యుటిఎఫ్ కృష్ణా జిల్లా కార్యవర్గ సభ్యులు కెఎల్ శ్రీనాథ్ గోల్డ్ మెడల్ సాధించారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఫిబ్రవరి 6, 7, 8 తేదీల్లో జరిగిన పోటీల్లో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని నీలకంఠేశ్వరపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనాథ్.. హేమర్ త్రో, డిస్కస్ త్రోలో గోల్డ్ మెడల్స్ దక్కించుకున్నారు. షాట్‌పుట్ విభాగంలో బ్రాంజ్ మెడల్, 400 మీటర్ల రిలే విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో మొత్తం నాలుగు మెడల్స్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌ను యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎల్ నరేంద్ర, వరలక్ష్మి, మండల యుటిఎఫ్ అధ్యక్షులు ఎం.ఆరోగ్యం, ప్రధాన కార్యదర్శి ఎం హరి శ్రీనివాస్, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ప్రజాశక్తి-ములకలచెరువు (అన్నమయ్య జిల్లా)**

రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన శనివారం అన్నమయ్య జిల్లా ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా, గాండ్లపెంట మండలానికి చెందిన సోమశేఖర్ మదనపల్లెలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బంధువుల ఇంటిలో జరిగే కార్యక్రమానికి ఇద్దరు పిల్లలు, భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై మదనపల్లి నుంచి కదిరికి బయలుదేరారు. ములకలచెరువు షాది మహల్ సమీపానికి రాగానే కదిరి నుంచి మదనపల్లె వైపు వస్తున్న ఐచర్ వాహనం వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమశేఖర్ (35) అక్కడికక్కడే మృతి చెందారు. భార్య కవిత, కుమారుడు రెడ్డిశేఖర్ (5), కుమార్తె సిద్దేశ్వరి (3) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మూలకలచెరువు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సిద్దేశ్వరి మరణించారు. మెరుగైన వైద్యం కోసం కవిత, రెడ్డిశేఖర్‌ను తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి రూయాలో చికిత్స పొందుతూ రెడ్డిశేఖర్ మృతి చెందారు. కవిత పరిస్థితి విషమంగా ఉంది. ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# న్యాయవ్యవస్థ ఎంతో దృఢమైంది

### సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి
### మదనపల్లిలో అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

**ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)**

భారతదేశ న్యాయవ్యవస్థ ఎంతో దృఢమైందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని కోర్టు సముదాయంలో నూతనంగా నిర్మించిన అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు భవనాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి మాట్లాడుతూ దేశచరిత్రలో మదనపల్లి పట్టణానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతం జనగణమనను ప్రసిద్ధిగాంచిన బిటి కళాశాలలో బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేశారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం 470 ఆర్టికల్స్, 106 రాజ్యాంగ సవరణ చట్టాలు కలిగి ఉందని వివరించారు. ముఖ్యంగా ఆర్టికల్ 14 దేశ పౌరుల సమానత్వాన్ని తెలియజేస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు సర్వోన్నతమైందన్నారు. న్యాయవ్యవస్థపై దేశ ప్రజలకు మరింత నమ్మకం పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇది జరగాలంటే కేసులను త్వరితగతిన పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గతంలో ఎంతోమంది ప్రధాన న్యాయమూర్తులు సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని పెంపొందించారని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తులు పనిచేయడం దేశ న్యాయవ్యవస్థకు గర్వకారణమన్నారు. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ పరస్పర సహకారంతో దేశప్రతిష్ట పెంచుతున్నాయని కితాబిచ్చారు.

మదనపల్లెలో తన చిన్ననాటి జ్ఞాపకాలు, విద్యాభ్యాసం, లాయర్‌గా ప్రాక్టీస్, తన గురువులు అందించిన ప్రోత్సాహాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హైకోర్టు



కోర్టు భవన సముదాయం ప్రారంభ సభలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి, వేదికపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మదనపల్లి కోర్టు సముదాయంలోని మేజిస్ట్రేట్ కోర్టు భవనం పూర్వం ఎంతో నైపుణ్యంగా రాతి కట్టడంతో కట్టారని, ఆ భవనాన్ని యథాస్థితిలో ఉంచి, ఆ భవనంపైనే కొత్త భవనం నిర్మించి మరో కోర్టును ఇస్తామని తెలిపారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఇక్కడే జనగణమన ఆలపించడం, జిడ్డు కృష్ణమూర్తి ఈ ప్రాంతవాసి కావడం, బిటి కళాశాల ఉండడం, ఇంత ఘన చరిత్ర ఉన్న మదనపల్లెలో కోర్టు భవనం ప్రారంభించడం జ్ఞాపకంగా ఉంటుందన్నారు.

దీనికి ముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు హైకోర్టు జడ్జిలు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ టిసిడి శేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొట్లి వెంకట రమణారెడ్డి, చిత్తూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి భీమారావు, బార్ అసోసియేషన్ సభ్యులు ఘనస్వాగతం పలికారు. మదనపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి జస్టిస్ అబ్రహం, ఇతర కోర్టుల న్యాయమూర్తులు వెంకటేశ్వర్ నాయక్, శిరీష్, విజయకుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, అడిషనల్ ఎస్‌పి వెంకటాద్రి, తహశీల్దార్ ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న వసంత కుమారి

## రాజకీయాలు, సాహిత్యం వేర్వేరు కావు

- వసంతకుమారి

**ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్**

ఉద్యమ జీవితంలో రాజకీయాలు, సాహిత్యం వేర్వేరు కాదని, అవి ఒకటికొకటి ముడిపడి ఉంటాయని ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంత కుమారి అన్నారు. కర్నూలులోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో రెండు రోజులు పాటు జరగనున్న 'సంక్షోభ కాలంలో సాహిత్య కారుల పాత్ర- విరసం 24వ సాహిత్య పాఠశాల' కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. తొలిరోజు మూడు సెషన్స్ నిర్వహించారు. ప్రారంభానికి ముందు అమరవీరుల స్థూపం ముందు విరసం కార్యకర్తలు జోహార్లు అర్పించారు. అనంతరం వసంత కుమారి మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రొఫెసర్ సాయిబాబా కవిత్వం రాశారని, ఆ సమూహాల్ని ఏకం చేయడంలో సఫలీకృతుడయ్యారని తెలిపారు. విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ.. కవులు, ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండపై ప్రగతిశీల ఉద్యమ కార్యకర్తలు మాట్లాడాలని కోరారు. 'మేధోసృజన రంగాలపై ఫాసిస్టుల దాడి - కార్పొరేట్ ప్రయోజనాలు' అనే అంశంపై ప్రముఖ కవి అల్లం రాజయ్య, 'సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో రచయితల దృక్పథాలు-వైఖరులు' అనే అంశంపై సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడారు. గతంలో రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు వచ్చాయని, 2014 తర్వాత భావజాల రంగంలో సంక్షోభాలు తీవ్రమయ్యాయన్నారు. ప్రముఖ కవి స్కైబాబా, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, విరసం కార్యదర్శి రివేరా, అమరవీరుల కుటుంబ సభ్యులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన విరసం ప్రతినిధులు, కర్నూలు కవులు మారుతి పౌరోహితం తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

## నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- ఎమ్మెల్సీ లక్ష్మణరావు

**ప్రజాశక్తి - గుంటూరు**

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 10న తన నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. శనివారం గుంటూరు గీతా రీజెన్సీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2007లో శాసనమండలి పునరుద్ధరించిన నాటి నుండి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వివిధ వర్గాల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మంచి నిర్ణయాలు చేస్తే సమర్థిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తే వ్యతిరేకిస్తూ నీతి, నిజాయితీతో, రాజ్యాంగ విలువలకు కట్టుబడి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పని చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, రైతులు, స్కీం వర్కర్లు తదితర తరగతుల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు. మండలి వేదికగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించాలని కోరారు. సోమవారం ఉదయం పది గంటలకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ, అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్, మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ నాయకులు కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా యుగంధర్

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**



అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన మొజ్జాడ యుగంధర్ తొలిసారి ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని అరసవల్లిలో ఉన్న సూర్యతేజ కన్వెన్షన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య 22వ రాష్ట్ర మహాసభ శనివారంతో ముగిసింది. ఈ ముగింపు వేడుకల్లో జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య పాల్గొన్నారు. కుల, మత, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పాలన సాగిస్తున్న బూర్జువా పార్టీలను సాగనంపేందుకు యువత కదలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా పరుచూరి రాజేంద్రబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సిహెచ్.గీత, పి.ప్రభాకర్, కె.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా కె.రవి, వై.బాబీ, షేక్ సుభానీ, జి.నాగరాముడు, కోశాధికారిగా వై.రాంబాబు ఎన్నికయ్యారు.

## గ్రీవెన్స్ నిర్వహించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

టిడిపి కార్యాలయంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గ్రీవెన్స్ నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బిటి నాయుడుతో కలిసి శనివారం ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. భూ కబ్జాలు, ఆక్రమణలపై పలువురు ఫిర్యాదు చేశారు.

# ఉక్కు కార్మికులకు వేతన బకాయి చెల్లించాలి

- ప్యాకేజీ నిధులను ప్లాంట్ నిర్వహణకు ఖర్చు చేయాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, ప్యాకేజీ నిధులను ప్లాంట్ నిర్వహణకు ఖర్చు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖలోని సిఐటియు కార్యాలయంలో ఆయన శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌తో కలిసి మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌లో ఐదు నుంచి మూడు నెలలకు పైగా జీతాలు చెల్లించకుండా కార్మికులతో పనిచేయించడం దుర్మార్గమని, గత సంవత్సరం బోనస్, ఇంటి అద్దె, లీవ్ అమౌంట్ చెల్లించలేదని తెలిపారు. 2024 ఏప్రిల్ నుంచి కరెంట్ బిల్లు యాజమాన్యం 16 రెట్లు ఒకేసారి పెంచిందన్నారు. స్టీల్ ఆస్పత్రిలో సరిపడా వైద్యులు లేరని, మందులు లేవని తెలిపారు. బయోమెట్రిక్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారన్న కారణంతో కార్మికుల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. స్టీల్ కార్మికులు అశేషమైన త్యాగాలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

చేస్తున్నారన్నారు. జీతాలు చెల్లించకపోయినా, కనీస సౌకర్యాలు కల్పించకపోయినా దేశంలోనే ఇతర స్టీల్‌ప్లాంట్‌లన్నింటి కంటే అధికంగా 110 శాతం ఉత్పత్తి సాధిస్తున్నారని తెలిపారు. పలు విభాగాల్లో ఐదు వేల మంది కార్మికులు రిటైర్డ్ అయినా.. వారి స్థానంలో కొత్తవారిని భర్తీ చేయలేదని పేర్కొన్నారు. దీంతో కార్మికులపై పని ఒత్తిడి పడుతోందని తెలిపారు. ప్లాంట్‌కు లాభాలు రాలేదన్న నెపాన్ని కార్మికులపై నెట్టడం తగదన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో నూరు శాతం వాటాలు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటి నుంచి ప్రభుత్వమే ముడిసరుకు రాకుండా ఆటంకాలు సృష్టిస్తోందని తెలిపారు. ఉత్పత్తి తగ్గించి ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టింది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. 1600 మంది కార్మికులకు విఆర్‌ఎస్ ఇచ్చి పంపించేందుకు యత్నిస్తోందని, దానికోసం రూ.506 కోట్లు ఖర్చు పెడుతోందని తెలిపారు. కానీ కార్మికులకు జీతాలు ఇవ్వడానికి మాత్రం డబ్బుల్లేవని మొండిచేయి చూపుతోందని మండిపడ్డారు. ఐదు సంవత్సరాల నుంచి నిర్వాసితులతో సహా ఒక్క కార్మికుడిని కూడా ఉద్యోగంలోకి తీసుకోలేదన్నారు. ప్రస్తుతం నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. ఇప్పుడున్న వారిని తొలగించి కొత్తవారితో తక్కువ జీతాలతో ప్రయివేటు కంపెనీలకు అవసరమైన పద్ధతిలో నడిపించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఉత్పత్తి పెంచి లాభాలొస్తే సెయిల్‌లో విలీనం చేస్తామని పచ్చి అబద్ధాలు ఆడుతోందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ స్టీల్‌కు సొంత గనుల కేటాయింపుపై మాట్లాడకుండా ఆర్సెలార్ మిట్టల్‌కు సొంత గనులు కేటాయించాలని ప్రధానిని కోరడం ఆయన ప్రయివేటు అనుకూలతకు పరాకాష్ట అని తెలిపారు. ప్యాకేజీని కేవలం పాత అప్పులు తీర్చడానికే ఉపయోగిస్తామని కేంద్రం ప్రకటించిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మాలనుకుందని, ప్రయివేటు యజమానికి అప్పు భారం లేకుండా చేయడమే ఈ ప్యాకేజీ లక్ష్యమని తెలిపారు. ప్లాంట్ నిర్వహణకు, కార్మికుల జీతాలకు ఈ ప్యాకేజీ నిధులు ఖర్చు పెట్టకుండా ఉత్పత్తి పెరగడం, లాభాల్లో నడవడం అసాధ్యమన్నారు. మరో మూడు నెలల తరువాత లాభాలు రాలేదన్న పేరుతో ప్రయివేటు వ్యక్తులకు స్టీల్‌ప్లాంట్‌ను అప్పగించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర అని విమర్శించారు.

# ముంచేస్తోన్న డిజిటల్ స్టార్స్

- 69 శాతం ఇన్‌ఫ్లుయెన్సర్ల ఉల్లంఘనలు
- ఫ్యాషన్ బ్రాండ్స్‌లోనే ఎక్కువ మోసాలు
- ఎఎస్‌సిఐ రిపోర్ట్‌లో వెల్లడి



**ముంబయి :** డిజిటల్ స్టార్లుగా చెప్పుకుంటున్న ఇన్‌ఫ్లుయెన్సర్లు వినియోగదారులను భారీగా తప్పుదోవ పట్టిస్తున్నారు. వాస్తవ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) వెల్లడించింది. మూడింట రెండొంతుల మంది లేదా 69 శాతం మంది నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతూ.. వినియోగదారులను ముంచేస్తోన్నారని ఆందోళన వ్యక్తం చేసింది. 'ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 డిజిటల్ స్టార్స్ 2024' జాబితాలో పేర్కొన్న ఇన్‌ఫ్లుయెన్సర్ల తీరును పరిశీలించి ఎఎస్‌సిఐ ఓ రిపోర్ట్‌ను రూపొందించింది. 2024 సెప్టెంబర్ నుంచి నవంబర్ మధ్యకాలంలో వారు ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్‌లో ప్రమోట్ చేసిన పోస్టులను పరిశీలించింది. ఈ టాప్ ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను దాదాపు 11 కోట్ల మంది అనుసరిస్తున్నారు

ఎఎస్‌సిఐ రిపోర్ట్ ప్రకారం.. సెంట్రల్ కన్సూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) నిబంధనల ప్రకారం.. ఉత్పత్తులు, బ్రాండ్ ప్రమోషన్ సమయంలో కీలక వివరాలను వినియోగదారులకు వెల్లడించడంలో 69 శాతం మంది విఫలమవుతున్నారు. 100 పోస్టుల్లో 29 మాత్రమే తగినన్ని వివరణలతో కూడినవి ఉంటున్నాయి. 69 కేసుల్లోనూ ఉల్లంఘనలు నిరూపించబడ్డాయి. ముఖ్యంగా ఫ్యాషన్, లైఫ్‌స్టయిల్, టెలికం ఉత్పత్తులు, పర్సనల్ కేర్ విభాగాల్లో 62 శాతం మంది ఇన్‌ఫ్లుయెన్సర్లు తప్పుదోవ పట్టించే పోస్టులు పెడుతున్నారు.

ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రకటనల్లో పారదర్శకత లోపించడం, నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తుండటం ఆందోళనకరమైన విషయమని ఎఎస్‌సిఐ రిపోర్ట్‌లో పేర్కొంది. నియంత్రణ సంస్థల చర్యలకు గురికాకుండా ప్రకటనకర్తలు, ఏజెన్సీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సమష్టిగా నిబంధనలకు అనుగుణంగా పని చేయడంపై దృష్టి పెట్టాలని ఎఎస్‌సిఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్, సెక్రటరీ జనరల్ మనిషా కపూర్ పేర్కొన్నారు. టాప్ ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా నిబంధనలు, పారదర్శకతకు కట్టుబడిలేకపోవడం నిరాశకు గురి చేస్తోందన్నారు.

## రాష్ట్రంలో క్లినికల్ సైకాలజీ కోర్సులు

- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో మొదటిసారి క్లినికల్ సైకాలజీ కోర్సులను ప్రారంభించనున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి వ్యాధి నిర్ధారణ, చికిత్స అందించడంలో క్లినికల్ సైజాలజిస్టులు కీలక పాత్ర వహిస్తారని తెలిపారు. అన్ని రకాల రోగులు వ్యాధుల నుంచి పూర్తిగా కోలుకోవడం (రిహేబిలిటేషన్)లో కూడా ప్రధాన భూమిక వహిస్తారని పేర్కొన్నారు. క్లినికల్ సైజాలజీ కోర్సులు నిర్వహించకపోవడంతో రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్లినికల్ సైజాలజిస్టులు దాదాపు లేని పరిస్థితి నెలకొందని తెలిపారు. పెరుగుతున్న మానసిక సమస్యలు, క్లినికల్ సైకాలజిస్టులు లోటును దృష్టిలో పెట్టుకుని అతి త్వరలో రెండేళ్ల వ్యవధితో కూడిన ఎంఫిల్, ఏడాదిపాటు సాగే ప్రొఫెషనల్ డిప్లమో కోర్సులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వీలైనంత త్వరగా వీటి మార్గదర్శకాలను తయారు చేయాలని అధికారులకు ఆదేశించామని పేర్కొన్నారు. క్లినికల్ సైకాలజీ విద్యను నియంత్రించే రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు చేసి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

## త్వరలో గోదావరి - పెన్నా రెండో దశ పనులు

- నరసరావుపేట ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గోదావరి - పెన్నా నదుల అనుసంధానం పథకం తొలి దశ ఇప్పటికే పూర్తయిందని, రెండో దశలో కృష్ణా నది నుంచి సాగర్ కాల్వలకు నీటిని ఎత్తిపోసే పనులు పూర్తి చేయాల్సి ఉందని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. గుంటూరులో మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు కేంద్ర సాయం కోరామని, ఈ మేరకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సిఎం చంద్రబాబు పలుమార్లు చర్చించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల దక్షిణ కోస్తా, రాయలసీమ వాసులకు నీటి ఎద్దడి తీరుతుందన్నారు. ఇప్పటికే గోదావరి జలాలు పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి వస్తున్నాయని, వీటిని సాగర్ ఆయకట్టుకు తీసుకునేందుకు 2018లో ప్రతిపాదించిన పనులు గత ప్రభుత్వ హయంలో నిలిచిపోవడం వల్ల జాప్యం జరిగిందని చెప్పారు. ఈ పనులను త్వరలో చేపట్టేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. అయితే రూ.80 వేల కోట్ల అంచనాలతో గోదావరి జలాలను బనకచర్లకు తీసుకువెళ్లేందుకు తలపెట్టిన ఈ ప్రాజెక్టు పనుల రెండో దశ త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు.

## సిగ్నిఫై బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మిక మందన్న



**హైదరాబాద్ :** గ్లోబల్ లైటింగ్ ఉత్పత్తుల కంపెనీ సిగ్నిఫై తమ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటీ రష్మిక మందన్నను నియమించుకున్నట్లు ప్రకటించింది. యువ వినియోగదారులను ఆకట్టుకోవడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేయనుందని పేర్కొంది. అత్యుత్తమ ఆవిష్కరణలను తీసుకురావడం పట్ల తాము విశ్వాసాన్ని కలిగి ఉన్నామని సిగ్నిఫై గ్రేటర్ ఇండియా సిఇఒ సుమిత్ జోషి పేర్కొన్నారు.

## రూపాయి మార్పులపై ఆందోళన లేదు

- మార్కెట్ శక్తుల చేతుల్లోనే విలువ
- ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



**న్యూఢిల్లీ :** రూపాయి విలువ రోజువారి మార్పులపై రిజర్వ్ బ్యాంక్ పెద్దగా ఆందోళన చెందదని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. శనివారం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం మల్హోత్రా మీడియాతో మాట్లాడారు. డాలరుతో రూపాయి విలువను మార్కెట్ శక్తులు నిర్ణయిస్తాయన్నారు. దీర్ఘకాల, మధ్యస్థ కాలంలో రూపాయి విలువ మార్పుపైనే రిజర్వు బ్యాంక్ దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. రూపాయి విలువ స్థాయిని గానీ, ఒక బ్యాండ్‌ను గానీ ఆర్‌బిఐ చూడబోదన్నారు. ఎప్పుడైన భారీ స్థాయిలో ఒడుదొడుకులు ఎదుర్కొంటే మాత్రమే సెంట్రల్ బ్యాంక్ జోక్యం చేసుకుంటామన్నారు. రోజువారీ విలువ తగ్గడం, పెరగడం గురించి పట్టించుకోబోమని స్పష్టం చేశారు. రూపాయి విలువ 5 శాతం పతనమైతే దేశీయంగా ద్రవ్యోల్బణం 30-35 బేసిస్ పాయింట్ల మేర పెరుగుతుందని గవర్నర్ తెలిపారు. అంతర్జాతీయ పరిణామాల వల్లే రూపాయి విలువ తగ్గుతోందన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై చేస్తున్న ప్రకటనలు రూపాయిని ఒత్తిడికి గురి చేస్తోన్నాయన్నారు. దీనికి త్వరలోనే పరిష్కారం లభించొచ్చన్నారు.

## పెరిగిన విదేశీ మారకం నిల్వలు

**న్యూఢిల్లీ :** భారత విదేశీ మారకం నిల్వలు వరుసగా రెండో వారంలోనూ పెరిగాయి. జనవరి 31తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 1.05 బిలియన్ డాలర్లు పెరిగి 630.61 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్‌బిఐ వెల్లడించింది. అంతకుముందు వారంలోనూ 5.57 బిలియన్ డాలర్లు పెరిగి 629.56 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం కొన్ని వారాల పాటు భారీగా ఫారెక్స్ నిధులు పడిపోయాయి. గతేడాది సెప్టెంబర్ చివరినాటికి విదేశీ మారక నిల్వలు రికార్డ్ స్థాయిలో 704.88 బిలియన్ డాలర్ల గరిష్ట స్థాయికి పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశీయంగా భారత మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొవడం, ఎఫ్ఐఐలు తరలిపోవడంతో ఇటీవలి కాలంలో భారీగా పతనమయ్యాయి.

## ఐటిబిపికి జిమ్నీ వాహనాలు

**న్యూఢిల్లీ :** ఇండో టిబెటన్ బార్డర్ పోలీసు (ఐటిబిపి) ఫోర్స్‌కు తాము 60 జిమ్నీ ఎస్‌యువి వాహనాలను అందించడానికి మారుతి సుజుకి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా న్యూఢిల్లీలో ఐటిబిపి అడిషనల్ డైరెక్టర్ అబ్దుల్ ఘని మీర్‌కు మారుతి సుజుకి మార్కెటింగ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ వాహనాలను అందించారు. వీటిని లేహ్-లద్దాక్, అరుణాచల్ ప్రదేశ్ రీజియన్‌లో ఉపయోగించనున్నట్లు పేర్కొంది.




## గెలాక్సీ ఎస్ 25 సిరీస్‌కు 4.30 లక్షల ప్రీ ఆర్డర్లు

**గూర్‌గావ్ :** సామ్‌సంగ్ ఇటీవల ఆవిష్కరించిన గెలాక్సీ ఎస్ 25 సిరీస్‌కు విశేష స్పందన లభిస్తోందని ఆకంపెనీ తెలిపింది. ఇప్పటికే 4.30 లక్షల యూనిట్లకు ప్రీఆర్డర్లు వచ్చినట్లు పేర్కొంది. అదే విధంగా గతేడాది గెలాక్సీ ఎస్ 24 సిరీస్‌తో పోల్చితే 20 శాతం ఎక్కువగా డిమాండ్ ఉందని పేర్కొంది. ఎస్25 సిరీస్ ఫోన్లను ఫిబ్రవరి 7 నుంచి స్టోర్స్‌లోనూ అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది.


# పరువుకు వైకల్యం

సమాజంలో భాగమే...కానీ సాధారణ జీవితం గడపలేరు. అందరితో సమానమే... అయినా ఆత్మవిశ్వాసంతో మనలేరు. శారీరక సమస్యల కంటే కూడా మానసిక వైకల్యం వారికి ప్రతిబంధకమౌతుంది. న్యూనతా భావానికి గురిచేస్తుంది. 'కనబడే వికలం కన్న/ మదిలో వైకల్యమున్న/ మహా ప్రమాదకరము/ దీన్ని ఎరిగి మసలుమన్న' అంటారో కవి. ఇదో సంక్లిష్ట వాస్తవ స్థితి. పరిజ్ఞానం, ప్రవర్తన వంటి అంశాలకు సంబంధించి కనిస్తుంది. ఏది నిజమో ఏది కాదో చెప్పలేని పరిస్థితిలో వుంటారు. ప్రతి 8 మందిలో ఒకరు చొప్పున ప్రపంచవ్యాప్తంగా 97 కోట్ల మంది మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. ఈ వైకల్యానికి వారు బాధ్యులు కాకున్నా... సామాజిక వివక్ష, మానవహక్కుల ఉల్లంఘనను ఎదుర్కొంటున్నారు. అందరూ వున్నా, అన్ని హక్కులూ వున్నా... ఏమీ వినియోగించుకోలేని వారుగా బతికేస్తున్నారు. వారేం చేస్తున్నారో వారికే తెలియని స్థితి. కొన్నిసార్లు వారికివారే హాని చేసుకోవడమో, ఇతరులకు హాని చేయడమో చేస్తుంటారు.

ఏ వైకల్యం లేని మనిషి జీవితం సాఫీగానే సాగిపోతుంది. చిన్న వైకల్యం వున్నా...అది జీవితాంతం వారిని పీడిస్తుంది. కొందరు పుట్టుకతో ఆరోగ్యవంతులుగా పుట్టినప్పటికీ హఠాత్తుగా మానసిక రోగులుగా మారుతుంటారు. మొదట్లో దీన్ని తేలిగ్గా తీసుకోవడంతో సమస్య జటిలంగా మారుతుంది. చాలామందికి మానసిక వైకల్య సమస్యలపై నిశితమైన పరిశీలన లేకపోవడం, ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స అందించలేకపోవడం, మానసిక వైకల్యం వున్నవారికి చికిత్స చేసే వైద్యులు అందుబాటులో లేకపోవడం వంటివి కారణమౌతున్నాయి. తమ పిల్లలకు మానసిక వైకల్యమని చెప్పుకోడానికి కూడా భయం. బంధువుల్లో పరువు పోతుందనో, చులకనైపోతామనో దాచిపెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఈ రుగ్మతలున్న వారు తేడాగా ప్రవర్తిస్తుంటారు. లేదా ఇతరుల దృష్టిలో వింత ఆలోచనలు, ప్రవర్తన వున్నవారిగా కనిపిస్తుంటారు. 'ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని మందలించిన తల్లిపై కత్తితో దాడి చేయడంతో, ఆమె అక్కడికక్కడే చనిపోతుంది. అతనికి మతి స్థిమితం సరిగాలేదని బంధువులు చెబుతుండగా, అప్పుడప్పుడు బట్టలు వేసుకోకుండానే ఇంట్లో తిరిగేవాడని పనిమనిషి చెబుతుంది.' ఇదొక ఉదాహరణ మాత్రమే. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు నుంచే ఈ సమస్య ప్రారంభమౌతుంది. మానసిక రుగ్మతలు, మానసిక వైకల్యం వంటివన్నీ ఒకేలా వుండవు. ఈ బలహీనతలు పెరిగి పెద్దదవడానికి కుటుంబ సభ్యులు కూడా కారణమౌతున్నారని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి.

మానసిక వైకల్యాన్ని పరువుకు సంబంధించిన అంశంగా చూస్తున్నారే తప్ప... ఇదొక అనారోగ్య సమస్య అని, అన్ని రోగాల మాదిరిగానే చికిత్స చేయించాలన్న భావనతో చూడలేకపోతుండం కూడా ఒక సామాజిక రుగ్మత. ఆందోళన, నైరాశ్యం వంటి మానసిక రుగ్మతలు భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రబలుతున్నాయి. వారి విపరీత ప్రవర్తన వల్ల ఎటువంటి అనర్థాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబంతో పాటు సమాజానికి వుంది. అందరిలాగే సమాన గౌరవం, జీవించే హక్కు వారికీ వుంది. మానసిక వైకల్యం కారణంగా ఎవరినీ వివక్షకు గురిచేయకూడదని ఐరాస స్పష్టంగా చెబుతోంది. ముఖ్యంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్న చాలామందికి సమర్థవంతమైన సంరక్షణ, చికిత్స అందుబాటులో లేదు. సరైన సమయంలో సరైన చికిత్స అందించడం ద్వారా వారిని మామూలు మనుషులుగా తీర్చిదిద్దవచ్చు. నోబెల్ బహుమతి గ్రహీత, అమెరికన్ కవయిత్రి లూయిస్ గ్లక్... చిన్నప్పుడు తీవ్రమైన అనారోగ్య సమస్యతో బాధపడేది. తరచూ చావు గురించి ఆలోచించేది. కొన్నేళ్లపాటు మానసిక చికిత్స కూడా తీసుకుంది. తన తల్లి వినిపించిన గ్రీకు పురాణగాథలు, ప్రకృతి ఆరాధన వంటివి లూయిస్‌ను ఎంతగానో ప్రభావితం చేశాయి. మానసిక రుగ్మతల నుంచి, చనిపోవాలన్న కోరిక నుంచి... సాహిత్యం వైపు నడిపించాయి. మనిషి తలచుకుంటే... ఏదీ అసాధ్యం కాదు. 'అలుముకున్న చీకటిలోనే అలమటించనేల/ కలతలకే లొంగిపోయి కలవరించనేల/ సాహసమను జ్యోతిని చేకూని సాగిపో' అంటారు మహాకవి శ్రీశ్రీ. మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారికి సరైన చికిత్స అందించగలిగితే, కుటుంబం వారికి అండగా వుంటే... వారు కూడా సమాజంలో గొప్పవారిగా నిలబడతారు.

మహనీయుల మాట



ఒక దేశం గొప్పతనం
ఆ దేశం
ప్రజలకు కల్పించిన హక్కులపై
ఆధారపడి వుంటుంది.
-హెచ్.జె. లాస్కీ,
బ్రిటిష్ ఆర్థికవేత్త.


# కాంగ్రెస్, ఆప్ అనైక్యత - బిజెపి గెలుపు

తెలకపల్లి రవి

దేశ రాజధాని ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. 27 సంవత్సరాలుగా అక్కడి అధికారానికి దూరంగా వుండిపోయిన బిజెపి అత్యధిక మెజార్టీతో ప్రభుత్వంలోకి రాబోతున్నది. 1998 కి ముందు దీర్ఘకాలం పాటు బిజెపి పట్టులో వుండి 1998-2013 మధ్య కాంగ్రెస్ హ్యాట్రిక్‌లు చూసి ఆ పైన (శాసనసభ వరకూ) ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కంచుకోటగా కనిపించిన ఢిల్లీ ఆ పార్టీ చేజారిపోయింది. ఎలాగైనా ఉనికి కాపాడుకోవాలని పాకులాడిన కాంగ్రెస్ ఖాతానే తెరవలేకపోయింది. ఒక దశలో జాతీయ ప్రత్యామ్నాయంగా ప్రచారమై తర్వాత సిబిఐ, ఇడి కేసులలో వరుసగా సవాళ్లనెదుర్కొని పదవిని కూడా వదులుకున్న అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా ఓడిపోయారు. ఆయన సన్నిహితులైన ముఖ్య నాయకులు కూడా ఓటమి చవిచూశారు. 2014, 2019 ఎన్నికలలో లోక్‌సభ స్థానాలు మొత్తం తెచ్చుకుని కూడా 2015, 2020 శాసనసభ ఎన్నికలలో బోల్తాపడిన బిజెపి ఈ సారి మాత్రం 2024 నాటి ఫలితాలనే కొనసాగించగలిగింది. లోక్‌సభలో స్వంతంగా మెజార్టీ తెచ్చుకోలేక చతికిల పడిన ప్రధాని మోడీ నాయకత్వంలో ఢిల్లీని కైవసం చేసుకోవడంతో ఎక్కడ లేని ఉత్సాహం వచ్చినట్టు హడావుడి చేస్తున్నారు. విడివిడిగా తలపడిన ఆప్ 43 శాతం పైన, కాంగ్రెస్ ఆరు శాతంపైన ఓట్లు తెచ్చుకుని కూడా తమలో తామే ఓట్లు చీల్చుకుని బిజెపి నెత్తిన పాలు పోశాయి.

## మొండిపట్టుతో ఓటమి

శాసనసభ ఎన్నికల ప్రకటనకు ముందు నుంచి కాంగ్రెస్, ఆప్‌లు కలిసి పోటీ చేస్తాయా లేదా అన్నదే కీలకాంశంగా చర్చ జరిగింది. కాంగ్రెస్ విషయానికి వస్తే ఇటీవల హర్యానా శాసనసభ ఎన్నికల్లో ఆప్‌కు కనీస స్థానాలు కేటాయించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తర్వాత మహారాష్ట్రలోనూ అంతే జరిగింది. తాను బలంగా వున్న చోట్ల ఇతర పార్టీలతో సీట్ల సర్దుబాటు చేసుకోకుండా తను లేని చోట మాత్రం ఇతరులు ఇవ్వాలని కాంగ్రెస్ కోరుకోవడం 'ఇండియా' వేదికలో భాగస్వాములు ఆమోదించడం లేదు. ఢిల్లీ వరకైతే ఆప్, కాంగ్రెస్ రెండూ ఒంటరిగానే వెళతామని గతంలోనే ప్రకటించాయి. ఆప్ కూడా అదే కోరుకుంది. లిక్కర్ స్కాంలో అరెస్టయిన అరవింద్ కేజ్రీవాల్ బెయిలు మీద బయిటకు రాగానే తాము ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. ఎందుకంటే అంతకు ముందు జరిగిన హర్యానా శాసనసభ ఎన్నికల్లో ఆప్‌కు కనీస స్థానాలు కేటాయించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తర్వాత మహారాష్ట్రలోనూ అంతే జరిగింది. ఫలితాలలో ఘోరంగా దెబ్బతిన్న తర్వాత కూడా కాంగ్రెస్ కలసి పోటీ చేయకపోవడం నష్టం కలిగించిందని ఒప్పుకోవడం లేదు. పైగా ఇందుకు బాధ్యత తమది కాదన్నట్టే మాట్లాడుతున్నది. ఫలితాలు వస్తుండగానే జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఒక ట్వీట్ చేస్తూ మీరు పోట్లాడుకుంటూ వుండండి. వారు గెలుస్తూ వుంటారని హెచ్చరించారు. నిజానికి కాశ్మీర్ ఎన్నికలలో కూడా నేషనల్ కాన్ఫరెన్స్, సిపిఎంలతో కలసి పోటీ చేసిన కాంగ్రెస్ వ్యవహరించిన తీరు, సాధించిన ఫలితాలు ప్రతికూలంగా వున్నాయి. ఉత్తరాది చివర ఉమర్ ఆ విధంగా వ్యాఖ్యానిస్తే తెలంగాణలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా అదే తరహాలో రాహుల్ గాంధీ వల్లనే బిజెపి గెలవగలిగిందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నిజానికి తెలంగాణలోనూ కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల పరస్పర పోటీలో బిజెపి లబ్ధి పొందుతున్నదని దేశమంతటికీ తెలుసు. ఇక నేరుగా ఆప్ అధినేత కేజ్రీవాల్ స్పందన చూస్తే తమ పాలనలో చేసిన పనులు చెప్పుకుని, విజయం సాధించిన బిజెపికి శుభాకాంక్షలు చెప్పడం తప్ప ఓటమిపై ఆత్మ విమర్శ, పరిశీలన కనిపించవు.




ముందు జరిగిన హర్యానా శాసనసభ ఎన్నికల్లో ఆప్‌కు కనీస స్థానాలు కేటాయించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తర్వాత మహారాష్ట్రలోనూ అంతే జరిగింది. ఫలితాలలో ఘోరంగా దెబ్బతిన్న తర్వాత కూడా కాంగ్రెస్ కలసి పోటీ చేయకపోవడం నష్టం కలిగించిందని ఒప్పుకోవడం లేదు. పైగా ఇందుకు బాధ్యత తమది కాదన్నట్టే మాట్లాడుతున్నది. ఫలితాలు వస్తుండగానే జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఒక ట్వీట్ చేస్తూ మీరు పోట్లాడుకుంటూ వుండండి. వారు గెలుస్తూ వుంటారని హెచ్చరించారు. నిజానికి కాశ్మీర్ ఎన్నికలలో కూడా నేషనల్ కాన్ఫరెన్స్, సిపిఎంలతో కలసి పోటీ చేసిన కాంగ్రెస్ వ్యవహరించిన తీరు, సాధించిన ఫలితాలు ప్రతికూలంగా వున్నాయి.

## కేసులతో వేధింపులు

ఆప్ ఓటమికి దారి తీసిన తప్పిదాలు, పాలనలో పొరబాట్లు చాలా వున్నాయి. లిక్కర్ స్కాం వంటి ఆరోపణలకు అవకాశం ఇవ్వడం కూడా సమర్థనీయం కాదు. లౌకికతత్వం కోసం పోరాడటంలోనూ. బిజెపి వ్యతిరేకులను కలుపుకొని పోవడంలోనూ ఆప్ పెద్ద ఆసక్తి చూపింది లేదు. వ్యక్తిగతంగా కేజ్రీవాల్ కూడా తనే ప్రత్యామ్నాయం అన్న సంకేతాలిస్తూ వచ్చారు. కొన్ని సందర్భాల్లో మతపరమైన క్రతువులలోనూ పాల్గొని అత్యుత్సాహం ప్రదర్శించారు. రాజకీయ విధానాల పరంగా స్థిరత్వం లేకపోవడం నిజమే అయినా రాజ్యాంగ రీత్యా ఢిల్లీ ప్రత్యేక పరిస్థితిని ఆసరా చేసుకుని లెఫ్టినెంట్ గవర్నర్‌ను అడ్డం పెట్టుకుని అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తూ వేధించిన తీరు మాత్రం సరి కాదు. ఆప్ నాయకత్వం కూడా ఒక దశలో మోడీ పట్ల మెతకదనం, కాశ్మీర్ 370 రద్దుకు మద్దతు వంటి పనులు చేసినా వీటన్నిటి తర్వాత కళ్లు తెరవక తప్పలేదు. ఇండియా వేదికలో భాగస్వామి కావడం వివిధ రాష్ట్రాలు సందర్శించి మద్దతు కోరడం అందులో భాగమే. కానీ ఢిల్లీకి వచ్చేసరికి కాంగ్రెస్, ఆప్ తీవ్ర ప్రత్యర్థులుగానే వ్యవహరించాయి. ఉభయ పార్టీలూ తమ దారిలో తాము నడిచాయి. అందువల్లనే ఈ పరాజయం అనివార్యమైంది.

పొలిటికల్ స్టార్టప్‌లా కొన్ని ప్రయోగాలతో దేశాన్ని ఆకర్షించిన ఆప్ పదేళ్ల తర్వాత పరాజయం కొనితెచ్చుకుంది. కేసుల ఒత్తిడి కారణంగా కేజ్రీవాల్ వైదొలగి అతిషిని ముఖ్యమంత్రిని చేసినా ఆయనను మళ్లీ పదవిలో కూర్చోబెట్టడమే తన లక్ష్యమని ఆమె ప్రకటించారు. ఆయన కూర్చున్న కుర్చీలో కూర్చోబోనంటూ అతి వినయం ప్రదర్శించడం ఒక విధంగా తమిళనాడులో పన్నీర్ సెల్వన్ జయలలిత పట్ల వ్యవహరించిన తీరును గుర్తు చేసింది. ఎన్నికల్లో చివరకు ఆమె గెలవగా కేజ్రీవాల్ మాత్రం ఓడిపోయారు. అవినీతిపై పోరాటంలో ఒకప్పుడు ఆయనకు మార్గదర్శిగా వుండిన అన్నా హజారే వెంటనే రంగంలోకి వచ్చి ఏకపక్షంగా శాపనార్థాలు పెట్టడంలో సమతుల్యత లోపించింది. అంటే ఇతర రాజ్యాంగ ప్రజాస్వామిక కోణాలు ఆయన పట్టించుకోలేదని చెప్పాలి.

## ద్వంద్వ ప్రమాణాలు

తమాషా ఏమంటే లిక్కర్ స్కాంతో సంబంధం వున్న మాగుంట శ్రీనివాసరెడ్డి టిడిపి ఎంపీగా ఎన్డీఎలోనే వున్నారు. ఢిల్లీలో మొదలైన ఈ స్కాంలోనే బిఆర్ఎస్ ఎంఎల్‌సి, కెసిఆర్ కుమార్తె కవితను అరెస్టు చేసి చాలా కాలం జైలులో నిర్బంధించారు. ఆరోపణలను విచారించ వలసిందే గానీ తమతో వుంటే ఒకలా లేకపోతే మరోలా ద్వంద్వ ప్రమాణాలు పాటించడం ఎలా చెల్లుతుంది? ఢిల్లీ బిజెపి నాయకులు ముఖ్యమంత్రి అతిషితో సహా అనేక మంది నాయకులపై చవకబారు వ్యాఖ్యలతో వివాదాలు రగిలించారు. బంగ్లా శరణార్థులు రోహింగ్యాల రాకను ప్రధాన సమస్యగా మతపరమైన అంశాలను ముందుకు తెచ్చారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి ప్రచారం ఆపేయాలని నిబంధనలున్నా ప్రధాని మోడీ త్రివేణీ సంగమంలో మహాకుంభ స్నానం చేసి మతపరమైన సంకేతాలు పంపించారు. ప్రతిపక్షాల వాగ్దానాలను రేవడీ (తాయిలం)గా అపహాస్యం చేసే మోడీ స్వయంగా ఢిల్లీ వాసులకు ఆపద మొక్కుల్లాంటి వరాల వాన కురిపించారు. ఏకంగా మూడు ఎన్నికల ప్రణాళికలు ప్రకటిస్తూ కొత్త కొత్త వాగ్దానాలు గుప్పించారు. సరిగ్గా బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపు 12 లక్షలకు పెంచడం కూడా ఢిల్లీ ఎన్నికల కోణంలోనేనన్న అభిప్రాయం నెలకొన్నది. తాము వస్తే ఆప్ పథకాలను రద్దు చేస్తామన్నది ప్రచారం మాత్రమేనని అన్నీ యథాతథంగా కొనసాగిస్తామని ప్రచారం చేసింది. ఈ సామదానభేద దండోపాయాలతో పాటు ప్రతిపక్షాల ఓట్ల చీలిక కూడా తోడై బిజెపి పెద్ద విజయమే సాధించగలిగింది.

## ఢిల్లీ కీలక ప్రాధాన్యత

కేంద్రంలో తమ అధికారం సంపూర్ణంగా చలాయించడానికి ఢిల్లీ పగ్గాలు చేతిలో పట్టుకోవడం తప్పనిసరి అని బిజెపి భావన. అందుకే స్వయంగా మోడీనే ప్రచార బాధ్యత మీద వేసుకోవడంతో పాటు ఎనిమిది నెలలుగా ఇందుకు తీవ్ర కసరత్తు చేశారు. ఆప్‌ను ఇక సహించం, మార్పు సాధిస్తాం అన్న ఎన్నికల నినాదం ఎత్తుకున్నారు. ఈ మధ్యనే రైతుల ఆందోళన పట్ల ఎలా వ్యవహరించారో చూశాం. ఢిల్లీ రాజధాని కావడంతో అక్కడ నిరసనలు తెలిపే హక్కులకు కూడా ఇక ముప్పు వాటిల్లవచ్చు. పోలింగ్ ముగిశాక కూడా కేజ్రీవాల్, అతిషిలతో సహా పలువురు నాయకులపై కొత్త కేసులు నమోదు చేశారంటే వారి దాడి తీవ్రత తెలుస్తుంది. ఇప్పుడు ఈ ఫలితాలు వస్తుండగానే సచివాలయం మూసివేయడంతో సహా మరిన్ని దాడులకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తుంది. ఈ విజయం ప్రభావం ఎలా వుంటుందో, వివిధ రాజకీయ పార్టీలూ శక్తులూ ఎలా స్పందిస్తాయో చూడాలి. ఇన్ని చేసినా ప్రతిపక్షాలకు దాదాపు యాభై శాతం ఓట్లు రావడం గమనిస్తే ప్రజలలో ప్రజాస్వామిక కాంక్ష ఎంత లోతుగా వేళ్లూనుకుని వుందో తెలుస్తుంది. ఈ ఫలితాలను, పరిణామాలను మరింత కూలంకషంగా అధ్యయనం చేసి తగు పాఠాలు తీసుకోవడం జరుగుతుందని ఆశించాలి.

దీంతోపాటే ఎన్నికల నిర్వహణపైనా ముందే సందేహాలు వ్యక్తమైనాయి. వాటిపైన కూడా సంతృప్తికరమైన సమాధానాలు రావలసే వుంటుంది. ఆప్ ముందే ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేస్తూ వచ్చింది. రాహుల్ గాంధీ కూడా లోక్‌సభ ప్రసంగంలోనే అభ్యంతరాలు లేవనెత్తారు. కనుక ఫలితాల తర్వాతా ఆ చర్చ కొనసాగవచ్చు. న్యాయపరమైన సాంకేతికమైన ప్రక్రియలు ఎలా వున్నా రాజకీయంగా నేర్చుకోవలసిన అంశాలు ఆచరణలో దిద్దుకోవలసిన పొరబాట్లపైనే దృష్టి పెట్టడం ఇక్కడ కీలకం.

★


కేంద్రంలో తమ అధికారం సంపూర్ణంగా చలాయించడానికి ఢిల్లీ పగ్గాలు చేతిలో పట్టుకోవడం తప్పనిసరి అని బిజెపి భావన. అందుకే స్వయంగా మోడీనే ప్రచార బాధ్యత మీద వేసుకోవడంతో పాటు ఎనిమిది నెలలుగా ఇందుకు తీవ్ర కసరత్తు చేశారు. ఆప్‌ను ఇక సహించం, మార్పు సాధిస్తాం అన్న ఎన్నికల నినాదం ఎత్తుకున్నారు. ఈ మధ్యనే రైతుల ఆందోళన పట్ల ఎలా వ్యవహరించారో చూశాం. ఢిల్లీ రాజధాని కావడంతో అక్కడ నిరసనలు తెలిపే హక్కులకు కూడా ఇక ముప్పు వాటిల్లవచ్చు. పోలింగ్ ముగిశాక కూడా కేజ్రీవాల్, అతిషిలతో సహా పలువురు నాయకులపై కొత్త కేసులు నమోదు చేశారంటే వారి దాడి తీవ్రత తెలుస్తుంది. ఇప్పుడు ఈ ఫలితాలు వస్తుండగానే సచివాలయం మూసివేయడంతో సహా మరిన్ని దాడులకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తుంది. ఈ విజయం ప్రభావం ఎలా వుంటుందో, వివిధ రాజకీయ పార్టీలూ శక్తులూ ఎలా స్పందిస్తాయో చూడాలి.

# బడి 'జట్టు' - బడ్జెట్టు

మొత్తంమీద ఈసారి బడిజట్టులో మధ్యతరగతి కింది తరగతివాళ్ళను బాగా పట్టించుకున్నారట కద యాదన్నా, అన్నాడు నర్సింగ్. పక్కనే ఉన్న దామోదర్ అడిగాడు బడిజట్టు ఏమిటి నర్సింగ్ అన్నాడు. అదే అన్నా, ఆర్థిక మంత్రి పార్లమెంటులో పెద్ద స్పీచ్ ఇచ్చి ఎలా సంపాదించాలి ఎలా ఖర్చు చేయాలి అని సూటుకేసులో పేపర్లు పెట్టుకొస్తారే! అది నేననేది అనేసరికి దామోదర్ నవ్వాడు. ఎందుకన్నా నవ్వుతావు అన్నాడు నర్సింగ్ అమాయకంగా. దాన్ని బడ్జెట్ అంటారు నర్సింగ్ అని చెప్పాడు దామోదర్. ఇద్దరి మాటలూ వింటున్న యాదన్న అందుకొని, మన నర్సింగ్ చెప్పిన దానిలో తప్పేమీ లేదు దామోదర్, లోతుగా చూస్తే ఎవరి బడి వారికుంది పార్లమెంటులో అంటే ఎవరి స్కూల్ వారిదన్నమాట! వాళ్ళ వాళ్ళ బడులకు మంచిపనులు ఈ బడ్జెట్ ద్వారా చేస్తారన్న మాట. ఏ బడ్జెట్టుకైనా ముందు చాంబర్ ఆఫ్ కామర్సు వ్యాపారవేత్తలతో, పరిశ్రమల యజమానులతో కలిసి ఆర్థిక మంత్రి సంప్రదింపులు జరుపుతారు కదా. అది సంగతి. నాకు నోరు తిరగక అలా అన్నాను కాని దానిలోనూ నిజముందని యాదన్న భలే చెప్పిండు అని నర్సింగ్ మురిసిపోయాడు. ఇక మిత్రులందరితో ఈ విషయం చెప్పుకోవాలని అక్కడినుండి లేచాడు.

ఈ బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటిరోజు అన్ని పేపర్లలో రకరకాల వార్తలొస్తాయి. మధ్యతరగతిని లెక్కలోకి తీసుకున్న ప్రభుత్వం అని ఒకరు, ఉన్నోళ్ళకే మళ్ళీ పెద్ద పీట అని ఒక పేపర్లో, అందరినీ ఆదరించిన బడ్జెట్ అని ఒక పేపరు ఇలా ఎన్నో వార్తలు. అసలు ఏ పద్దుల్లో ఎలాంటి ఖర్చులు చేస్తారు, ఏ సరుకులు, వస్తువులు ధరలు తగ్గుతాయి, ఏవి పెరుగుతాయి, రూపాయి రాక ఎలా ఉంటుంది, రూపాయి పోక ఎలా ఉంటుంది అన్న విశ్లేషణలూ ఉంటాయి. ఇక నిజాలు మాత్రమే నిఖార్సుగా రాసే పత్రికలు ఇది కార్పోరేట్ల బడ్జెట్ అని, పెద్దోళ్ళ బడ్జెట్ అని, ఇది మామూలేననీ రాస్తాయి. ఈ రాతలు కూడా మామూలే. మేమవన్నీ పట్టించుకోమని ఈ ఆర్థిక పద్దులు ప్రవేశపెట్టేవాళ్ళూ అంటుంటారు. ఇక ప్రధాని ఎవరైనా సరే మా ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టింది అభివద్ధికరమైన బడ్జెట్ అని అనడం, తరువాత రాష్ట్రపతి తనకు రాసిచ్చిన ఉపన్యాసం చదువుతూ ఇది దేశాన్ని ముందుకు తీసుకుపోయే బడ్జెట్ అని మాట్లాడడం కూడా మామూలే. వీళ్ళంతా కూడా అసలు అంబేద్కర్ మహాశయుడు, ప్రజల పార్టీలు దీనిపై ఏమి చెప్పారు అని ఒక్కసారి చూసినా పరిస్థితి ఇలా ఉండదు.

ఇవన్నీ చూసి అది నిజమేనా, ఇది నిజమేనా అని సామాన్య




ప్రజలు తమ తెలివికి పదును పెట్టి ఆలోచిస్తారు. ఏముందిలే కొత్త సీసాలో పాత సారా అని కొందరు పెదవి విరుస్తారు. ఆ.. ఈ బడ్జెట్ మన బతుకుల్ని బాగు చేసిందెప్పుడు, ఏ బడ్జెట్ చూసినా ఏమున్నది గర్వకారణం అని కొద్దిగా కవిత్వాన్ని కలిపి చెప్పేవాళ్ళూ ఉన్నారు. కొందరు కవులు కూడా తమవంతు బాధ్యతగా ఆర్థికాంశాలతో కవిత్వం రాస్తారు. ఇక కార్మిక, ఉద్యోగ సంఘాలు అసలు ఇది ఎవరి బడ్జెట్ అని సదస్సులూ పెడతారు. విద్యార్థి, యువజన సంఘాలు కూడా తమ వంతుగా ప్రచారాలు చేస్తుంటారు. అసలు అక్కడినుండే కదా ముందు తరం తయారయ్యేది. అందుకే విద్యకు, వైద్యానికి ఈ బడ్జెట్లలో వేసే పీట రోజు రోజుకూ చిన్నగైపోవడం గురించి వాళ్ళు చెబుతారు. వాటికి ఇన్ని కోట్లు కేటాయించామని ప్రభుత్వాలు చెబుతారు కాని మొత్తంలో వాటి శాతం తగ్గిపోవడం మనం చూస్తూనే ఉంటాము. చెప్పేటోళ్ళు చెబుతూనే ఉంటారు, రాసేటోళ్ళు రాస్తూనే ఉంటారు. కాని ఎన్నికల సమయంలో ఇవేవీ ప్రజలకు గుర్తుండవు. అందుకే వాళ్ళకు సరిపోయే బడ్జెట్లు ఇంకా రావడం లేదు. ఎప్పుడూ ప్రజలను ఏమీ అనకూడదు. ఎందుకంటే వాళ్ళకు అర్థమయ్యేటట్లు చెప్పడం లేదని కాదు కాని అర్థం చేయడం చాలా చాలా ముఖ్యం. వాళ్ళ నుండే ప్రజల్ని బాగు చేసే నాయకులు వస్తారు మరి. పునాది వాళ్ళ నుండి ఉంటే కాని తాము కోరుకున్న సమాజం రాదు. ఇలాంటి బడ్జెట్లు ఎన్నో వస్తూ పోతూ ఉంటాయి ఎన్నికల్లాగ. అంతర్లీనంగా మార్పు అనేది కొద్దిగానైనా వస్తుందో లేదో చూసుకోవడం అభ్యుదయ శక్తులకు ఒక బాధ్యతగా ఉండాలి.

ఒక పక్క కొత్త పారిశ్రామిక వేత్తలకు ఇన్ని కోట్ల రుణాలిస్తామని అంటూనే ఇంకో పక్క బీమాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నూరు శాతానికి పెంచుతున్నామంటారు. వేతన జీవుల వెతలన్నీ ఇక మటుమాయం, మా అక్క అందరినీ బాగా చూసుకుంటుంది అనుకునేలోపు పెంచిన ఆదాయపు పన్ను పరిమితి ద్వారా ఎలాంటి లాభంలేదని పాత, కొత్త ఆదాయపు పన్ను లెక్కలతో సహా ఇంకొకరు పోస్టు పెడతారు. కనీసం ఆనందపడిన సమయం కొద్దిగానైనా మిగిలించకుండా ఈ వార్తలేమిటిరా బాబూ అనుకునే ఉద్యోగులు మళ్ళీ దేంట్లోనో పొరబడ్డామని కించిత్ నిరాశ పడతారు. ఆశ దోశ అప్పడం అన్నట్టు ఈ బడ్జెట్టు ఉందని వాపోతారు.

బడ్జెట్ పద్మనాభాలు, రాజబాబులు, రేలంగిలు, బ్రహ్మానందాలు ఎవ్వరూ ఆనందంతో లేరని, నవ్వించేవాళ్ళెవరూ నవ్వుతూ లేరని, దాన్నే తాత్వికంగా బడ్జెట్ అందురు అని ఒక ఆర్థిక స్వామీజీ చెప్పొచ్చు. ఏది రాక ఏది పోక అంతా భ్రమ నాయనా, అంతా భ్రమే తల్లీ అందుకే ఈ డబ్బు మీద వ్యామోహం మాని ఇహలోకం మీద పొందే సుఖాలు ఏవీ ఉండవని నమ్మండి. అనే స్వామీజీకి....మీరెప్పుడూ అంతే తత్వం మాకు చెబుతారు, ఆర్థికం వాళ్ళకు చెబుతారు. సుఖంగా ఉండేది వాళ్ళు, కష్టాలు పడేది, పడాల్సింది మేము అన్న సమాధానం ఎదురైనప్పుడే అసలు విషయం తెలిసేది. స్వాములెప్పుడూ రాజులకు, తరువాత రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు అనుకూలంగా ఉంటారని తెలుసుకుంటారు జనాలు. ప్రవచనాలు చెప్పేవాళ్ళెప్పుడూ ఈ బడ్జెట్లు మంచివి కావని చెప్పనే చెప్పరు. ఇంకా వీలైతే రాజులు, వారి బాధ్యతలు, వాళ్ళ ఖర్చులకు ప్రజలే కదా డబ్బు సమకూర్చాలని చెప్పినా చెప్పొచ్చు.

కాబట్టి నర్సింగ్ చెప్పినట్టు ఈ ఆర్థిక పద్దులకు సంబంధించి ఎవరి బడి వాళ్ళకుంటుంది. ఎవరి బడికి వాళ్ళు సౌకర్యాలు, కేటాయింపులు చేస్తూ ఉంటారు. వ్యతిరేక బడుల వాళ్ళు బలోపేతం కావడమే కదా ప్రజలకు కావలసింది. అప్పుడే ప్రజల బడికి సంబంధించిన బడ్జెట్లు వచ్చేది. గమనించండి జాగ్రత్తగా.

- జంధ్యాల రఘుబాబు
సెల్ : 9849753298

# పెన్షన్ సాధన కోసం ...



ఫిబ్రవరి 10న ఢిల్లీలో మహా ధర్నా

వికలాంగుల పెన్షన్ చట్టబద్ధమైన హక్కు సాధన కోసం, అలాగే కేంద్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ వాటా రూ.300 నుండి రూ.5000కు పెంచాలని, ప్రతి వికలాంగునికి అంత్యోదయ రేషన్ కార్డు, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఇచ్చి 200 రోజులు పని దినాలు కల్పించాలని, 2025-26 కేంద్ర బడ్జెట్లో 5 శాతం నిధులు కేటాయించాలని ఫిబ్రవరి 10న వేలాది మంది వికలాంగులు దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం అవుతున్నారు.

దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2.68 కోట్ల మంది వికలాంగులున్నారు. డబ్ల్యు.హెచ్.ఓ లెక్కల ప్రకారం 16 శాతం మంది వికలాంగులు ఉన్నారు. కానీ వికలాంగుల జనాభాను గుర్తించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. 2012 నుండి పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం 300 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నది. నిత్యావసర సరకుల ధరలు 300 రెట్లు పెరిగాయి. కానీ పెన్షన్లు మాత్రం పెంచకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ధరల పెరుగుదల సూచీకి పెన్షన్లను అనుసంధానం చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకాన్ని వికలాంగులందరికి వర్తింపచేయాలి. రాజస్థాన్ మాదిరిగా పెన్షన్ పొందడం వికలాంగుల హక్కుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలి. 2015 డిసెంబర్ 3న ఆర్భాటంగా ప్రధాన మంత్రి ప్రారంభించిన సుగమ్య భారత్ అభియాన్ పథకం అమలుకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిధుల కేటాయింపులో కేంద ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ఫలితంగా 2024 సంవత్సరం పూర్తయినా లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. కేంద్ర ప్రభుత్వం అసమర్థత వలన 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, 2007 ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పంద పత్రం, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ వంటి కీలక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదు. 2016 ఆర్.పి.డి చట్టానికి సవరణ చేయడానికి విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలి. 2016 ఆర్.పి.డి చీఫ్ కమిషనర్, నేషనల్ ట్రస్ట్‌కు 11 సంవత్సరాల నుండి చైర్మన్లను నియమించడం లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయడం వలన రిజర్వేషన్లు అమలయ్యే అవకాశం లేకుండా పోతుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలి.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి 0.025 శాతం కేటాయించారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలి. వికలాంగుల సాధికారత శాఖకు కేటాయింపులు పెరిగినట్లు అంకెల్లో కన్పిస్తున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కేటాయించిన నిధుల్లో 2020-21లో 64 శాతం, 2021-22లో 86 శాతం, 2022-23లో 79 శాతం, 2023-24 లో 93 శాతం విడుదల కాలేదు. 2025-26 బడ్జెట్‌లో సైతం అదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది. నరేంద్ర మోడీ వికలాంగులను దివ్యాంగులుగా పేరు మార్చి మోసం చేస్తున్నారు. బడ్జెట్ సవరించి వికలాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించాలి.

- యం. అడివయ్య,
ఎన్.పి.ఆర్.డి జాతీయ ఉపాధ్యక్షులు,
సెల్ : 94900 98713

## ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

● నీతి ఆయోగ్ ఉపాధ్యక్షులు సుమన్ కుమార్ బేరీ

**ప్రజాశక్తి పాడేరు**

ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగు పడాలని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షులు సుమన్ కుమార్ బేరీ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో ఆకాంక్ష బ్లాక్ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారు మూల గ్రామాలను మరింత వేగంగా అభివృద్ధి చెందాలన్నారు. వైద్య ఆరోగ్య సేవలు, పోషకాహారం, వ్యవసాయం నీటిపారుదల సదుపాయాలు, ఆర్థిక చేకూర్పు, నైపుణ్యాభివృద్ధి, మారుమూల గ్రామాలకు కనీస సౌకర్యాలపై సమీక్షించారు. నీతి ఆయోగ్ మంజూరు చేసిన నిధుల వినియోగంపై అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రి ప్రసవాలకు ప్రజలు స్వయంగా వస్తున్నారా, ఇంటి వద్ద ప్రసవాలకు ఆసక్తి చూపిస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. అటవీ హక్కు పత్రాలు జారీ చేసిన భూముల్లో రైతులు ఎటువంటి పంటలు వేస్తున్నారని ఆరా తీశారు.

# మాధవధార మెట్టకు అనారోగ్యం

● కిడ్నీ వ్యాధులతో మరణాలు
● స్టోన్ క్రషర్ వ్యర్థాలతో శ్వాస సంబంధిత వ్యాధులు
● చోద్యం చూస్తున్న యంత్రాంగం

**ప్రజాశక్తి- జామి (విజయనగరం జిల్లా)**

విజయనగరం జిల్లా జామి మండల కేంద్రంలోని మాధవరాయమెట్ట అనారోగ్యం బారిన పడింది. ఈ ప్రాంతవాసులు కిడ్నీ వ్యాధుల బారిన కొందరు, టిబి, శ్వాస వ్యాధులతో మరికొందరు మృత్యువాత పడుతున్నారు. ఉపాధి కల్పించే క్వారీలు, స్టోన్ క్రషర్ నుంచి వచ్చే ధూళితో వారంతా అనారోగ్యానికి గురవుతున్నారు. వైద్య సేవలందించాలని కోరుతున్నారు.

అది 1980 నాటి కాలం. జామి గ్రామ శివారున చిన్న గుడిసెలు వేసుకుని జీవించే కార్మిక కుటుంబాలవి. అరకు, అనంతగిరి, ఒడిశా ప్రాంతాల నుంచి క్వారీ పనుల కోసం వచ్చిన వారే ఎక్కువ. అత్యధికం దళిత, గిరిజన కుటుంబాలే. ఒకరిద్దరితో మొదలైన కాలనీ నేడు 150 ఇళ్లకు చేరింది.



అలాంటి కాలనీ వాసులకు కిడ్నీ మహమ్మారి సోకింది. సుమారు పది మంది వరకు కిడ్నీ వ్యాధితో చనిపోయారు. టిబి, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడి చనిపోయిన వారూ ఉన్నారు. కాలనీ చుట్టూ స్టోన్ క్రషర్లు వెదజల్లే దుమ్ము, ధూళి వల్లే కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నామని జనం గగ్గోలు పెడుతున్నారు. పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

**ఉపాధినిచ్చే క్వారీలే ఉసురు తీస్తున్నాయి**

ఒకప్పుడు జామి క్వారీల్లో కాలనీ వాసులకు చేతినిండా పని దొరికేది. నేడు యంత్రాల వాడకం అందుబాటులోకి వచ్చాక కాంట్రాక్టర్లు కార్మికులను పనుల నుంచి తప్పించారు. పనులకు దూరమైన జనానికి, క్రషర్లు వెదజల్లే దుమ్ము, ధూళి శాపంగా మారాయి. బ్లాస్టింగులు జనానికి నిద్రాహారాలు లేకుండా చేస్తున్నాయి. మాధవరాయమెట్ట గ్రామానికి అడుగుల దూరంలో ఉన్న కపిల్ కాంక్రీట్ స్టోన్ క్రషర్ గత కొన్నా వందల రెట్లు సామర్థ్యం పెంచుకుని కాలనీపై విషపువిడిగా వ్యర్థాలు వదులుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలు వ్యాధులబారిన బారిన పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదులిచ్చినా పట్టదం లేదు.

**కిడ్నీ వ్యాధికి బలైన వారు వీరే..**

కాలనీలో కిడ్నీ బారిన పడి మొదట యువకుడు పిట్ట రాంబాబు మృత్యువాత పడ్డాడు. ఆ తర్వాత ఎద్దు గురుమూర్తి, మిడతాన దాలయ్య, పైడినోళ్ల మాణిక్యం, కొల్లాపు అప్పారావు, కొర్రా కాంతమ్మ, బడినేని అప్పారావు, వంతల మాసి తదితరులు ఉన్నారు. తాజాగా గుజ్జెల సునీయా, వంతల మల్లమ్మ శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడి, హఠాత్తుగా మరణించారు. ఇంకా అనేక మంది వ్యాధుల బారిన పడి అవస్థలు పడుతున్నారు.

**గ్రీవెన్స్ ఫిర్యాదులు బుట్టదాఖలు**



కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఇప్పటికే అనేకసార్లు ఫిర్యాదులు చేశాం. స్టోన్ క్రషర్ కాలుష్యం వల్లే వ్యాధులబారిన పడుతున్నాం. అధికారులు వచ్చి, జనం కన్నా క్రషరే ముందు ఉందని అంటున్నారు. ఒకవేళ అదే నిజమైతే, కాలనీని వేరే ప్రాంతానికి తరలించాలి.

**- వంతల వెంకటి, గిరిజనుడు**

**స్టోన్ క్రషర్ దుమ్ముతో నిండిపోతుంది**



కాలనీకి అతి సమీపంలో స్టోన్ క్రషర్ ఉంది. దాని నుంచి నిత్యం దుమ్ము, ధూళి వస్తోంది. దీనివల్ల కాలనీవాసులం అనారోగ్యం పాలవుతున్నాం. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.

**- కొర్రా నీలన్న, గిరిజన క్వారీ కార్మికుడు**

## ఫిలిప్స్ సెంచరీ

● పాకిస్తాన్‌పై 78 పరుగుల తేడాతో న్యూజిలాండ్ గెలుపు

**లాహోర్:** ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు పాకిస్తాన్ వేదికగా జరుగుతున్న ట్రయాంగులర్ సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు బోణీ కొట్టింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో శనివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్(106నాటౌట్) సెంచరీతో రాణించడంతో నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 330పరుగులు భారీస్కోర్ నమోదు చేసింది. అనంతరం పాకిస్తాన్‌ను 47.5ఓవర్లలో 252పరుగులకే ఆలౌట్ చేసింది. పాకిస్తాన్ ఓపెనర్ ఫకర్ జమాన్(84) అర్ధసెంచరీకి తోడు ఆఘా సల్మాన్(40), తయాబ్ తాహిర్(30) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. స్టార్ బ్యాటర్ బాబర్ అజమ్(10), రిజ్వాన్(3) నిరాశపరిచారు. న్యూజిలాండ్ బౌలర్లు హెన్రీ, సాంట్నర్‌కు మూడేసి, బ్రాస్‌వెల్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు న్యూజిలాండ్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ సెంచరీతో రాణించాడు. మిచెల్, విలియమ్సన్ అర్ధసెంచరీలతో రాణించడంతో ఆ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 330పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేసింది. చివరి ఆరు ఓవర్లలో న్యూజిలాండ్ జట్టు దాదాపు వంద పరుగులు చేయడం విశేషం.



# మొన్న దిగువశెంబి...నేడు దూళిభద్ర

● వాటర్ ట్యాంక్ నిర్మాణ సామగ్రి ఎత్తుకెళ్లిన కొటియా పోలీసులు
● చోద్యం చూస్తోన్న ఎపి అధికారులు

**ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)**

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒడిశా అధికారులు, పోలీసుల ఆగడాలు మళ్లీ శృతిమించుతున్నాయి. గత కొద్దిరోజులుగా కొటియా పోలీసులు, అధికారుల కవ్వింపు చర్యలు ఎపి అధికారులు, పోలీసులకు తలనొప్పిగా మారాయి. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న వివాదాస్పద గ్రామాల్లో గత కొంతకాలంగాప్రశాంత వాతావరణం నెలకొంది. ఎపి, ఒడిశా రాష్ట్రాల్లో ఎనిమిది నెలల క్రితం కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాయి. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు ఎపిలో అధికారంలో ఉండగా, ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వాల హయాంలో ఒడిశా పోలీసులు, అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల అండతో అనేక దుశ్చర్యలకు పాల్పడ్డాయి. ఎపి ప్రభుత్వం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడం, అభివృద్ధి పనులు జరగకుండా ఆటంకపర్చడం వంటి చర్యలకు ఒడిశా పోలీసులు, అధికారులు తెగబడ్డారు. అయితే, ఇప్పుడు మళ్లీ అలాంటి చర్యలకే ఒడిశా పోలీసులు, అధికారులు దిగుతున్నారు. వారం రోజుల క్రితం గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని దిగువశెంబిలో గల అంగన్‌వాడీ కేంద్రం నుంచి కొటియా పోలీసులు, అధికారులు కొన్ని మ్యాపులను, పుస్తకాలను తీసుకెళ్లిపోయకారు. ఈ సంఘటన మరువకముందే ఒడిశా పోలీసులు శనివారం గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని దూళిభద్రలో మరో దురాగతానికి పాల్పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద నిర్మాణమవుతున్న వాటర్ ట్యాంక్ సామగ్రిని, సిమెంట్‌ను వ్యాన్‌తో సహా తీసుకెళ్లిపోయారు. ఎపి ప్రభుత్వం దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపడుతోంది. సాలూరుకు చెందిన కాంట్రాక్టర్ రామకృష్ణ ఈ పనులు చేస్తున్నారు. వ్యాన్‌లో సిమెంట్, ఇనుము ఇతర సామగ్రిని దూళిభద్ర తీసుకెళ్లి అక్కడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఆ సమయంలో నిర్మాణ ప్రదేశానికి ఒడిశా పోలీసులు, అధికారులు వచ్చి వ్యాన్‌తో సహా నిర్మాణ సామగ్రిని కొఠియా పోలీసు స్టేషన్‌కు తరలించారని కాంట్రాక్టర్ తెలిపారు. వ్యాన్‌ను, డ్రైవర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇంత జరిగినప్పటికీ ఆంధ్రా అధికారులుగానీ, పోలీసులు గానీ ఈ వ్యవహారంపై నోరుమెదపడం లేదు. కొటియా గ్రామాల్లో రహదారులు, పాఠశాల భవనాల నిర్మాణం, జలజీవన్ మిషన్ వంటి పనులు ఒడిశా ప్రభుత్వం చేపట్టింది. ఈ పనులను ఎపి అధికారులు, పోలీసులు ఏనాడూ అడ్డుకోలేదు. అయితే, ఎపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను మాత్రం ఒడిశా పోలీసులు, అధికారులు అడ్డుకుంటున్నారు.కొద్దిరోజుల వ్యవధిలోనే కొటియా గ్రామాల్లో ఒడిశా పోలీసుల ఆగడాలు వృతిమించుతున్న తీరు ఎపి అధికారులు, పోలీసులను కలవరానికి గురి చేస్తోంది. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోతే తాము ముందుకు వెళ్లలేమనే నిస్సహాయతని ఎపి అధికారులు, పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.



దూళిభద్రలో ఎపి అధికారులు నిర్మిస్తున్న జలజీవన్ ట్యాంకు



# వీసా తిరస్కరణపై క్షమా సావంత్ మద్దతుదారుల ఆందోళన


**న్యూయార్క్:** ఇండో అమెరికన్ నాయకురాలు క్షమా సావంత్‌కు అత్యవసర వీసా నిరాకరించడంతో ఆమె మద్దతుదారులు అమెరికాలోని సియాటిల్‌లో ఉన్న భారత కాన్సులేట్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో శాంతిభద్రతల సమస్య తలెత్తిందని భారత కాన్సులేట్ వర్గాలు వెల్లడించాయి. "కార్యాలయ సమయం ముగిసిన తర్వాత కొందరు వ్యక్తులు కాన్సులేట్ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. వెళ్లిపోవాలని అనేకసార్లు సూచించినప్పటికీ.. వారు నిరాకరించారు. కాన్సులేట్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతోపాటు బెదిరింపులకు దిగారు" అని సియాటిల్‌లోని భారత కాన్సులేట్ శుక్రవారం పేర్కొంది. ఈ వ్యవహారంపై సియాటిల్ సిటీ కౌన్సిల్ మాజీ సభ్యురాలు క్షమా సావంత్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. 'తిరస్కరణ జాబితా'లో తన పేరు ఉందంటూ భారత కాన్సులేట్ కార్యాలయం వీసా నిరాకరించిందని పేర్కొన్నారు. మూడుసార్లు తన వీసా తిరస్కరించడానికి కారణాలను తెలపాలంటూ తాను భారత కాన్సులేట్ ముందు శాంతియుతంగా నిరసన చేపట్టానని తెలిపారు. బెంగళూరులో అనారోగ్యంతో ఉన్న తల్లి దగ్గరకు వెళ్లేందుకు తన భర్తకు వీసా మంజూరు చేశారని, తనకు మాత్రం నిరాకరించారని పేర్కొన్నారు. గతంలో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), జాతీయ పౌర పట్టిక (ఎన్‌ఆర్‌సి)కు వ్యతిరేకంగా సియాటిల్ సిటీ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఇందులో సావంత్ కీలకపాత్ర పోషించారు




# బైడెన్‌కు రహస్య సమాచారం తెలుసుకునే హక్కు రద్దు

ట్రంప్ కీలక నిర్ణయం

**న్యూయార్క్ :** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు దేశ రహస్య సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం లేదని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయా అనుమతులను రద్దు చేస్తున్నట్లు ట్రూత్ సోషల్ వేదికగా ఆయన వెల్లడించారు. 'ప్రస్తుతం జో బైడెన్ రహస్య సమాచారం పొందాల్సిన అవసరం లేదు. అందువల్ల మేము వెంటనే ఆయన భద్రతా అనుమతులను రద్దు చేస్తున్నాం. ఆయన రోజువారీ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్‌లను నిలిపివేస్తున్నాం. 2021లో నాకు ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ నుంచి జాతీయ భద్రతా సమాచారం తెలుసుకోవడాన్ని నిలిపివేశారు. దానికి ప్రతిగానే నేను ఈ చర్యలు తీసుకుంటున్నా. అంతేకాక.. ఆయన పేలవమైన జ్ఞాపకశక్తితో బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. అందువల్ల దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారం విషయంలో జాగ్రత్తలు వహించాలని నిర్ణయించుకున్నా. నేను ఎల్లప్పుడూ జాతీయ భద్రతను రక్షిస్తా' అని ట్రంప్ రాసుకొచ్చారు. ట్రంప్ నిర్ణయంపై బైడెన్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా సంప్రదాయం ప్రకారం.. అక్కడి మాజీ అధ్యక్షులకు జాతీయ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారం తెలుసుకునే అధికారం ఉంటుంది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌పై జోబైడెన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఆయన గెలుపునకు వ్యతిరేకంగా ట్రంప్ మద్దతుదారులు 2021 జనవరి 6న క్యాపిటల్ భవనంపై దాడి చేశారు. ఈనేపథ్యంలో ట్రంప్‌నకు అప్పటివరకు ఉన్న ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ అనుమతులను బైడెన్ తొలగించారు. దీనికి ప్రతీకారంగానే ట్రంప్ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.



## ఇజ్రాయిల్‌కు 7.4 బిలియన్ డాలర్ల ఆయుధాలు

● విక్రయించనున్నట్లు అమెరికా ప్రకటన

**వాషింగ్టన్ :** తమ దేశం తయారుచేసిన 7.4 బిలియన్ డాలర్ల విలువైన బాంబులు, క్షిపణులను ఇజ్రాయెల్‌కు విక్రయించేందుకు అమెరికా ఆమోదం తెలిపింది. ఇజ్రాయెల్, గాజా యుద్ధంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశమైన అనంతరం అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కో ఆపరేషన్ ఏజెన్సీ (డిఎస్‌సిఎ) ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. 600 మిలియన్ డాలర్ల హెల్‌ఫైర్ క్షిపణులతో పాటు 6.75 బిలియన్ డాలర్ల బాంబులు, మార్గదర్శక కిట్‌లు విక్రయించేందుకు నిర్ణయించినట్లు తెలిపింది. నెతన్యాహు అమెరికాలో పర్యటిస్తున్న క్రమంలోనే ఇంత మొత్తంలో ఆయుధాల విక్రయానికి ఆమోదం రావడం గమనార్హం. నరమేధం సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయిస్తున్నట్లు అమెరికా ప్రకటించడం పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తతలు రాజేసేందుకేనని పలువురు విమర్శిస్తున్నారు.

## ఢిల్లీ సచివాలయం సీజ్

● ఎల్‌జి ఆదేశం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ సచివాలయాన్ని సీజ్ చేయాలని ఎల్‌జి వికె సక్సేనా ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా ఫైళ్ళు, రికార్డులను తొలగించొద్దని అన్ని విభాగాలకు ఆదేశాలు అందాయి. ఆయన సూచనల మేరకు.. జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది. "భద్రతాపరమైన సమస్యలు, రికార్డుల భద్రతను పరిరక్షించుకునేందుకు ఈ అభ్యర్థన చేశాం" అని జిఎడి పేర్కొంది. సచివాలయంలోని అన్ని శాఖల ఇన్‌ఛార్జిలు, సెక్రటేరియట్ కార్యాలయాలు, మంత్రుల క్యాంపు కార్యాలయాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని, అన్ని రికార్డులను భద్రపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిన తర్వాత ఈ నిర్ణయం వెలువడటం చర్చనీయాంశమైంది.

## ఇంకా కొట్టుకుంటూనే ఉండండి..

● ఆప్, కాంగ్రెస్‌లపై ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ ఓటమిపై జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో బలం ఉన్న ఆప్‌కు కాంగ్రెస్ సహకరించలేదని, అందువల్లే ఎన్నికల ఫలితాల్లో వెనకబడిపోతున్నారని మండిపడ్డారు. ఇంకా మీలో మీరే కొట్టుకుంటూ ఉండండి అంటూ వారి తీరుపై అసహనం వ్యక్తంచేశారు.



# సిఎం పదవి కోసం పోటాపోటీ

● పర్వేజ్ వర్మ నుండి మనోజ్ తివారీ వరకూ పలువురు నేతల యత్నాలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బిజెపి గెలుపొందడంతో పలువురు నేతలు ఆ పదవి కోసం పోటీ పడుతున్నారు. సిఎం అభ్యర్థిని నిర్ణయించేది పార్టీ కేంద్ర నాయకత్వమేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ స్పష్టం చేశారు. పలువురు నేతలు కేంద్ర నాయకుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. కేజ్రీవాల్‌ను ఓడించిన ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ వర్మ సిఎం పదవికి ప్రధాన పోటీదారుగా నిలిచారు. కాలుష్యం, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలపై ఆప్ ప్రభుత్వంపై విమర్శలు సంధించి సర్కారుకు కంట్లో నలుసులా పనిచేశారు. ఆయన బంధువు ఆజాద్ సింగ్ ఉత్తర ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పనిచేశారు.

బిజెపి సీనియర్ నేత, మాజీ ఎంపీ రమేష్ బిధూరి సిఎం పదవికి పోటీ పడుతున్నారు. ముఖ్యమంత్రి అతిషితో పోటీ చేసి ఓటమి పాలైనా సిఎం పదవిపై ఆశలు పెట్టుకున్నారు. బిజెపి ఢిల్లీ విభాగం మాజీ అధ్యక్షుడు సతీష్ ఉపాధ్యాయ్ కూడా ముఖ్యమంత్రి పదవిపై కన్నేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ కూడా సీఎం పదవిని ఆశిస్తున్నారు. ఆయన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ పార్టీలో కీలక నేతగా ఉంటున్నారు. ఈశాన్య ఢిల్లీ నుండి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న భోజ్‌పురి సినీ నటుడు మనోజ్ తివారీ సైతం సిఎం పదవిని కోరుతున్నారు.

**కొత్త వారిని తెరపైకి తెస్తారా?**

ముఖ్యమంత్రి పదవి కోసం ఎందరు సీనియర్లు పోటీలో ఉన్నప్పటికీ బిజెపి అధిష్టానం ఆశ్చర్యకరంగా కొత్తవారిని ముందుకు తెచ్చే అవకాశాలు లేకపోలేదు. 2023లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సీనియర్ నేతలను కాదని మోహన్ యాదవ్, భజన్‌లాల్ శర్మ, విష్ణుదేవ్ శాయిని తెర పైకి తెచ్చిన విషయాన్ని రాజకీయ పరిశీలకులు గుర్తు చేశారు. ఢిల్లీలో 1998లో బిజెపి తొలిసారి అధికారంలోకి వచ్చింది. మదన్‌లాల్ ఖురానా, సాహిబ్ సింగ్ వర్మ, సుష్మా స్వరాజ్ ఒకరి తర్వాత ఒకరుగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం 27 ఏళ్లకు మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ గెలుపొందింది.

# ఓటమి కోరల్లో శ్రీలంక

● మాథ్యూస్ అర్ధసెంచరీ
● ఆస్ట్రేలియా 414ఆలౌట్

**గాలే:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో, చివరి టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు ఓటమికోరల్లో నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక జట్టు 8 వికెట్ల నష్టానికి 211 పరుగులే చేయడంలో ఆ జట్టు ఇప్పటివరకు కేవలం 54పరుగుల ఆధిక్యతను మాత్రమే సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 330 పరుగులతో శనివారం మూడోరోజు ఆటను కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 414పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ స్మిత్(131), క్యారీ(156) సెంచరీలతో రాణించగా.. వెబ్‌స్టర్(31) మాత్రమే రెండంకెల స్కోర్ చేశాడు. శ్రీలంక బౌలర్లు ప్రభాత్ జయసూరియకు ఐదు, నిషాన్‌కు మూడు, మెండీస్‌కు రెండు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 257పరుగులే చేయడంలో ఆసీస్ జట్టు 157పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 211పరుగులకే 8వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కుశాల్ మెండీస్(48నాటౌట్), మాథ్యూస్(75) బ్యాటింగ్‌లో రాణించారు. కెప్టెన్ ధనుంజయ(23) ఫర్వాలేదనిపించాడు. ఆస్ట్రేలియా బౌలర్లు కెహ్నెమన్‌కు నాలుగు, లియాన్‌కు మూడు వికెట్లు దక్కాయి.




# సెమీస్‌కు మాయా

## ముంబయి ఓపెన్ టెన్నిస్ టోర్నీ

**ముంబయి:** ముంబయి ఓపెన్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో 15ఏళ్ల యువ క్రీడాకారిణి మాయా రాజేశ్వరన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో మాయా మూడుసెట్ల హోరాహోరీ పోరులో జపాన్‌కు చెందిన యమగుచిని చిత్తుచేసింది. హోరాహోరీ పోరులో మాయా 6-4, 3-6, 6-2తో విజయం సాధించింది. అంతకుముందు జరిగిన మరో క్వార్టర్స్‌లో శ్రీవల్లి 2-6, 2-6తో భారత్‌కే చెందిన టెక్మన్ చేతిలో ఓటమిపాలైంది. మహిళల డబుల్స్‌లో ప్రార్థన-అరియానే జోడీ 2-6, 6-4, (10-2)తో ఈడెన్ శిల్వ-టెక్నావాను ఓడించి సెమీస్‌కు చేరారు.



## డ్యామ్‌లో పడి ఇద్దరు నేపాల్ యువకులు మృతి

ప్రజాశక్తి - వల్లూరు

కడప జిల్లా వల్లూరు మండలంలోని ఆదినిమ్మయపల్లి డ్యామ్‌లో పడి నేపాల్‌కు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు చెన్నూరు మండలం శివరాం దమ్ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్న పది మంది యువకులు ఆదినిమ్మాయపల్లి డ్యామ్ వద్దకు సరదాగా గడపడానికి వచ్చారు. ఆనకట్ట వద్ద ఈత కొడుతున్న ఇద్దరు యువకులు బిరేంద్ర (36) బిర్రీ (36) ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యారు. జాలర్లు నదిలో దిగి వారిని వెలికి తీయడంతో అప్పటికే మృతిచెందారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

## రామతీర్థంలో ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి- నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

రామతీర్థంలో సీతారాముల తిరుకల్యాణ మహోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారి తిరుకల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజాము నుంచే కల్యాణ మహోత్సవ సందడి ప్రారంభమైంది. ముందుగా రామకోనేరు జలంతో ఆలయాన్ని శుద్ధి చేశారు. ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, గొడవర్తి రామనరసింహాచార్యులు, ఖండవిల్లి కిరణ్, పవన్‌కుమార్ తదితరులు స్వామివారికి ప్రాత్ణకాల అర్చన గావించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు శ్రీమద్రామాయణ పారాయణం, వేదపఠనం తదితర కార్యక్రమాలు జరిగాయి. యాగశాలలో గంటన్నర పాటు విశేష హోమాలను జరిపించారు. సాయంత్రం ఐదు గంటలకు విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్టాపన, బలిహరణం, అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో అశ్వా వాహనం, హంస, గరుడ వాహనాల్లో ఊరేగించి అర్చకులు కల్యాణం తంతు పూర్తి చేశారు.

## పోలవరం ప్రాజెక్టు, ఎత్తిపోతల పథకాలు పరిశీలన

- హైదరాబాద్ నుంచి వచ్చిన గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బృందం

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

పోలవరం ప్రాజెక్టును, పరిసర ప్రాంతాల మేజర్ ఎత్తిపోతల పథ కాలను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు బృందం శనివారం పరిశీలించింది. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఎకె ప్రధాన్ నేతృత్వంలో మెంబర్స్ సెక్రటరీ అజగేషన్ బృందం హైదరాబాదు నుంచి రాజమహేంద్రం విమానాశ్రయానికి ప్రత్యేక ఫ్లైటులో చేరుకున్నారు. ఇరిగేషన్ ఇఇ ప్రేమ్‌చంద్, డిఇఇ సత్యదేవ, ఎఇఇ భద్రరావు వారికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తూర్పుగోదావరి జిల్లా తాడిపూడి వద్ద ఉన్న చింతలపూడి మేజర్ ఎత్తిపోతల పథకం, తాడిపూడి మేజర్ ఎత్తిపోతల పథకం, పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. సంబంధిత వివరాలను డిఇఇ వారికి వివరించారు. అనంతరం బృందం పోలవరం ప్రాజెక్టులో గైడ్ బండ్, డయాఫ్రంవాల్ ప్రాంతాలను పరిశీలించారు. ఇఇ సుధాకర్ ఇతర అధికారులు వారికి సంబంధిత వివరాలను తెలిపారు. ఈ బృందం ఆదివారం పోలవరం ప్రాజెక్టులో పవర్ హౌస్, జంటగుహలు, ఇతర ప్రాంతాలను పరిశీలించనున్నట్లు డిఇఇ తెలిపారు.

## జాతీయ రగ్బీ పోటీలకు రిత్వికశ్రీ

ప్రజాశక్తి-తాడిమర్రి (సత్యసాయి జిల్లా)



సత్యసాయి జిల్లా తాడిపత్రి మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కడపల శంకరయ్య కూతురు కడపల రిత్వికశ్రీ జాతీయ స్థాయి రబ్బీ పోటీలకు ఎంపికైంది. ఈమె ఈ నెల 11, 12, 13 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే నేషనల్ అండర్-15 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రగ్బీ జట్టుకు ప్రాతినిధ్యం వహించ నుంది. రిత్వికశ్రీ ప్రస్తుతం అనంతపురంలోని సెయింట్ విన్సెంట్ డి పాల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రగ్బీ క్రీడలో మంచి ప్రతిభ ఉన్నా ఆర్థిక సమస్యల వల్ల ముందుకెళ్లలేని రిత్వికశ్రీకి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రిత్వికశ్రీ అతి చిన్న వయసులోనే రగ్బీ క్రీడలో ప్రతిభ చూపుతుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## 26 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధిలోని రేణిగుంట - కడప హైవే సమీపంలోని రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో భూమిలో డంపు చేసిన ఎర్రచందనం దుంగ లను రహస్యంగా తవ్వి తీసి మరో ప్రాంతానికి తరలి స్తుండ గా ముగ్గురు నిందితులను అరెస్టుచేసి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసు కున్నామని తిరుపతి రేంజి అటవీ క్షేత్రాధికారి బి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ ఆదేశాలతో శుక్రవారం రాత్రి అందిన రహస్య సమాచారం మేరకు అప్రమత్తమై సిబ్బందితో కలిసి కరకంబాడి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. రాత్రి పది గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలలో అక్కడికి వచ్చిన నలుగురు వ్యక్తులు దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలను బయటకు తీస్తుండగా వారిని చుట్టుముట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో రఘు అనే వ్యక్తి పారిపోయాడని అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన ఎర్రచందనం దుంగల విలువ 25 లక్షల రూపాయలు ఉంటుందని అటవీశాఖ అధికారు లు పేర్కొన్నారు.

# 'బెల్ట్'పై కొరవడిన నిఘా..!

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- దుకాణాల్లో అదనపు ధరలు
- కన్నెత్తి చూడని అధికారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వ పాలనలో మద్యం ఏరులై పారుతుంది. రోడ్లపైనే గ్లాసులు గలగలలాడుతున్నాయి. వందల సంఖ్యలో వెలసిన బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలను విపరీతంగా పెంచారు. దాదాపుగా అన్ని రకరకాల బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. కాకినాడ జిల్లాలో 155 ప్రయివేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పు గోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకి రూ.13 నుంచి 15 కోట్లు వరకూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక సందర్భాలు, పండుగల రోజుల్లో రోజూవారీ అమ్మకాలు రూ. 25 నుంచి రూ.30 కోట్ల దాటుతోంది. తమ ప్రభుత్వంలో ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి అమ్మకాలు ఇచ్చినప్పటికీ బెల్ట్ షాపులపై కొరడా గులిపిస్తామంటూ చంద్రబాబు ప్రకటనలు గుప్పించారు.

### భారీగా బెల్టులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ప్రతీ 10 బడ్డీ దుకాణాల్లో 8 షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. క్వార్టర్ బాటిల్ పై రూ.10 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రయివేటు మద్యం దుకాణాలతో పాటు అనధికారికంగా బెల్టు షాపుల ద్వారా కాకినాడ జిల్లాలో అమ్మకాలను



కాకినాడ సిటీ పరిధిలోని మద్యం అమ్ముతున్న ఒక బెల్ట్ షాపు

పరిశీలిస్తే గత ఏడాది డిసెంబర్ 31 రోజున రూ.12.50 కోట్లు మద్యం అమ్మకాలు జరగగా ఈనెలలో సంక్రాంతి మూడు రోజులపాటు దాదాపు రూ.30 కోట్లు పైనే మద్యం వ్యాపారం జరిగింది. మొత్తంగా ఈ జనవరిలో రూ.100 కోట్లు పైనే ఇక్కడ మద్యం అమ్మకాలు జరిగాయి. గతంలో బెల్ట్ షాపులు లేని సమయంలో ఈ వ్యాపారం సుమారు రూ.70 కోట్లు మాత్రమే ఉండగా ఈ సారి భారీగా బెల్ట్ షాపులు పెరగడంతో సుమారు రూ. 30 కోట్లు అదనంగా వ్యాపారం జరిగిందని అంచనా. దుకాణాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విక్రయాలు జరుగుతుండగా బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుంది. ఏపీ బ్రాండ్లే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన కొన్ని బ్రాండ్లు సైతం ఇక్కడ విక్రయిస్తుండడం గమనార్హం.త్రాగునీరు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో సైతం మద్యం ఏరులై పారుతుంది. గుడి, బడి అనే తేడా లేకుండా సమీప ప్రాంతాల్లో సైతం మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

### నివాస గృహాల మధ్యనే...

బెల్ట్ షాపుల ద్వారా ఇళ్ల మధ్యే బహిరంగంగానే పగలు, రాత్రి అనే తేడా లేకుండా అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసంగా అటువైపు చూడకపోవడం శోచనీయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు అతి చేరువలో బెల్ట్ షాపుల్లో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తుండగా అటువైపు వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల మందు బాబుల మధ్య వివాదాలు జరుగుతుండగా ఘర్షణ వాతావ రణం నెలకొనడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవు తున్నారు. కూటమి ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులై పారిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో బెల్టుషాపులు బహిరంగంగానే అమ్మకాలు జరుపుతున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టనట్లే వ్యవహరిస్తుండడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. మామూళ్ల మత్తులో జోగుతూ కావాలనే పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని వారిపై విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొన్ని చోట్ల మద్యం దుకాణాల యజమానులు నాసిరకం మద్యం అమ్ముతూ సామాన్యుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు సిండికేట్ గా మారి ధరలను విపరీతంగా పెంచి పేదల జేబులను కొల్లగొడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. క్వార్టర్‌పై రూ.10 నుంచి 30 కి అదనంగా అమ్మ కాలు జరుపుతున్నారు. ప్రభుత్వమే ఆదాయమే పరమావధిగా భావిస్తూ ఎక్కడికక్కడ బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకప్పుడు బెల్టు దుకాణాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకున్న అధికారులు ఇప్పుడు గ్రామ గ్రామానా.. ఊరు వాడ అనే తేడా లేకుండా వీధి వీధినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నా కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

## ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- రాష్ట్రపతికి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల వ్యక్తిగత దరఖాస్తులు



దరఖాస్తులను చూపుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన రాష్ట్రపతికి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మిని వర్కర్లు వ్యక్తిగత దరఖాస్తులు పంపారు. కెఎల్ పురంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ ఆ దరఖాస్తులను శనివారం చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఐసిడిఎస్ ఏర్పాటు చేసి యాభై ఏళ్లు పూర్తయిందని, ఈ నేపథ్యంలో ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించాలని, దశాబ్దాలుగా సేవలందిస్తోన్న వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలుతోపాటు, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని విజ్ఞప్తి చేస్తూ వ్యక్తిగత దరఖాస్తులను పంపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, నాయకులు ఎం.కృష్ణమ్మ, పి.ప్రభ, వరలక్ష్మి, పి.జ్యోతి, సిహెచ్ రూప, ఎం.రమణమ్మ, శ్యామల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# 14 నుంచి 'అనంత బాలోత్సవం'

- లలిత కళాపరిషత్‌లో మూడు రోజులపాటు పిల్లల పండుగ
- పోస్టర్ విడుదల చేసిన బాలోత్సవ కమిటీ



ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 14, 15, 16వ తేదీల్లో అనంతపురం నగరంలో 'అనంత బాలోత్సవం -5' నిర్వహించనున్నట్లు అనంత బాలోత్సవ కమిటీ వెల్లడించింది. ఈ మేరకు ఈ మూడు రోజుల కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆహ్వాన కమిటీ విడుదల చేసింది. శనివారం ఉదయం స్థానిక క్రిసెంట్ స్కూల్‌లో కమిటీ అధ్యక్షులు ఎస్.షమీమ్ షఫివుల్లా ఆధ్యర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలోత్సవం నిర్వహణపై మీడియాతో మాట్లాడారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏటా అనంతపురం నగరంలో అనంత బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఐదవ సంవత్సరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎప్పటిలాగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో కాకుండా ఈసారి లలిత కళాపరిషత్‌లో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ విషయాన్ని పిల్లలు, పాఠశాల యజమాన్యాలు గుర్తించాలని సూచించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ.. పిల్లల్లో చదువుల ఒత్తిడిని తగ్గించి, వారిలోనున్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా పిల్లల్లో దేశభక్తి, సమైక్యతను చాటే విధంగా ఉండాలని కమిటీ భావిస్తోందన్నారు. మరో సభ్యురాలు వి.సావిత్రి మాట్లాడుతూ... మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వేలాది మంది విద్యార్థులు భాగస్వామ్యులవుతారని చెప్పారు. మొత్తం సాంస్కృతిక పోటీలతోపాటు, అకడమిక్ విభాగాల్లో వేరువేరు తరహాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను పిల్లల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో అనేక మంది సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ పిల్లల పండుగలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎజి.రాజమోహన్, చంద్రకళ, రామాంజినమ్మ, ఓతూరు పరమేష్, సురేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆలోచనలకు పదును పెట్టాలి

- నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడితే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు సూచించారు. నిట్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉల్కన్ జీ కల్చరల్ పేస్ట్ 2కె25 కార్యక్రమం శనివారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమణారావు మాట్లాడుతూ దేశాన్ని నడిపించే సాంకేతికత రథసారధులు విద్యార్థులేనని తెలిపారు. వినూత్న ఆలోచనలు అంకురించడానికి విద్యాలయాలు చక్కటి వేదికలని చెప్పారు. చదువుతో పాటు ఆటలైనా, పాటలైనా, కళలైనా మనసుపెట్టి నిరంతరం సాధన చేస్తే లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని సూచించారు. విజ్ఞానం, వినోదం కూడా ముఖ్యమేనని తెలిపారు. విద్యార్థులు అవకాశాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. నూతన సాంకేతికతలపై పట్టు సాధించడంతోపాటు దేశం గర్వించే పరిశోధనలను చేపట్టాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి, సామర్థ్యాలను పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉండాలని వివరించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో సభా ప్రాంగణం పరవశించిపోయింది. ఉదయం విద్యార్థులు నిర్వహించిన ఉల్కన్ జీ కార్యక్రమాలను తిలకించేందుకు గూడెం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ కె.హిమబిందు, డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ తలారి రేష్మా, ఆచార్యులు రాజేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

# వేసవి రాకముందే గొంతెండుతున్న గ్రామాలు

- కర్నూలు జిల్లా దేవనకొండలో నీటి ఎద్దడి

ప్రజాశక్తి - దేవనకొండ (కర్నూలు)

వేసవి ప్రారంభం కాకముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే తాగునీటి పైపులైను మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఆ నీరు రాక తీవ్ర అవస్థలు పడుతున్నామని మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి కోసం అలమటిస్తున్నాయి. వెంకటాపురం పంచాయతీ మజరా గ్రామం బుర్రకుంటలో పరిస్థితి దారుణంగా మారింది. ఈ గ్రామంలో రెండు వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామస్తులు దాహార్తిని తీర్చుకునేవారు. వేసవి కాలం ప్రారంభం కాకముందే మంచినీటి పథకం భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి ఎద్దడి నెలకొంది. గత ఏడేళ్ల క్రితం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి డోన్ పట్టణానికి వెళ్లే తాగునీటి పైపులైను ద్వారా గ్రామానికి లింకు పైపులైన్ వేశారు. రెండేళ్లుగా పైపులైన్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో లీకేజీలు ఏర్పడి మంచినీరు సరఫరా కావడం లేదు. గతేడాది పంచాయతీ నిధులతో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి గ్రామస్తుల దాహార్తిని తీర్చారు. గ్రామంలో నెలకొన్న మంచినీటి ఎద్దడి విషయమై సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు విన్నవించినట్లు గ్రామస్తులు తెలిపారు. నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామస్తులకు మంచినీటి అవస్థలు తప్పడం లేదు. అడుగంటిన భూగర్భ జలాలతో రక్షిత మంచి నీటి పథకం అరకొరగా వస్తుండడంతో నీటి గుమ్మి వద్ద రాత్రి, పగలు గ్రామస్తులు నీటి కోసం పడిగాపులు కాస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్క రించి, గ్రామస్తుల దాహార్తిని తీర్చాలని, గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి వేసిన పైపులైనుకు మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### తాగునీటి కోసం పడిగాపులు

మంచినీటి పథక బోరు సరిగా రాకపోవడంతో దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీటి గుమ్మి వద్ద పడి గాపులు కాయాల్సి వస్తోంది. దాహార్తిని తీర్చు కోవాలంటే తాగునీటి కోసం గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సి వస్తోంది. నీటి పథక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. నీటి కోసం తిప్పలు తప్పడం లేదు.

- తలారి లక్ష్మీదేవి

### రూ.5 లక్షలతో ప్రతిపాదనలు పంపాం

గ్రామంలోని రక్షిత మంచినీటి పథక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగునీరు సక్రమంగా రావడం లేదు. నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.5 లక్షలతో సంబంధిత ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరయిన వెంటనే పనులు ప్రారంభించి నీటి ఎద్దడి తీరుస్తాం.

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీమోహన్

## పుస్తక ప్రదర్శనపై దాడి

- మతోన్మాదులను అరెస్టు చేయాలి
- సిపిఎం, సిపిఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్, తిరుపతి సిటీ

తిరుపతి నగరంలోని ఇస్కాన్ పక్కనే ఉన్న టిటిడి గ్రౌండ్‌లో భారతీయ విద్యా భవన్ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనపై మతోన్మాద గూండాలు శనివారం 8 గంటల ప్రాంతంలో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని ఆపాలని కోరిన సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుపై దురుసుగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలంతో దూషించారు. విశాలాంధ్ర పుస్తకాలయం వద్దకు వచ్చిన మతోన్మాద గూండాలు కిరణ్‌కుమార్, తుమ్మ ఓంకార్‌లు 'పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాలు తొలగించండి..' అంటూ హుకుం జారీ చేశారు. ప్రశాంతంగా ప్రజలు పుస్తకాలయంలో సంతోషంగా పుస్తకాలు కొనుగోలు చేస్తున్న సందర్భంలో మతోన్మాద గూండాలు గుంపుగా చేరి పుస్తకాలపై దాడికి దిగారు. స్థానికులు, కవులు, రచయితలు, మేధావులపై దురుసుగా ప్రవర్తించి దాడికి పూనుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళిలు మాట్లాడుతూ.. తిరుపతి నగరంలో ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేస్తూ హిందూమత సామరస్యానికి కళంకం తెచ్చారని, ఇలాంటి వారికి కొందరు భయపడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రచన స్వేచ్ఛను, భావాల స్వేచ్ఛను, స్వాతంత్ర్యం నాటి భావాలను తుద ముట్టించడానికి ఇలాంటి రౌడీ మూకలు పూనుకుంటున్నాయని, దీనికి వ్యతిరేకంగా తిరుపతి ప్రశాంతతను కాపాడేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని వామపక్షాల తరపున విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఇదే పద్ధతి కొనసాగితే ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పోలీసులు వెంటనే వారిని అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకుని వీరి ఆగడాలు అరికట్టాలని కోరారు.

## అంగన్వాడీ సమస్యలపై17న ఆందోళనలు

### యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలకు టిడిపి కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పేర్కొన్నారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో సుబ్బారావమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సమస్యల పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఐసిడిఎస్‌కు నామమాత్రపు నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సమస్యలను తెలియజేసేలా దేశవ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నుంచి రాష్ట్రపతికి వినతులు పంపుతున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలన్నారు. గ్రాట్యుటీ అమలు చేసి, కార్యకర్తలను మూడవ తరగతి, హెల్పర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. హెల్పర్లకు వర్కర్లుగా ఉద్యోగోన్నతి ఇవ్వాలని 2011లో ప్రభుత్వం జీవో ఇచ్చినా దానిని అమలు చేయలేదన్నారు. సత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీలు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు రోజురోజుకూ అధికం అవుతున్నాయన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి వేధింపులను నియంత్రించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 17న చేపట్టిన ఆందోళనల్లో అంగన్‌వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి,ఉషారాణి, సుశీల, వాసంతి, మహదేవమ్మ, ధర్మవరం సరస్వతి, హిందూపురం అరుణ, శోభారాణి పాల్గొన్నారు.

## విహారంలో విషాదం

- కొండవాగులో పడి బిటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి (అల్లూరి జిల్లా)

స్నేహితులందరూ ఏజెన్సీ ప్రాంతానికి విహారానికి రాగా, విషాదం చోటుచేసుకుంది. కొండవాగులో పడి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా అమరావతి ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగులపాటి నాగమల్లేశ్వరరావు (19), మరో ఏడుగురు స్నేహితులు మారేడుమిల్లి మండలంలోని గుడిస పర్యాటక ప్రాంతం సందర్శనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆకు మామిడికోట సమీపంలోని సంఘవ వాగు సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లారు. వారిలో నాగమల్లేశ్వరరావు ప్రమాదవశాత్తు కాలుజారి వాగులో మునిగిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు స్థానికులకు తెలియజేయగా, ఆకు మామిడి కోట గ్రామస్తులు, వేజువాడ గ్రామానికి చెందిన మరికొందరు గిరిజనులు కలసి వాగులో గాలింపు చర్యలు చేపట్టగా నాగమల్లేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. దీనిపై సమాచారం అందుకున్న మారేడుమిల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించి, తోటి స్నేహితుల వద్ద సమాచారం తెలుసుకున్నారు. దీనిపై మారేడుమిల్లి ఎస్ఐ ఎస్కే సాదిక్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## ఏజెన్సీ పసుపునకు గిట్టుబాటు ధర రాక విలవిల

- ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

సీతంపేట ఏజెన్సీ పసుపునకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. ఇది గిరిజనులకు కొంతమేర ఆర్థిక చేయూతనిస్తుంది. ఏజెన్సీలో పసుపు ప్రకృతి సిద్ధంగా తయారవుతుంది. అందుకే దీనికి అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. పసుపు రంగు, రుచి, ఛాయా ఉంటుంది. ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి సహజ సిద్ధంతోనే పండిస్తారు. అలాంటి పసుపునకు మార్కెట్ గిట్టుబాటు ధర లభించకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీ పసుపు కొనుగోలు చేయడానికి మైదానం నుంచి వ్యాపారులు వస్తున్నారు. ఐటిడిఎ పరిధిలో 3,786 మంది రైతులు 6,886 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. కొండపోడు భూములు ఏప్రిల్, మే నెలలో పసువు దుంపలు నాటుతారు. రెండేళ్ల తర్వాత పంట దిగుబడి వస్తుంది. దిగుబడి వచ్చిన పసుపు దుంపలను తవ్వి కడిగి సున్నగా కాడలు కట్ చేస్తారు. పెద్ద అండాలో ఉడకబెట్టి ఆ తర్వాత బాగా ఎండ బెట్టి రోడ్డుపై రంగ దిస్తారు. అనంతరం విక్రయిస్తారు. గతంలో ప్రోత్సాహకం కింద పసుపు విత్తనాలు, పాలిష్ యంత్రాలు, పెట్టుబడి ఐటిడిఎ ఇచ్చేది. ఇప్పుడు ఇవ్వడం లేదు. తయారు చేసిన పసుపును ఎత్తైన కొండలపై నుంచి మోసుకొని సంతకు తెచ్చి కావిడిల చొప్పున గిరిజనులు విక్రయిస్తారు. మైదాన ప్రాంత వ్యాపారులు, దళారులు కారుచౌకగా కావిడి పసుపు వెయ్యి రూపాయల్లోపే కొనుగోలు చేస్తున్నారు. ఒక కావిడి పసుపు 25 కేజీల నుండి 30 వరకు ఉంటుంది. విడివికెల ద్వారా తూతూమంత్రంగా కొనుగోలు చేస్తున్నారని, గిరిజన సహకార సంస్థ అయితే అస్సలు కొనుగోలు చేయడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వమే పసుపు కొనుగోలు చేసి మార్కెట్ ధర కల్పించాలని కోరుతున్నారు.

### సహజసిద్ధంగా తయారు చేస్తాం

పసుపును రసాయనిక ఎరువులు వినియోగించకుండా ప్రకృతి సహజసిద్ధంగా మేమే తయారు చేస్తాం. అందువల్లే పసుపుకు మంచి వాసన, ఛాయా వస్తుంది.

- ఎం.రైకన్న, దుంబంగివలస

### జిసిసి కొనుగోలు చేయాలి

కష్టపడి పండించిన పసుపుకు మార్కెట్ ధర లభించకపోవడదతో మాకు కష్టమే మిగులుతోంది. మాకు ఆర్థికంగా కొంత డబ్బులు వచ్చేది పసుపు వల్లే. ఈ పసుపును ప్రభుత్వ సంస్థ అయిన జిసిసి కొనుగోలు చేయాలి.

-మండంగి రియ్యన్న, గిరిజనుడు, దుంబంగివలస

### ప్రతిపాదనను పంపించాం

పసుపు రైతులకు విత్తనాలు ఉడకబెట్టిన అండాలు, పెద్ద పెద్ద ట్రబ్బులు, సోలార్ డ్రైవర్స్ పాలిష్ యంత్రాలు కోసం ప్రతిపాదనలు తయారు చేశారు. ఇతర పనిముట్లు అందించేందుకు నివేదిక తయారు చేసి ప్రతిపాదనతు ఇప్పటికే పంపించాం.

ఎస్.వెంకట గణేష్ ,ఐటిడిఎ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి, సీతంపేట

## నీట్ పరీక్షకు ముందుగానే మార్గదర్శకాలు

- ఎన్ఎంసికి వికలాంగ హక్కుల కార్యకర్తల లేఖ

**న్యూఢిల్లీ :** ఈ ఏడాదికి నీట్ బ్రోచర్ను విడుదల చేయడానికి ముందుగానే వైకల్యంతో బాధపడే విద్యార్థులకు మద్దతుగా తీసుకునే చర్యలకు వెసులుబాటు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయాలని వికలాంగ హక్కుల కార్యకర్తలు కోరారు. ఈ మేరకు వారు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి)కి ఒక లేఖ రాశారు. ఈ చర్యల అమల్లో అనేక లోపాలు వున్నాయని వారు పేర్కొన్నారు. తగిన కమిటీలు, వసతి ఏర్పాటు వంటి చర్యలతోపాటు ఇతర ముఖ్యమైన చర్యలను అమల్లో పెట్టాల్సి వుందన్నారు. డాక్టర్స్ విత్ డిజెబిలిటీస్ : ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్ గ్రూపు ఈ లేఖ రాసింది. వైకల్యంతో బాధపడే వారు మెడికల్ కోర్సుల్లో చేరడానికి తాజా మార్గదర్శకాలు జారీ చేయాలని ఎన్ఎంసిని కోరారు. ఇందుకోసం ఆయా కమిటీల్లో వికలాంగ న్యాయంపై కృషి చేసిన వారిని సభ్యులుగా నియమించాలని కోరారు.

## రెండో భర్తను భరణం కోరొచ్చు

- తొలి భర్త నుంచి విడాకులు తీసుకోకున్నా అర్హురాలేనన్న సుప్రీం

**న్యూఢిల్లీ :** ఒక మహిళ తొలి వివాహం చట్టబద్ధంగా కొనసాగుతున్నప్పటికీ రెండో భర్త నుండి ఆమె భరణం కోరడానికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్పిసి)లో 125వ సెక్షన్ కింద అర్హురాలని సుప్రీం కోర్టు పేర్కొంది. భరణం ఇవ్వాలనే సామాజిక సంక్షేమ నిబంధనల లక్ష్యానికి విస్తృత భాష్యం ఇవ్వాలి, అంతేకానీ కఠినమైన రీతిలో చట్టబద్ధమైన భాష్యమనేది దాని మానవతా ప్రయోజనం వీగిపోవడానికి అనుమతించరాదని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన బెంచ్ పేర్కొంది. తన మాజీ భార్యకు భరణాన్ని చెల్లించాలని రెండో భర్తకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సిఆర్పిసిలోని 125వ సెక్షన్ కింద భరణానికి సంబంధించి సామాజిక న్యాయం లక్ష్యాలు ఈ కేసులో కొన్ని వాస్తవాలకు, పరిస్థితులకు విరుద్ధంగా వున్నాయని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది. అంతమాత్రాన అప్పీలుదారునికి భరణం ఇవ్వకూడదని మేం చెప్పలేం. ఎందుకంటే సామాజిక సంక్షేమ నిబంధనలను ఎప్పుడూ విస్తృతంగా, లబ్ధిదారుని దృష్టిలో వుంచుకుని చూడాలని చట్టం చెబుతోందని బెంచ్ పేర్కొంది. 2005లో తన మొదటి భర్త నుండి అవగాహనా పత్రంపై సంతకాలు చేసుకుని, విడిపోయిన ఒక మహిళ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించి పై రూలింగ్ ఇచ్చింది. మొదటి వివాహం విషయంలో ఆమె చట్టపరంగా విడాకులు తీసుకోలేదు.

## మెహబూబా ముఫ్తీ గృహ నిర్బంధం



**కాశ్మీర్ :** తనను, తన తల్లి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) అధినేత్రి మెహబూబా ముఫ్తీలను శనివారం గృహ నిర్బంధంలో ఉంచినట్లు పిడిపి నాయకురాలు ఇల్టిజా ముఫ్తీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో వీడియోను పోస్టు చేశారు. బుధవారం సైన్యం కాల్పుల్లో మరణించిన ట్రక్ డ్రైవర్ కుటుంబాన్ని పరామర్శించడానికి మెహబూబా ముఫ్తీ సోపోర్‌కు వెళ్ళాలని అనుకున్నారు. "నా తల్లిని, నన్ను గృహ నిర్బంధంలో ఉంచారు. సైన్యం వసీం మీర్‌ను కాల్చి చంపిన సోపోర్ ప్రాంతానికి ఆమె వెళ్లాల్సి ఉన్నందున మా ఇంటి గేట్లు మూసివేశారు" అని ఇల్టిజా ముఫ్తీ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. మఖాన్ దిన్ కుటుంబాన్ని కలవడానికి నేను కథువాను సందర్శించాలనుకున్నాను. నన్ను బయటకు వెళ్లడానికి కూడా అనుమతించడం లేదు. ఎన్నికల తర్వాత కూడా కాశ్మీర్‌లో ఏమీ మారలేదు. ఇప్పుడు బాధితుల కుటుంబాలను ఓదార్చడం కూడా నేరంగా పరిగణించబడుతోంది" అని ఆమె పేర్కొన్నారు.

## వాల్తేరు డివిజన్ మొత్తాన్ని సౌత్‌కోస్ట్‌లోనే ఉంచాలి

(మొదటిపేజీ తరువాయి)

మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ చర్య రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి, ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని వివరించారు. భువనేశ్వర్, సికింద్రాబాద్ కేంద్రాల్లో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు ఉన్నాయని, విశాఖలో లేకపోవడంతో ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. స్థానికంగా ఆర్ఆర్‌బి సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పర్యాటక రంగంలో కీలకమైన అరకును రాయగడ డివిజన్‌లో కలుపుతుంటే రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలు ఎందుకు నిలువరించడంలేదని, కెకె లైన్‌పై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజల అభీష్టానికి అనుగుణంగా చర్యలు చేపట్టకపోతే ప్రజాందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు, నాయకులు ఎం.సుబ్బారావు, ఉరుకూటి రాజు, ఎల్‌జె.నాయుడు, యుఎస్ఎన్.రాజు, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే పరమావధి

- మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద పీట
- ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పలు చర్యలు
- కేరళ బడ్జెట్ తీరు తెన్నులు



బడ్జెట్ ప్రవేశపెడుతున్న కేరళ ఆర్థికమంత్రి వేణుగోపాల్

**తిరువనంతపురం :** ప్రగతిశీల అభివృద్ధి, సామాజిక న్యాయం, పర్యావరణ బాధ్యతలను మిళితం చేస్తూ రాష్ట్ర భవిష్యత్ కోసం సాహసోపేతమైన, సమగ్ర దార్శనికతను కేరళ బడ్జెట్ ఆవిష్కరించింది. 2025–26 సంవత్సరానికి ఆర్థిక మంత్రి కెఎన్ వేణుగోపాల్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. నిరంతరంగా ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజల సంక్షేమమే పరమావధిగా అనుసరించాల్సిన విధానాలు, సుస్థిర అభివృద్ధి ప్రాముఖ్యతను ఈ బడ్జెట్ నొక్కి చెప్పింది. పట్టణీకరణ, వాతావరణ మార్పులు, జనాభా మార్పు వంటి పలు సంక్లిష్టతలతో రాష్ట్రం సతమతమవుతున్న నేపథ్యంలో స్పష్టంగా ముందుకెళ్లడానికి అవసరమైన చర్యలను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఏ ఒక్కరూ వెనుకబడి పోవడానికి అనుమతించకుండా సంక్షేమ ఫలాలు అందరికీ పంచడానికి హామీ కల్పిస్తోంది.

**కేరళ ఆర్థిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడం**

రెవిన్యూ లోటును గణనీయంగా ప్రభుత్వం తగ్గించుకోగలిగింది. ద్రవ్య లోటు కూడా 4.04శాతం నుండి 2.9శాతానికి తగ్గింది. ఆర్థిక రంగంలో సాధించిన ఈ విజయాలు ప్రభుత్వం వివేచనతో, నిజాయితీగా చేపట్టిన ఆర్థిక నిర్వహణకు ఒక స్పష్టమైన నిదర్శనంగా వున్నాయి. పైగా రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో సొంత పన్నుల ఆదాయాన్ని 70శాతం మేర విజయవంతంగా పెంచుకోగలిగింది. 2024–25లో రూ.81వేల కోట్లకు చేరింది.

ఆర్థిక వ్యవస్థను మరింత సంఘటితం చేయడానికి గానూ అదనపు వనరులను సమీకరించుకునేందుకు ఉద్దేశించి పలు చర్యలను ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు. కోర్టు ఫీజులు సవరించనున్నారు. దీనివల్ల రూ.150 కోట్లు అదనంగా సమకూరతాయని భావిస్తున్నారు. భూపన్ను సర్దుబాట్ల వల్ల మరో వంద కోట్లు వస్తాయని ఆశిస్తున్నారు. ఈ చర్యలన్నీ రెవిన్యూ పునాదిని మరింత విస్తరించుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన క్రియాశీల వైఖరిని నొక్కి చెబుతున్నాయి.

మౌలిక వసతుల అభివృద్ధి : కేరళ భవిష్యత్‌కు పునాది

ఈ ఏడాది బడ్జెట్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. కేరళ రవాణాను మెరుగుపరడచానికి, పట్టణాభివృద్ధి, డిజిటల్ అనుసంధాన రంగాలకు గణనీయంగా కేటాయింపులు జరిపారు. కేరళ రవాణా నెట్‌వర్క్‌ను విస్తరిస్తూనే వుంటామని హామీ కల్పిస్తూ రహదారులు, వంతెనల ప్రాజెక్టులకు మొత్తంగా రూ.3,061 కోట్లు కేటాయించారు. పట్టణాభివృద్ధికీ గణనీయంగా ప్రాధాన్యత లభించింది. వ్యర్థాల నిర్వహణకు, మురికి నీటి పారుదలకు, పట్టణీకరణ ప్రాజెక్టులకు రూ.1986కోట్లు కేటాయించారు.

**ప్రజా సంక్షేమమే ప్రధానం**

సామాజిక సంక్షేమం పట్ల అచంచలమైన నిబద్ధత కేరళ అభివృద్ధి ఎజెండాకు కీలకం. వృద్ధులకు, వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పిస్తూ గత 42 మాసాల్లో రూ.33,210కోట్లు మొత్తాన్ని సామాజిక భద్రతా పెన్షన్లుగా అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్‌లో వున్న డిఎ ఎరియర్లను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. గృహ నిర్మాణ, ఆరోగ్య సంరక్షణ రంగాలకు ఈ బడ్జెట్‌లో మంచి ప్రాధాన్యత లభించింది.

ఆర్థిక ప్రగతి కేంద్రంగా కేరళను తీర్చిదిద్దడానికి ఈ బడ్జెట్‌లో పలు చర్యలకు పునాది పడింది. పారిశ్రామిక రంగంలో ఆవిష్కరణలకు, సాంకేతిక రంగ అభివృద్ధికి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, స్టార్టప్‌లకు గణనీయంగా తోడ్పాటు లభించింది. పర్యావరణ సుస్థిరతను సాధించేందుకు దృష్టి పెట్టారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడింది. కీలకమైన రంగంగా భావిస్తూ వ్యవసాయానికి ఈ బడ్జెట్‌లో రూ.727 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధికి గణనీయంగా రూ.7,098 కోట్లు కేటాయించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రధానంగా కేటాయింపులు వెళ్లాయి.

సమాజంలో నిర్లక్ష్యానికి గురయ్యే, అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. ఎస్‌సి, ఎస్‌టి, ఇతర వెనుకబాటు వర్గాల వారి ఆరోగ్యం, విద్య, జీవనోపాధులే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారు.

ఎంత ప్రగతిశీల దృష్టితో ముందుకు సాగుతున్నా కేంద్ర కేటాయింపులు, రుణ పరిమితులను కుదించడం వల్ల ఆర్థికంగా సవాళ్లను ఎదుర్కొంటూనే వుంది. ఈ ఇబ్బందుల పరిష్కారానికి, తన అభివృద్ధి ఎజెండాను అమలు చేయడానికి అవసరమైన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. అందరినీ కలుపుకుని వెళుతూ, సుస్థిరతను, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ, ప్రజలే ప్రధానమనే దృక్పథాన్ని కేరళ బడ్జెట్ ప్రతిబింబిస్తోంది.

# లంకేష్, కల్బుర్గీ హత్యకేసులో ప్రధాన నిందితులకు సన్మానం

**బెంగళూరు :** పాత్రికేయురాలు గౌరీ లంకేష్, హేతువాది ఎంఎం కల్బుర్గీ హత్య కేసులో ప్రధాన నిందితులైన అమిత్ బడ్డీ, గణేష్ మిస్కిన్‌లను హిందూత్వ శక్తులు మరోసారి సత్కరించాయి. ఈ కార్యక్రమానికి నిందితుల స్వస్థలమైన కర్ణాటకలోని హుబ్బళ్లి వేదికైంది. బడ్డీ, మస్కిన్‌లను పూలదండలు, శాలువాలతో సన్మానించారని, బాణసంచా కాలుస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారని కన్నడ దినపత్రిక 'విజయ కర్ణాటక' తెలిపింది. వారేదో ఘనకార్యం చేసి వచ్చారన్నట్లు గుమ్మడికాయతో దిష్టి కూడా తీశారు.

హత్య కేసులో నిందితులిద్దరూ ప్రస్తుతం విచారణను ఎదుర్కొంటున్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం వారు ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. హెబ్బళ్లిలోని పలుచోట్ల నిందితులను 'హిందూ పులులు' అని కీర్తిస్తూ బ్యానర్లు కట్టారు. తుల్జా భవాని దేవాలయం సమీపంలో హిందూత్వ వాదులు కట్టిన బ్యానర్‌ను ఆలయ అధికారులు తొలగించారు. గౌరీ లంకేష్ హత్య కేసులో ఇతర నిందితులైన పరశురామ్ వాఘ్మోర్, మనోహర్ యాదవ్ గత సంవత్సరం అక్టోబరులో జైలు నుండి బెయిల్‌పై విడుదలైనప్పుడు వారి స్వస్థలమైన విజయపురిలో సత్కరించి, ప్రదర్శన నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని హిందూత్వ సంస్థ శ్రీరామ సేన నిర్వహించింది. గౌరీ లంకేష్ హత్య కేసులో మరో నిందితుడు శ్రీకాంత్ పంగార్కర్ గత ఏడాది అక్టోబర్ 19న మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరాడు. మహారాష్ట్ర ఎన్నికలకు ముందు జరిగిన ఈ పరిణామంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో, ఆ చేరికను షిండే రద్దు చేశారు.

# యుఎస్ఎయిడ్‌పై ట్రంప్ ఆదేశాలకు బ్రేక్ !

- తాత్కాలికంగా అమలు నిలిపివేతకు జడ్జి ఉత్తర్వులు




**వాషింగ్టన్ :** అంతర్జాతీయ అభివృద్ధికి సాయమందించే అమెరికా సంస్థ (యుఎస్ఎయిడ్)పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన ఆదేశాలకు బ్రేక్ పడింది. ఈ సంస్థకు చెందిన వేలాదిమంది ఉద్యోగులు సెలవుపై వెళ్లాలని, విదేశాల్లో దీనికోసం పనిచేసే వారు 30రోజుల్లో వెనక్కి రావాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల అమలును తాత్కాలికంగా నిలుపుచేస్తూ శుక్రవారం ఫెడరల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు.

యుఎస్ ఎయిడ్ సంస్థ ఉద్యోగులు, విదేశాల్లో పనిచేసే అభివృద్ధి కార్యకర్తల విషయంలో రెండు ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు చేసిన వాదనలను యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి కార్ల్ నికొలస్ విన్నారు. ఆ నిర్ణయాల అమలు వల్ల తలెత్తే ముప్పు, ఇబ్బందులను సంఘాలు వివరించాయి. ఆరు దశాబ్దాలుగా పనిచేస్తున్న ఈ సహాయక సంస్థను అకస్మాత్తుగా మూసివేయడానికి ట్రంప్‌కు అధికారం లేదని, కాంగ్రెస్ అనుమతి వుండాల్సిందేనని అమెరికన్ ఫారిన్ సర్వీస్ అసోసియేషన్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ వాదించాయి. డెమొక్రటిక్ సభ్యులు కూడా ఇదే వాదన వినిపించారు. ఉద్యోగులు సెలవుపై వెళ్లాలని, విదేశాల్లో పనిచేసే వారు 30రోజుల్లో వెనక్కి రావాలని ట్రంప్ ఇచ్చిన ఆదేశాల అమలును తాత్కాలికంగా నిలుపుచేస్తూ శుక్రవారం ఫెడరల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. అభివృద్ధి కార్యకలాపాలకు ఉద్దేశించిన నిధులను స్తంభింపజేయాలన్న ట్రంప్ ఉత్తర్వులను తాత్కాలికంగానైనా నిలుపు చేయడానికి న్యాయమూర్తి తిరస్కరించారు. ఉద్యోగులకు సంబంధించిన వాదనలు, కోర్టు సమీక్ష జరగాల్సిన నేపథ్యంలో ఈ చర్య తీసుకోలేమని చెప్పారు.

సంస్థ పేరును చెరిపివేయడానికి ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం చర్యలు చేపట్టింది. వాషింగ్టన్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా గల రాతి ఫలకంపై గల పేరును కప్పిపుచ్చేలా కొంతమంది వర్కర్లు టేప్‌ను అంటించారు. యుఎస్ఎయిడ్ పతాకాలను కిందకు లాగిపడేశారు.

# పరస్పరం బందీల విడుదల

- ముగ్గురిని విడిచిపెట్టిన హమాస్
- 183మందిని విడుదల చేసిన ఇజ్రాయిల్

**దేర్ అల్ బాలాహ్ (గాజా) :** కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఐదో విడతలో మరో ముగ్గురు బందీలను హమాస్ కార్యకర్తలు శనివారం విడుదల చేసి రెడ్‌క్రాస్‌కు అప్పగించారు. వీరు ముగ్గురూ ఇజ్రాయిల్ పౌరులే. ఇందుకు ప్రతిగా 183మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయిల్ విడుదల చేసింది. వీరిలో ఐదుగురు తూర్పు జెరూసలేంకి చెందిన వారు కాగా, 14మంది గాజా, 53 మంది ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌కు చెందినవారు. ఏడుగురిని ఈజిప్ట్‌కు తరలించాల్సి వుంది. సాయుధులైన హమాస్ కార్యకర్తలు తెల్లని వ్యాన్‌లో ముగ్గురు బందీలను తీసుకొచ్చి పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచారు. వందలాదిమంది ప్రజలు గుమిగూడి వుండగా, ఆ ముగ్గురి వద్దకు మైక్రో ఫోన్ తీసుకెళ్లి బహిరంగంగా ఒక ప్రకటన చేయాల్సిందిగా హమాస్ కోరింది. ఆ తర్వాత వారిని రెడ్ క్రాస్ అధికారులకు అప్పగించారు. విడుదల సమయంలో ఇలా బహిరంగ ప్రకటన వారి చేత చేయించడం ఇదే తొలిసారి.

ఇజ్రాయిల్ విడిచిపెట్టిన ఏడుగురు పాలస్తీనియన్లను తక్షణ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జనవరి 19న ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుండి బందీలను ఇరు పక్షాలు విడుదల చేయడం ఇది ఐదవసారి. శనివారానికి ముందు నాటికి 18 మంది బందీలను హమాస్ విడుదల చేయగా, 550మంది పాలస్తీనా వాసులను ఇజ్రాయిల్ వదిలిపెట్టింది. కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో మొత్తంగా 33 మందిని హమాస్, దాదాపు రెండు వేల మందిని ఇజ్రాయిల్ విడిచిపెట్టాల్సి ఉంది. గాయపడిన పాలస్తీనియన్లు గాజా విడిచి ఈజిప్ట్‌కు వెళ్లేందుకు గత వారం అనుమతించారు. తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందం మార్చి ప్రారంభం వరకు అమల్లో వుంటుంది.

## ఏజెన్సీకి ఎసరు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులతో పాటు, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో ఆమోదించిన నవయుగ ప్రాజెక్టు పరిస్థితి కూడా ఇంతే! తమకు ఏమాత్రం సమాచారం లేకుండా ప్రతిపాదనలు సిద్ధమౌతుండటం పట్ల ఈ ప్రాంతంలో ఆశ్చర్యం, ఆగ్రహం వ్యక్తమవుతోంది. గిరిజన ప్రాంతాల్లో ప్రైవేట్ సంస్థలకు అనుమతి లేదంటూ సమత కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2024మే 31న పశ్చిమబెంగాల్‌లో తుర్గా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం గ్రామసభలు నిర్వహించకుండా భూ సేకరణ చేయడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వివిధ ప్రాజెక్టులపై తమకు కనీస సమాచారం ఉండటం లేదంటూ తమకు ఎటువంటి సమాచారం ఉండటం లేదంటూ స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తుండటం చూస్తుంటే మన రాష్ట్రంలోనూ అదే పరిస్థితి ఏర్పడుతోందా అన్న అనుమానం వ్యక్తమవుతోంది. మన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలసీల్లో గిరిజన ప్రాంతాల్లో భూమిని సేకరించడం కోసం 'అందుబాటులో ఉన్న అన్ని మార్గాలు' అమలు చేస్తామని పేర్కొనడం గమనార్హం.

## సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

**అహ్మదాబాద్ :** గుజరాత్ అహ్మదాబాద్‌లో నిర్మాణంలో ఉన్న సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌లో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే 13 అగ్నిమాపక యంత్రాలు రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఓ అధికారి తెలిపారు. సబర్మతి బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌లో ఉన్న పైకప్పుపై వెల్డింగ్ పనులు జరుగుతున్నాయని, ఈ పనుల వల్లే అగ్నిప్రమాదం చోటుచేసుకుందని అంచనా వేసినట్లు నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సిఎల్) విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఈ సంఘటనా స్థలాన్ని ఎన్‌హెచ్ఎస్ఆర్‌సిఎ అధికారులు పర్యవేక్షించారు. ముంబై అహ్మదాబాద్ 508 కిలోమీటర్ల బుల్లెట్ రైలు ప్రాజెక్టులో భాగంగా ఈ సబర్మతి స్టేషన్‌ను నిర్మిస్తున్నారు.

## 'అన్నదాతా సుఖీభవ'పై అయోమయం

(మొదటిపేజీ తరువాయి)

భూకమతాలుంటే పిఎంకిసాన్ అందుతున్నది 41 లక్షల మందికే. కొత్తగా తెచ్చిన డిజిటలైజేషన్ నిబంధనల వలన ఆ సంఖ్య కుదించుకుపోయే ప్రమాదం నెలకొంది.

**తేల్చని కిస్తు అమౌంట్**

సొంత భూమి కలిగిన రైతులకు కేంద్రం ఇచ్చే ఆరు వేలు పోను రాష్ట్రం 14 వేలివ్వాలి. వీటిని మూడు విడతలకు విభజించాలి. పిఎంకిసాన్ ఏప్రిల్–జులై, ఆగస్టు–నవంబర్, డిసెంబర్–మార్చి... ఇలా మూడు విడతల్లో రెండు వేల చొప్పున జమ అవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం అందించే 14 వేలల్లో ఎప్పుడు ఎంత ఇవ్వాలో తేల్చాల్సి ఉంది.

**కౌలు రైతులకు అన్యాయం**

కౌలు రైతులకు కేంద్రం నుంచి పైసా రాదు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుకోవాలి. వీరికి ఇస్తామన్న రూ.20 వేలను మూడు విడతలుగా విభజించాల్సి ఉంది. కౌలు రైతుల గుర్తింపునకు గతంలో వైసిపి తెచ్చిన సిసిఆర్‌సి చట్టం వలన నష్టం జరిగిందన్న టిడిపి, వారి గుర్తింపునకు సరళతరమైన కొత్త చట్టం తెస్తామని హామీ ఇచ్చింది. దానిపై అతీగతీ లేదు. అప్పటి వరకు సిసిఆర్‌సి, ఇతర పద్ధతుల్లో గుర్తించిన కౌలు రైతులకు సాయం అందించాలి. గత సర్కారు కౌలు రైతుల్లో భూమి లేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు మాత్రమే 'భరోసా' సాయం అందించింది. ఇతరులకు సాయాన్ని మినహాయించింది. టిడిపి సర్కారు కౌలు రైతులందరికీ ఇస్తామంది. అయితే పాత పద్ధతిలో కౌలు రైతులను గుర్తించినట్లయితే నామమాత్రం సంఖ్యకు కూడా సాయం అందదు. ఐదేళ్లల్లో వైసిపి ప్రభుత్వంలో ఏ సంవత్సరమూ సిసిఆర్‌సి హోల్డర్లకు సాయం లక్ష మందికి మించలేదు. కౌలు రైతుల సంఖ్య లక్షల్లో ఉంది. ఆ రీత్యా చూస్తే కౌలు రైతులకు సాయం పెద్దగా అందే పరిస్థితి లేదు. తమకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన కౌలు రైతుల్లో ఉంది.

## కల్కాజిలో అతిషి గెలుపు

**ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో**



ఆప్ అగ్రనేతలు ఓడినా ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి దక్షిణ ఢిల్లీలోని కల్కాజి స్థానాన్ని నిలబెట్టుకున్నారు. తన ప్రత్యర్థులైన బిజెపి మాజీ ఎంపీ రమేష్ బిధూరి, కాంగ్రెస్ అభ్యర్థి అల్కా లంబాను ఓడించారు. అతిషి, బిధూరీ మధ్య చివరి రౌండ్ వరకూ హోరాహోరీ పోరు సాగింది. అల్కా లంబా ప్రతిపక్ష ఓట్లను చీల్చి, ఆప్ విజయావకాశాలను దెబ్బతీస్తారని పలువురు భావించారు. ముఖ్యమంత్రిగా ఉన్న అతిషి ఇతర నియోజకవర్గాల్లో కూడా పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయాల్సి రావడంతో కల్కాజిపై పెద్దగా దృష్టి సారించలేకపోయారు. అయినప్పటికీ విజయం ఆమెనే వరించింది. అతిషికి 52,154 ఓట్లు రాగా బిధూరీకి 48,633 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి అల్కా లంబా 4,392 ఓట్లకే పరిమితమయ్యారు.

### అరెస్టయిన ముగ్గురు నేతలకూ పరాజయమే



ఢిల్లీ ప్రభుత్వ మద్యం పాలసీలో జరిగిన అవకతవకలు, అవినీతికి సంబంధించి జరుగుతున్న విచారణలో భాగంగా అరెస్టయి, బెయిల్‌పై విడుదలైన ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేతలు ముగ్గురూ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ కారాగారవాసాన్ని అనుభవించిన వారే. రాజకీయ ఒత్తిళ్ల మధ్య న్యాయ పోరాటాలు సాగించినప్పటికీ వీరిలో ఏ ఒక్కరూ ఢిల్లీ శాసనసభలో ప్రవేశించలేకపోయారు. ప్రజల తీర్పు పొందిన తర్వాతే తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతానని పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్ తాజా ఎన్నికల్లో ఆయన 4,089 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్‌కు గత సంవత్సరం సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మద్యం కుంభకోణం, మనీ లాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను 2023లో అరెస్ట్ చేశారు. సంవత్సర కాలానికి పైగా జైలులో గడిపిన సిసోడియా గత ఆగస్ట్‌లో బెయిల్‌పై విడుదలయ్యారు. ఆప్ కంచుకోట అయిన జంగ్‌పురాలో సిసోడియా ఓటమి చెందడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

మనీ లాండరింగ్ కేసులో 2022లో అరెస్టయిన సత్యేంద్ర జైన్ షాకూర్ బస్తీ స్థానంలో బిజెపి అభ్యర్థి కర్నైల్ సింగ్ చేతిలో ఓటమి పాలయ్యారు.కేజ్రీవాల్, సిసోడియా, సత్యేంద్ర జైన్ ఓటమి ఆప్‌కు గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు.

### విజయం సాధించిన ప్రముఖులు

విజయం సాధించిన ప్రముఖుల్లో పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మ (బిజెపి – న్యూఢిల్లీ), అతిషి (ఆమ్ఆద్మీ – కల్కాజీ), కైలాస్ గహ్లోట్ (బిజెపి – బిజ్వాసన్), తర్వీందర్ సింగ్ మార్వా (బిజెపి – జంగ్‌పురా) ఉన్నారు. రాజధానిలోని అన్ని ప్రాంతాల్లోనూ ఆప్ ఓటు బ్యాంకుకు గండిపడింది. న్యూఢిల్లీ, పశ్చిమ ఢిల్లీలో పార్టీ బాగా దెబ్బతిన్నది. పేదలు అధికంగా నివసించే స్థానాల్లో ఆప్ ఓటు బ్యాంక్ చెక్కు చెదరలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆయా స్థానాల్లో ఆ పార్టీకి 48.5 శాతం ఓట్లు పడ్డాయి. సంపన్నులు నివసించే నియోజకవర్గాల్లో బిజెపి, దాని మిత్రపక్షాలకు 52.6 శాతం ఓట్లు పడడం గమనార్హం. మొత్తంగా చూస్తే బిజెపి, దాని భాగస్వామ్య పార్టీలకు కలిపి 45.8 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆప్‌కు ఏ ప్రాంతంలోనూ 50 శాతం ఓట్లు రాలేదు. మొత్తంగా ఆ పార్టీకి 43.8 శాతం ఓట్లు లభించాయి.

### ఆప్, కాంగ్రెస్ ఓట్ల చీలికే కొంపముంచిందా?

ఆప్, కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేయడం వల్లే బిజెపి లబ్ధిపొందిందని గణాంకాల ఆధారంగా పలువురు విశ్లేషిస్తున్నారు. 6.4 శాతం ఓట్లతో కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైనప్పటికీ ఆప్ పరాజయానికి దోహదపడింది. రాజేందర్‌నగర్‌లో ఆప్‌కు 45,440, కాంగ్రెస్‌కు 4,015 ఓట్లు వచ్చాయి. ఈ రెండు పార్టీలు కలిస్తే అక్కడ బిజెపిని సునాయాసంగా ఓడించి ఉండేవి. ఛాతర్‌పూర్‌లో ఆప్‌కు 74,230, కాంగ్రెస్‌కు 6,601 ఓట్లు వచ్చాయి. అక్కడ కూడా ఈ రెండు పార్టీలు కలిస్తే గెలిచేవి. సంగమ్ విహార్, కైలాష్, తిమర్‌పూర్ స్థానాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

బడ్లీ, నంగ్‌లాయ్ జాట్ స్థానాల్లో కాంగ్రెస్‌కు గణనీయంగా ఓట్లు పడ్డాయి. బండ్లీలో ఆప్‌కు 35,668, కాంగ్రెస్‌కు 31,130 ఓట్లు వచ్చాయి. నంగ్‌లాయ్ జాట్‌లో ఆప్‌కు 48,907, కాంగ్రెస్‌కు 31,918 ఓట్లు పోలయ్యాయి. రెండు పార్టీల మధ్య సయోధ్య కుదిరి ఉంటే ఇలాంటి స్థానాలన్నీ ఆప్ ఖాతాలోనే పడేవి. నరేలా, బిజ్వాసన్ వంటి స్థానాల్లో ఆప్, బిజెపి మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ జరిగింది. ఆ స్థానాల్లో బీజేపీ స్వల్ప ఆధిక్యతలతో గట్టెక్కింది. అక్కడ కాంగ్రెస్‌కు లభించిన ఓట్లను కలుపుకుంటే ఆప్ తేలికగా విజయం సాధించేది. కాంగ్రెస్, ఆప్ కలిస్తే రాజేందర్ నగర్, చత్తాపూర్, సంగమ్ విహార్, గ్రేటర్ కైలాష్, నరేలా, తిమర్‌పూర్, బండ్లీ, నంగ్‌లాయ్ జాట్, మాదీపూర్, బిజ్వాసన్, న్యూఢిల్లీ, జంగ్‌పురా, కస్తూర్బా నగర్,మాల్వియా నగర్, మెహ్‌రౌలీ తిలోక్‌పురి వంటి ఖాతాలను గెలుచుకొని ఉండేవని పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

## ఢిల్లీ ఎన్నికల్లో వామపక్షాల ఓట్లు

**ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మూడు వామపక్ష పార్టీలు కలిసి పోటీ చేశాయి. మూడు పార్టీలు చెరో రెండు స్థానాల్లో పోటీ చేశాయి. సిపిఎం తరపున కరవాల్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అశోక్ అగర్వాల్‌కు 457, బాదర్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జగదీష్ చంద్‌కు 367 ఓట్లు వచ్చాయి. సిపిఐ తరపున ఓఖ్లా స్థానం నుంచి పోటీ చేసిన ఎమ్‌డి ఇంజమాముల్ హసన్‌కు 259 ఓట్లు, పాలం స్థానం నుంచి పోటీ చేసిన దిలీప్ కుమార్‌కు 326 ఓట్లు, వజీర్‌పూర్ నుంచి పోటీ చేసిన దేవేందర్ కుమార్‌కు 190 ఓట్లు వచ్చాయి. సిపిఐ(ఎంఎల్) తరపున నెరెల స్థానం నుంచి పోటీ చేసిన అనిల్ కుమార్ సింగ్‌కు 328, కొండ్లి స్థానం నుంచి పోటీ చేసిన అమర్జీత్ ప్రసాద్‌కు 100 ఓట్లు వచ్చాయి.

## ఉప ఎన్నికల్లో అధికార పార్టీలదే హవా

**చెన్నయ్/లక్నో :** తమిళనాడులోని ఎరోడ్ (ఈస్ట్) శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో డిఎంకె అభ్యర్థి చందిరాకుమార్ విసి విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, నామ్ తరిలార్ కచ్చి అభ్యర్థి ఎంకె సీతాలక్ష్మిపై 91,558 వేలకు పైగా భారీ ఆధిక్యతతో గెలుపొందారు. ఉత్తరప్రదేశ్‌లోని మిల్కీపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థి చంద్రభాను పాశ్వాన్ 61,710 ఓట్ల మెజారిటీతో సమీప సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అజిత్ ప్రసాద్‌పై గెలుపొందారు.

## ఢిల్లీలో బిజెపి

(మొదటిపేజీ తరువాయి)

విజయాన్ని అందించినందుకు ఢిల్లీలోని అందరికీ నా అభినందనలు. ఢిల్లీ అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

**బిజెపిపై పోరాటం కొనసాగుతుంది : అతిషి**

బిజెపిపై పోరాటం కొనసాగుతుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి అన్నారు. ఎన్నికల ఫలితాలు ఆప్‌కు గట్టి ఎదురుదెబ్బే అని, ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన కల్కాజీ ప్రజలకు ధన్యావాదాలు తెలిపారు.

**ప్రజల నిర్ణయాన్ని గౌరవంగానే భావిస్తాం : అరవింద్ కేజ్రీవాల్**

ప్రజల నిర్ణయాన్ని గౌరవంగానే భావిస్తామని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'ప్రజల ఆదేశాన్ని శిరసావహిస్తాం. బిజెపికి అభినందనలు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తారని ఆశిస్తున్నాను. గత పదేళ్లలో ఆరోగ్యం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశాం. ప్రతిపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం'. అని తెలిపారు.

**మార్పు కోసం ఓటేశారు : ప్రియాంక గాంధీ**

ఢిల్లీ ప్రజలు మార్పు కోసం ఓటేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. "స్థానిక పరిస్థితులతో ప్రజలు విసిగిపోయారు. మార్పు కోసమే వారు ఓటేశారని అనుకుంటున్నాను. గెలిచిన వారందరికీ నా శుభాకాంక్షలు. మిగిలిన వారు మరింతగా శ్రమించాలని ఈ ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై స్పందించాలి" అని ఆమె చెప్పారు.



**మీ కోసం**


దాహంతో నాలుక పొడిబారిపోతుంటే, యాలుక పలుకుల్ని తింటే వెంటనే ఉపశమనం పొందవచ్చు.

**జీవన సౌరభం**

నీడను చూసి భయపడకూడదు. దగ్గరలో వెలుతురు ఉంటేనే నీడ పడుతుంది.



## కుక్క పిల్ల



రాముపల్లి అనే ఊరిలో గోపి అనే పిల్లవాడు ఉన్నాడు. తను ఒక కుక్క పిల్లను పెంచుతున్నాడు. దాని పేరు స్వీటి. అది అంటే గోపికి చాలా ఇష్టం. బడి నుండి రాగానే ప్రతి రోజూ గోపి స్వీటీతో ఆడుకుంటాడు. ఒకరోజు కొన్ని కుక్కలు ఊరిలో చాలా మందిని కరిచాయి. వారం రోజుల్లో కుక్కలను ఊరినుండి పంపించాలని గ్రామ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. స్వీటీని కూడా ఊరు బయటకు పంపిస్తారని తెలుసుకున్న గోపి, బెంగపెట్టుకున్నాడు. అన్నం తినడం మానేశాడు. బడికి వెళ్ళడం లేదు. అమ్మా నాన్నలు, స్నేహితులు ఎంత నచ్చ చెప్పినా వినడం లేదు. 'ఏవో కొన్ని కుక్కలు కరిస్తే, నా స్వీటీని ఎందుకు తీసుకెళ్తారు? అది ఏమీ తప్పు చేయలేదు కదా' అని అమాయకంగా అడిగిన గోపి ప్రశ్నలకు ఎవరు జవాబు చెప్పడం లేదు. వారం రోజుల్లో కుక్కలను తీసుకెళ్లే బండి వచ్చింది. ఊరి వారందరు కుక్కలను పట్టుకుని బండిలో వేస్తున్నారు. గోపి ఇంటికి కూడా వచ్చారు. 'నా స్వీటీ ఏ తప్పూ చేయలేదు. నేను పంపను' అని గోపి ఎదురు తిరిగాడు. 'తప్పు చేయని కుక్కలకు శిక్ష ఎందుకు వేస్తారు' అన్న గోపి మాటలు విని కొందరు ఆలోచనలో పడ్డారు. గోపీ బాధ అర్థం చేసుకున్న అమ్మానాన్న, స్వీటీ ఎవరినీ కరవకుండా మేము చూసుకుంటాం. దానికి టీకాలు వేయిస్తాం' అని గ్రామస్తులతో చెప్పారు. అది విన్న గ్రామస్తులు స్వీటీని తీసుకెళ్లకుండా వెళ్లిపోయారు. గోపి ఎంతో సంతోషించాడు.



– జె.హర్ష వర్ధన్,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్,
సిద్దిపేట జిల్లా.

## నేను గీసిన బొమ్మ






ఎం. వర్షితశ్రీ,
5వ తరగతి, సృజన హైస్కూలు,
ఉప్పల్, హైద్రాబాద్.


## జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఆకారాలకు సరిపోయే వస్తువులు ఎదురుగానే ఉన్నాయి.
సరిగ్గా జతచేయండి చూద్దాం.



# ఒకరికి ఒకరై .. బతుకున గెలుపై ...

## నేడు ప్రపంచ వివాహ దినోత్సవం



పెళ్లి అనేది భార్యాభర్తల మధ్య ఒక పటిష్టమైన బంధం. మానవ జీవితంలో జరిగే అన్ని బంధాలు, అనుబంధాలు, అభివృద్ధి, విలువలు, సంప్రదాయాలు, సంస్కృతులకు మూలమవుతుంది. ఈ బంధం తోడు, నీడగా ఉంటూ రక రకాల భావోద్వేగాలకు అలవాలం అవుతుంది.

ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని సజావుగా ఎలాంటి ఒడిదుడుకులు రాకుండా, భవిష్యత్తులో తోడుగా ఉంటారనే భావనతో 'పెళ్లి' అనే ప్రక్రియ ద్వారా కుటుంబ వ్యవస్థలోకి అడుగు పెడతారు. ఏ పద్ధతిలో పెళ్లి జరిగినా ఇద్దరు కలిసి జీవించటమే దాని సారాంశం. భార్యాభర్తలు ఇద్దరూ పరస్పర సహకారం, గౌరవ భావంతో కొనసాగిస్తే జీవితాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవచ్చు. ప్రేమించి పెళ్లి చేసుకోవటం ఒక తంతు అయితే, పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు మరో తంతుగా సాగుతుంటాయి. ఇవి కాకుండా ఆచారాల పేరుతోనూ, మతాలపేరుతోనూ, కులాలవారీగా కూడా వివిధ పద్ధతుల్లో వివాహ క్రతువులు జరుగుతుంటాయి. నేడు పెళ్లిళ్ల ట్రెండ్ ప్రపంచ వ్యాప్తంగా మారిపోయింది. ఉద్యోగమో, వ్యాపారమో, ఇతరత్రా వృత్తుల్లోనో, పని ప్రదేశాల్లో ఏర్పడిన పరిచయాలతో కూడా పెళ్లిళ్లు జరిగిపోతున్నాయి. ప్రపంచంలో ఎక్కడివారైనా, ఎక్కడివారినైనా ఇష్టపడి పెళ్లి చేసుకుంటుండటం తెలిసిందే. పెద్దల కుదిర్చిన పెళ్లిళ్లతోపాటుగా ప్రేమ పెళ్లిళ్లు, ఆదర్శ వివాహాలు కూడా కొనసాగుతున్నాయి. చదువు, ఉద్యోగంతోపాటుగా ఇద్దరూ పరస్పర అవగాహనతో ఉన్న యువతీ యువకులు నేడు ఖండాంతరాలు సైతం చెరిపేసి వివాహాలు చేసుకుంటున్నారు. కొందరు సాధారణ పద్ధతుల్లో వివాహాలు జరుపుకుంటుంటే మరికొందరు ఆర్భాటంగా ఖర్చుపెట్టి సైతం చేస్తున్నారు. కుల, మతాచారాలతో కూడా కొన్ని చోట్ల వివాహాలు జరుగుతున్నాయి.

తెలుగు సినిమాల్లో పెళ్లి గురించి చాలా పాటలు వచ్చాయి. పుష్పక విమానంలో 'కళ్యాణం కమనీయం' అన్నా, రణరంగంలో 'సీతాకళ్యాణ వైభోగమే' అని పాడినా, శ్రీనివాస కళ్యాణంలో 'కళ్యాణ వైభోగం' అని అన్నా, వరుడులో 'అయిదురోజుల పెళ్లి' అంటూ గుర్తుచేసినా, శతమానం భవతిలో 'వధువేమో అలమేలు' అంటూ పాడినా, రాధాగోపాలంలో 'శతమానంభవతి' అంటూ సాగినా, ఎవడే అతగాడులో 'కళ్యాణం చూతము రాండీ' అంటూ సాగిన పాటల్లోని సాహిత్యం పెళ్లి ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ దాంపత్య జీవన ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. 'మనసున మనసై బతుకున బతుకై...తోడొకరుండినా అదే భాగ్యము' అంటూ భార్యాభర్తల దాంపత్య జీవితాన్ని తెలియజేస్తూ 'డాక్టర్ చక్రవర్తి' సినిమాలో శ్రీశ్రీ రాసిన పాటను ఘంటసాల వెంకటేశ్వరరావు ఎంతో చక్కగా స్వరపర్చారు.

ఇక ఎలాగో పెళ్లయిపోతే పిల్లలు, వారిని పెద్ద చేయటం, ఆ తర్వాత వీళ్లు పెద్దవారిగా మారిపోవటం తెలిసిందే. ఈరోజుల్లో మారిన చదువులు, ఉద్యోగాలతో పిల్లలు ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉంటారో తెలియని పరిస్థితుల్లో దంపతులు ఇద్దరే ఇళ్లల్లో ఉండే పరిస్థితులుంటున్నాయి. ఇరు కుటుంబాల పెద్దల బాధ్యత కూడా ఈ దంపతులదే. ఇలాంటి పరిస్థితుల్లో జీవితాంతం పంతాలు, పట్టింపులకు పోకుండా సజావుగా జీవనయానాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే దంపతులిద్దరూ పరస్పరం గౌరవం, ప్రేమాభిమానాలతో ఉండాలి. 'నేనున్నానని.. నీకేం కాదని' అనే భరోసా ఇద్దరి మధ్య ఉండాలి.



**కష్టసుఖాల్లోనూ...**

జీవితంలో కష్టాలు, సుఖాలు వస్తూ పోతూ ఉంటాయి. భార్యయినా, భర్తయినా జీవితాంతం తోడుంటారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా...ఇలా ఇరువురు పరస్పరం సాయం చేసుకుంటూ ముందుకు సాగుతుంటే పిల్లలు, ఆయా కుటుంబాలు ఎంతో సంతోషదాయకంగా ముందుకు సాగుతుంటాయి.

**కుటుంబ వ్యవస్థ బలోపేతానికి దోహదం**

మానవ జీవితంలో భార్యా భర్త కష్ట సుఖాల్లో తోడుగా ఉండే బంధం. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ కాలాన్ని మధురం చేసుకోవాలి. అనవసర గొడవలకు పోతే చేదు జ్ఞాపకాలే మిగులుతాయి. సినిమాల ప్రభావం, పెరుగుతున్న పాశ్చాత్య ధోరణి ప్రభావంలో పడకుండా జాగ్రత్తగా ఉండాలి. చదువు, హోదా, సౌకర్యాలు, సౌఖ్యాలు పేరుతో ఆలోచనల్లో మార్పులు సహజమే. అనుమానాలు, కలతలు, మనస్పర్థలు లేకుండా నిరంతరం చర్చించుకుంటుంటే సరదాగా కాపురాలు సాగుతాయి. అప్పుడే ఎలాంటి భార్యాభర్తలు జీవితాంతం తోడునీడగా ఎలాంటి అరమరికలు లేకుండా జీవిస్తారు.

**సర్దుబాట్లు తప్పదు :**

భాగస్వామిపై ప్రేమను తెలియజేసేందుకు చిన్న కానుకలు ఇవ్వటం మంచిదే. అనుబంధం బలపడటానికి ఇవి మాత్రమే సరిపోవు. కాస్త ఓపిక, సర్దుబాటు, ఆప్యాయత కూడా అవసరమే.

జీవన ప్రయాణంలో సరదాలు, సంతోషాలతోపాటు బాధ్యతలు ఉంటాయి. వాటిని విస్మరిస్తే మాత్రం సమస్యలు చుట్టుముట్టేస్తాయి. ముందు అవేంటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. ఓపికతో కొత్త విషయాలను నేర్చుకోగలగాలి. అప్పుడు ఒకరికొకరు భారంగా, దూరంగా మారకుండా ఉంటారు.

**అభిప్రాయాలకు విలువివ్వాలి**

అన్నీ మనకు నచ్చినట్లే ఉండాలంటే కుదరదు. అలాగని ఎదుటివారి కోసం మనకు నచ్చేవి కొన్ని వదులుకోవాల్సిన అవసరమూ లేదు. ఆత్మాభిమానం దెబ్బతినకుండా, మొహమాట పడకుండా, సున్నితంగానే ఇరువురూ అభిప్రాయాలను పంచుకోవాలి. ఎదుట వారి అభిప్రాయాలనూ, ఇష్టాలనూ గౌరవించాలి. అలాంటప్పుడు జీవితాన్ని హాయిగా నిర్వహించుకోవచ్చు.

భార్యాభర్తలన్నాక చిన్న చిన్న పొరపొచ్చాలు సహజమే. ఇలాంటప్పుడు మాటలు కటువుగా లేకుండా చూసుకోవాలి. ఎదుటివారిని అపహాస్యం చేయడం, చులకనగా మాట్లాడటం, తప్పులు ఎత్తిచూపుతూ ప్రస్తావించటం వంటి పనులు అస్సలు చేయొద్దు. ఇవి వారి అహాన్ని దెబ్బతీసి సమస్యను మరింత ముదిరేలా చేస్తాయి. గొడవ ఏదైనా సరే...ఆ విషయాన్ని అక్కడితే పరిష్కరించుకుంటే సరి. సంతోషంగా సంసారాన్ని నడిపేయొచ్చు.

**ఇవీ పాటించండి**

- పరస్పర గౌరవం
- పనుల్లో భాగస్వామ్యం
- పిల్లలతో సఖ్యత
- సామరస్య వాతావరణం
- ఆర్థిక విషయాల్లో దాపరికం లేని వైఖరి
- చెడు అలవాట్లకు దూరంగా ఉండటం
- పరస్పర ప్రేమాభిమానాలు
- ఆంక్షలు..అజమాయిషీలొద్దు
- నిర్మొహమాటంగా మాట్లాడటం
- చర్చతోనే సమస్యలకు పరిష్కారం



## 14న కెప్టెన్ అమెరికా : బ్రేవ్ న్యూ వరల్డ్ విడుదల

థ్రిల్లింగ్ యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ ఫైట్లతో 'కెప్టెన్ అమెరికా : బ్రేవ్ న్యూ వరల్డ్' చిత్రం ఈనెల 14న విడుదల కానుంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసియు) సిరీస్ ద్వారా వస్తున్న ఆరో భాగం ఇది. నటుడు హారిసన్‌ఫోర్డ్ ఇందులో రెడ్‌హల్క్ పాత్రలో నటిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఈ చిత్రం నుంచి హారిసన్‌ఫోర్డ్ పాత్రను పరిచయం చేశారు. ఈనెల 14న హిందీ, ఇంగ్లీషుతోపాటు దక్షిణాది బాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. జూలియస్ ఓనా దర్శకత్వం వహించారు. ఆంథోనీ మాకీ, డానీ రామిరేజ్, షిరా హాస్, జోషా రోక్మోర్, కార్ల్ లంబ్లీ, లివ్ టైలర్, టిమ్ బ్లేక్ నెల్సన్ నటించారు.



## 'ఒక పథకం ప్రకారం' సక్సెస్‌మీట్


దర్శకుడు పూరీ జగన్నాథ్ సోదరుడు సాయిరామ్‌శంకర్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఒక పథకం ప్రకారం' శుక్రవారం విడుదలై హిట్ టాక్‌ను అందుకుంది. నిర్మాత గార్లపాటి రమేష్‌తో కలిసి దర్శకుడు వినోద్‌కుమార్ విజయన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. శ్రీలక్ష్మి ఫిలిమ్స్‌పై బాపిరాజు ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేశారు. విలన్ ఎవరో కనిపెడితే రూ.10 వేలు ఇస్తామని చిత్ర యూనిట్ ప్రకటించిన ఆఫర్‌తో సినిమాపై అందరికీ ఆసక్తి కూడా ఏర్పడింది. ప్రస్తుతం ఈ చిత్రానికి వస్తున్న ఆదరణను చూసిన చిత్ర యూనిట్ సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. కథానాయకుడు సాయిరామ్ శంకర్, దర్శక, నిర్మాత వినోద్ విజయన్ మాట్లాడారు. తాము ఊహించిన విధంగానే 'ఒక పథకం ప్రకారం' సినిమాను ప్రేక్షకులు విశేషంగా ఆదరిస్తున్నారన్నారు.

## సూర్య 'రెట్రో' తెలుగు టీజర్ విడుదల




తమిళ కథా నాయకుడు సూర్య నటిస్తున్న కొత్త సినిమా 'రెట్రో'. ఈ సినిమా నుంచి టీజర్‌ను మేకర్లు విడుదల చేశారు. గతేడాది 'కంగువ' సినిమాతో సూర్య ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆ చిత్రం నిరాశపర్చింది. కొత్త కథతో ప్రేమ, యాక్షన్ అంశాలను మేళవించి కార్తీక్ సుబ్బరాజు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పూజా హెగ్డే కథానాయిక. భారీ బడ్జెట్‌తో 2డీ ఎంటర్‌టైన్‌మెంట్, స్టోన్‌బెంచ్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మే 1న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

## నేడు ఉత్తమ దర్శకుడిగా కనపర్తి రత్నాకర్ అవార్డు స్వీకారం




ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్-టాలెంట్ అవార్డ్స్-2025ను హైదరాబాద్‌కు చెందిన మోర్డ్ ఫౌండేషన్, సౌమిత్ మీడియా ప్రెజెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రదానం చేయనున్నాయి. తెనాలి చరిత్రకు సంబంధించిన అంశంపై రూపొందించిన 'వీరస్థలి తెనాలి' చిత్రం ఉత్తమ స్వాతంత్ర్యోద్యమ డాక్యుమెంటరీగా ఎంపికైంది.తెనాలికి చెందిన కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో గల్లా జ్ఞానశేఖర్ నిర్మాతగా ఈ సినిమాను తెరకెక్కించారు. నాలుగేళ్లక్రితం రూపొందించిన ఈ సినిమాకు ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఆదివారం జరిగే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ స్వాతంత్ర్యోద్యమ డాక్యుమెంటరీగా అవార్డును దర్శకుడు కనపర్తి రత్నాకర్ అందుకోనున్నారు.




## స్క్విడ్ గేమ్-2కు సినీ క్రిటిక్ అవార్డు

అత్యంత ప్రతిష్టాత్మకమైన క్రిటిక్స్ ఛాయిస్ అవార్డులను నిర్వాహకులు ప్రకటించారు. కొరియన్ వెబ్ సిరీస్ స్క్విడ్ గేమ్-2 అవార్డును దక్కించుకుంది. గతేడాది నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన ఈ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ దక్కించుకుంది. నాలుగేళ్ల క్రితం విడుదలైన ఈ సిరీస్ సీజన్ 2, 2004లో విడుదలైంది. ఈ సిరీస్ సీజన్ 3 వచ్చే జూన్‌లో అందుబాటులోకి రానుంది. ఈ అవార్డుల కోసం సమంత నటించిన సిటాడెల్ ఇండియన్ వర్షన్, హనీ బన్నీ వెబ్ సిరీస్, ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్ మూవీ కూడా పోటీపడ్డాయి. బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ వెబ్ సిరీస్‌ల జాబితాలో నామినేట్ అయిన హనీ బన్నీ అవార్డును సాధించలేకపోయింది. బెస్ట్ ఫారిన్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో పోటీపడిన మూవీ ఆల్‌వి ఇమేజిన్ యాజ్‌లైట్‌కు కూడా నిరాశే ఎదురయ్యింది.



## శింగనమల చెప్పినవన్నీ అబద్ధాలే
### వైజయంతిరెడ్డి, సదానంద్

'మా పెట్టుబడితో కొమరంపులి, ఖలేజా సినిమాలను తీసి తిరిగి మాకు ఇవ్వకుండా శింగనమల రమేష్‌బాబు మోసం చేశారు. మాతోపాటు ఇంకెందరో బాధితులు ఉన్నారు. ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ వారు చిత్ర పరిశ్రమ నుంచి కూడా బహిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. హైదరాబాద్ సివిల్ కోర్టులో అతనిపై కేసు నడుస్తోంది. క్రిమినల్ కేసు హైకోర్టులో అప్పీల్‌కు సిఐడితోపాటు మేము కూడా వెళ్లబోతున్నాం. మాకు న్యాయం జరిగే వరకూ అవిశ్రాంతంగా పోరాటం చేస్తాం. శింగనమల రమేష్‌బాబు మోసాలు, బెదిరింపులు, అక్రమాస్తులపై అతని బాధితులందరం తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్‌ను కలుస్తాం' అని ఫైనాన్సియర్స్ వైజయంతిరెడ్డి, ఆమె తరపున భర్త సదానంద్ చెప్పారు. హైదరాబాద్ సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు పై విధంగా మాట్లాడారు.





## 100మీ. స్ప్రింట్ విజేత అనిమేశ్, సుదేష్ణ

- బాక్సింగ్‌లో లౌవ్లీనా, శివ థాపాకు పతకాలు
- 38వ జాతీయ క్రీడలు

**డెహ్రాడూన్:** 38వ జాతీయ క్రీడల ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో జాతీయ రికార్డు సమం అయ్యింది. ఒడిశా స్ప్రింటర్ అనిమేశ్ కుజుర్ 100మీ. స్ప్రింట్‌ను 10.28సెకన్లలో పూర్తి చేసి జాతీయ రికార్డును సమం చేశాడు. కెరీర్ బెస్ట్ 10.27సెకన్లను నమోదు చేయలేకపోయాడు శనివారం జరిగిన ఫైనల్లో 21ఏళ్ల అనిమేశ్ 10.28సెకన్లలో గమ్యానికి చేరి బంగారు పతకాన్ని సాధించాడు. దీంతో గతంలో అమ్లాన్ బోర్గోహైన్(10.28సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డు సమమైంది. మహారాష్ట్రకు చెందిన ప్రణవ్ 10.32సెకన్లు, బోర్గోహైన్ 10.43 రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్యాలను చేజిక్కించుకున్నారు. ఇక మహిళల 100మీ. స్ప్రింట్ విజేతగా మహారాష్ట్రకు చెందిన సుదేష్ణ శివాంకర్ నిలిచింది. ఫైనల్లో సుదేష్ణ 11.76సెకన్లలో గమ్యానికి చేరి బంగారు పతకాన్ని చేజిక్కించుకుంది.

**లౌవ్లీనాకు పసిడి**

జాతీయ క్రీడల్లో మహిళా బాక్సర్, ఒలింపియన్ లౌవ్లీనా బోర్గోహైన్ స్వర్ణ పతకం చేజిక్కించుకుంది. అస్సాం తరపున బరిలోకి దిగిన లౌవ్లీనా మహిళల 75కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. ఫైనల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రన్ను రాథోర్‌పై 5-0తో విజయం సాధించింది. 27ఏళ్ల లౌవ్లీనా తొలి బౌట్ ప్రారంభం నుంచే బలమైన పంచ్‌లతో ప్రత్యర్థిపై విరుచుకుపడింది. ఇక పురుషుల 63కిలోల విభాగం ఫైనల్లో శివ థాపా 4-3పాయింట్ల తేడాతో వంశరాజ్(సర్వీసెస్)ను చిత్తుచేశాడు. శివ థాపా 2012 లండన్ ఒలింపిక్స్‌లో రజత పతకం చేజిక్కించుకోగా.. ఆరుసార్లు ఆసియా ఛాంపియన్‌గా నిలిచాడు. శివ థాపాకు భారత ప్రభుత్వం అర్జున అవార్డుతో సత్కరించింది.

## జట్టు కూర్పుపైనే కసరత్తు

- కోహ్లి ఫిట్ - పంత్, వరుణ్ కూడా..
- నేడు ఇంగ్లండ్‌తో రెండో వన్డే
- మ. 1.30గం॥ల నుంచి



**కటక్:** ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు దూరమైన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఫిట్‌నెస్ సాధించాడు. కటక్ వేదికగా ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగే రెండో వన్డేకు అతడు అందుబాటులో ఉండనున్నాడు. తొలి వన్డేకు దూరమైన కోహ్లి స్థానంలో చోటు దక్కించుకున్న శ్రేయస్ అయ్యర్ అర్ధసెంచరీతో రాణించడంతో రెండో వన్డేలో ఎవరికి ఛాన్స్ దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. నాగ్‌పూర్ వన్డేకు కుడి మోకాలు వాపు కారణంగా మ్యాచ్‌కు దూరమైనట్లు కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడు. ఈ నెల 9న జరిగే కటక్ వన్డేకు విరాట్ ఆడతాడని వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. కోహ్లికి చోటు దక్కాలంటే శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్‌లో ఒకరు బెంచ్‌కు పరిమితం కావాలి. అయితే, శ్రేయాస్ నాగ్‌పూర్ వన్డేలో రాణించాడు. దీంతో జైస్వాల్‌పైనే వేటు పడే ఛాన్స్ ఉంది. గిల్‌తో కలిసి శ్రేయస్ 94 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. ఈ క్రమంలో రెండో వన్డే నుంచి అయ్యర్‌ను తప్పించడం మేనేజ్‌మెంట్‌కు కష్టమే.

**పంత్, వరుణ్‌కు ఛాన్స్ దక్కేనా...**

నాగ్‌పూర్ వన్డేకు కీపర్‌గా ఉన్న కేఎల్ రాహుల్ బ్యాటింగ్‌లో నిరాశపరిచాడు. దీంతో రిషబ్ పంత్‌కు ఛాన్స్ ఇవ్వాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తే.. కెఎల్ బెంచ్‌కే పరిమితమైనట్లే. చాంపియన్స్ ట్రోఫీకి ముందు వీలైనన్ని ఎక్కువగా ప్రయోగాలు చేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్న దృష్ట్యా కటక్ వన్డేలో రాహుల్‌ను పక్కనపెట్టి రిషబ్ పంత్‌ను బరిలోకి దింపినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇంగ్లండ్‌తో టి20 సిరీస్‌లో రాణించిన వరుణ్ చక్రవర్తికి సైతం చోటు కల్పించాలనే చర్చ జరుగుతోంది. గాయం నుంచి కోలుకున్న కుల్దీప్ యాదవ్ తొలి వన్డేలో 9.4 ఓవర్లు వేసి 53 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. దీంతో కుల్దీప్ స్థానంలో వరుణ్‌కు అవకాశం ఇస్తే వన్డేల్లోనూ అతని ప్రతిభ వెలికిరానుంది.

## ముంబయి 278/8

**రంజీట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్**



తనుష్ కోటియన్(85)

**కోల్‌కతా :** రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో రికార్డు స్థాయిలో 42సార్లు టైటిల్ నెగ్గిన ముంబయి జట్టు తొలిరోజే 278పరుగులకు 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. శ్యామ్స్ ములాని(91), తనుష్ కోటియన్(85) మినహా.. మిగిలిన బ్యాటర్లంతా నిరాశపరిచారు. స్టార్ బ్యాటర్లు శివమ్ దూబే(28), సూర్యకుమార్ యాదవ్(9), కెప్టెన్ అజింక్యా రహానే(31) నిరాశపరిచారు. హర్యానా బౌలర్లు కంబోజ్‌కు మూడు, సుమిత్ కుమార్‌కు రెండు, అనుజ్, అజిత్, జయంత్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. రాజ్‌కోట్ వేదికగా సౌరాష్ట్ర-గుజరాత్ జట్ల మధ్య జరుగుతున్న మరో క్వార్టర్‌ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 216పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బౌలర్లు చింతన్ గాజా నాలుగు, దేశాయ్, పటేల్ రెండేసి వికెట్లతో రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గుజరాత్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సరికి 21 పరుగులు చేసింది. క్రీజ్‌లో ప్రియాంక్ పంచల్(11), ఆర్యా దేశాయ్(10) ఉన్నారు.

నాగ్‌పూర్ వేదికగా విదర్భ-తమిళనాడు జట్ల మధ్య జరుగుతున్న మరో క్వార్టర్‌ఫైనల్లో విదర్భ జట్టు తొలిరోజు ఆట ముగిసే సరికి 6వికెట్ల నష్టానికి 264పరుగులు చేసింది. కరణ్ నాయర్ (100నాటౌట్) సెంచరీకి తోడు దానిష్ మలేవర్(75) బ్యాటింగ్‌లో రాణించారు.విదర్భ బౌలర్లు విజయ్ శంకర్‌కురెండు, మహ్మద్, సోను, అజిత్, అలీకి ఒక్కో వికెట్ దక్కాయి. పూణే వేదికగా జమ్ము-కాశ్మీర్, కేరళ జట్ల మధ్య జరుగుతున్న మరో క్వార్టర్‌ఫైనల్లో జమ్ము జట్టు తొలిరోజు 8వికెట్ల నష్టానికి 228పరుగులు చేసింది. కన్హయ(48), నాసిర్(44) బ్యాటింగ్‌లో రాణించారు. క్రీజ్‌లో యుధ్ వీర్ (17), ఆకిబ్(5) ఉన్నారు. కేరళ బౌలర్ నిధేశ్‌కు ఐదు వికెట్లు దక్కాయి.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68